లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

ఫిబ్రవరి 2021 రూ.10/-




## ఆర్థిక వృద్ధి, రాజకీయ అవసరం కోసమైనా 'చట్టబద్ధపాలన'ను సంస్కరించండి!

(ఫిబ్రవరి 20 నుండి జరగనున్న ఐడీఏడబ్ల్యూ సదస్సు సన్నాహక వెబినార్‌లో నిపుణుల మేలుకొలుపు)

## 'ఒకే ఎన్నిక' విఫల ప్రయోగం కాకూడదంటే...

పత్రికల్లో, టీవీల్లో వచ్చే హెడ్‌లైన్స్‌లో గణనీయ శాతం చట్టబద్ధపాలనకు సంబంధించినవే!
సోషల్ మీడియాలో షేర్ అయ్యే అంశాల్లో కూడా ఎక్కువ శాతం ప్రత్యక్షంగా, పరోక్షంగా చట్టబద్ధపాలనకు సంబంధించినవే!!
కానీ ఆ సంచలనాలకు కదిలిపోవటానికో, కన్నీరు కార్చటానికో, ఆవేశపడటానికో మాత్రమే పరిమితమైతే యధాతథ స్థితే కొనసాగుతుంది.  పరిష్కారంలో భాగమవుదాం, చట్టబద్ధపాలనను సంస్కరించేందుకు ఐడీఏడబ్ల్యూ నిర్వహిస్తున్న కార్యాచరణ సదస్సులో భాగస్వాములమవుదాం..
'చట్టబద్ధపాలన'పై ఈ నెల 20 నుంచి 28 వరకు ఐడీఏడబ్ల్యూ వర్చువల్‌గా నిర్వహించే ఈ సదస్సులో..
ఫిబ్రవరి 20, 21, 27, 28 తేదీల్లో వ్యవస్థీకృత సంస్కరణల మీద, మిగిలిన రోజుల్లో మిడ్ వీక్ సంభాషణల విభాగంలో ఇతర సంక్లిష్ట సమస్యల మీద చర్చలు ఉంటాయి.
వ్యవస్థీకృత సంస్కరణల్లో భాగంగా 'పోలీసింగ్, ప్రాసిక్యూషన్, ప్రొసీజరల్ చట్టాలు, న్యాయవ్యవస్థల్లో సవాళ్ల'పై 40 మందికిపైగా నిష్ణాతులు సమగ్ర చర్చ చేసి మెరుగైన భవిష్యత్తు కోసం ఆచరణసాధ్యమైన పరిష్కారాలను అందిస్తారు.

Register to IDAW's (Indian Democracy at Work) 2nd annual conference centered around 'Rule of Law' at http://idaw.in which is in collaboration with Jayaprakash Narayan, Indian School of Business, University of Hyderabad and Bharti Institute of Public Policy.

**- Foundation for Democratic Reforms**









ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

| సంపుటి | సంచిక | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| 24 | 02 | బండారు రామ్మోహనరావు | దూసనపూడి |
| ఫిబ్రవరి 2021 | | శిరమని నరేష్ | సోమసుందర్ |


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## కార్టూన్ కార్నర్




మన రాజకీయాల్లో కూడా ఇలాగే
వేలం ఉంటే ఎంత బావుంటుందో!!

కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,
సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# ఎన్నికల 'పంచాయతీ'

ఆంధ్రప్రదేశ్ పంచాయత్ రాజ్ సంస్థల ఎన్నికలు రెండు రాజ్యాంగ వ్యవస్థల మధ్య వివాదంగా మారడం విచారకరం. కరోనా కారణంగా ఎన్నికలు వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్ణయం తీసుకున్నారు. మాటమాత్రమైనా తమకు చెప్పకుండా కమిషనర్ ప్రక్రియ మధ్యలో వాయిదా నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర ముఖ్యమంత్రికి తీవ్ర ఆగ్రహాన్ని కల్గించింది. ఆయన పత్రికా సమావేశం పెట్టి ఎన్నికల కమిషనర్‌ను కులం పేరుతో నిందించారు. ముఖ్యమంత్రి చేసిన మాటల దాడి ఆయన ప్రభుత్వ పెద్దలకీ, పార్టీ పెద్దలకీ స్ఫూర్తినిచ్చింది. చిన్నా పెద్దా తేడా లేకుండా వారంతా ఎన్నికల కమిషనర్‌ను వ్యక్తిగతంగా, అసభ్యంగా నిందించడం మొదలు పెట్టారు. గత సంవత్సర కాలంగా సాగుతున్న మాటల దాడిలో అన్నిరకాల సభ్యతా ప్రమాణాలు గాలికి ఎగిరిపోయాయి!

రాజ్యాంగ నియమాల ప్రకారం పరస్పర విశ్వాసంతో, సమన్వయంతో సామరస్యంగా పని చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వమూ, రాష్ట్ర ఎన్నికల కమీషన్ పంతాలకు పోవడంతో రాజ్యాంగ సంక్షోభ పరిస్థితి దాపురించింది. వివాదం కార్యనిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థలన్నింటినీ చుట్టబెట్టింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యానించినట్లు ' రెండు వ్యవస్థల మధ్య వ్యక్తిగత అహంభావ యుద్ధం'గా వ్యవహారం జరిగింది. రెండు పక్షాలు న్యాయస్థానాలను ఆశ్రయించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానం జోక్యంతో ఎట్టకేలకు ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల ప్రక్రియ తిరిగి మొదలయ్యింది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్నికల కమీషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ వ్యక్తులుగా ఆయా రాజ్యాంగ వ్యవస్థలకు సారథ్యం వహిస్తున్నారు. దాంతో గత ఏడాదికాలంగా కొనసాగుతూ వచ్చిన వివాదం వారిద్దరి వ్యక్తిగత వ్యవహారంగా చర్చనీయాంశం అయ్యింది. రాజకీయ పక్షాలు, మీడియా మొత్తం బహిరంగ చర్చను అనవసర అంశాలపై రచ్చగా మార్చాయి. స్థాయిని మరిచి కొందరు నేతలు లేకిగా మాట్లాడటం శోచనీయం!

73వ రాజ్యాంగ సవరణ ఆకాంక్షించిన 'స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయడం' అనే అంశంపై ఎంతమాత్రమూ చర్చ జరగకపోవడం విచారకరం. స్థానిక ప్రభుత్వాల సాధికారతకోసం లోక్‌సత్తా సాగించిన పోరాటంలో భాగస్వాములైన కొందరు పెద్దలు ప్రయత్నించినా అధికార, ప్రతిపక్షాల మధ్య నడుస్తున్న రాజకీయ రచ్చగోలలో వారి మాటలు విన్పించలేదు. చర్చ పక్కదారి పట్టింది.

ఐదేళ్లకు విధిగా పంచాయత్‌రాజ్ సంస్థల ఎన్నికలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వాలు మొండికేస్తున్న అంశంపై జరగాల్సినంత స్థాయిలో చర్చ జరగలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 2018లో పంచాయతీ ఎన్నికలు జరగాల్సి వుంది. కోర్టు వివాదాల కారణంగా అప్పట్లో ఎన్నికలు జరగలేదు. రిజర్వేషన్ల ఖరారు విషయమై రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో లేకపోవడంతో వివాదం కోర్టుకు వెళ్లింది. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. దాంతో పంచాయతీ ఎన్నికలు వాయిదా పడిపోయాయి.

ఓటర్ల జాబితాల తయారీ, రిజర్వేషన్ల ఖరారు వంటి రాజ్యాంగబద్ధ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. దాంతో ఎన్నికలు నిరవధికంగా వాయిదా పడుతున్నాయి. ఎన్నికల కమిషన్లు నిస్సహాయంగా మిగులుతున్నాయి.

రాజ్యాంగబద్ధంగా స్థానిక ప్రభుత్వాలకు కేటాయించాల్సిన నిధులు, విధులు, అధికారాలు అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ వినూత్నమైన ఆలోచనే అయినప్పటికీ, వాటిపై కార్యనిర్వాహక వర్గానికే ఆధిపత్యం ఇచ్చారు. ఆర్టికల్ 243 ప్రకారం స్థానిక ప్రభుత్వాల పరిధిలో పని చేయాల్సిన సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం తన చేతిలో వుంచుకున్నది. ఆచరణలో శాసనసభ్యుని మాటపై గ్రామ సచివాలయాల సిబ్బంది వలంటీర్లు పని చేసే పరిస్థితి ఏర్పడింది.

రాజ్యాంగబద్ధమైన 'గ్రామ సభ'కు సర్వాధికారాలు ఉండగా వాటిని నిర్వీర్యం చేసి రాజకీయ నేతల పెత్తనానికే బాటలు వేసారు. వార్డు కమిటీలు, పంచాయతీలోని స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ కమిటీలు నామ మాత్రంగా కూడా పనిచేయడం లేదు. దాంతో ఎమ్మెల్యే కేంద్ర పరిపాలన పటిష్టం అయ్యింది. వికేంద్రీకరణ సూత్రం గాలికి ఎగిరిపోయింది.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ల పనితీరు కూడా సమర్ధవంతంగా లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కేటాయింపుల్లో ఫైనాన్సు కమిషన్ల మాటకు విలువ ఇవ్వడం లేదు. తలసరి గ్రాంటుల విడుదలలో ఏళ్ళ తరబడి తాత్సారం జరుగుతోంది. మూడంచెల స్థానిక ప్రభుత్వాలకు నిర్ణీత కాల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించి, స్థానిక ప్రభుత్వాలకు సాధికారిత కల్పించి, ఫైనాన్సు కమిషన్ సిఫార్సులు అమలు చేస్తే గ్రామీణ స్వపరిపాలన పటిష్టం అవుతుంది. ఎన్నికల్లో పోటీ చేసే వారికి సైతం ఇవేమీ పట్టడం లేదు. ఎన్నికల సందర్భంగా అయినా స్థానిక ప్రభుత్వాల సాధికారత చర్చనీయాంశంకాకపోవడం పెద్ద విషాదం.

డి. సోమ సుందర్

# చట్టబద్ధపాలన భారతీయ సంస్కృతిలో భాగమవ్వాలి



వేధింపులు, అత్యాచారాల్లో అమాయకులు బలైపోయినా వెనక బడాబాబులు, రాజకీయ నాయకులు ఉంటే నిజాలు బైటికి రావు, అరెస్టులు, సాక్ష్యాలు ఉండవు, ఎన్‌కౌంటర్లలో నిజాలు తెలియవు, అధికారంలో ఉన్నవారు, వారి బంధుమిత్ర సపరివారం చట్టాన్ని ఎలా ఉల్లంఘించినా, ఎంత రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినా కేసులుండవు, సాక్ష్యాలు లేవని తీవ్ర నేరాల కేసుల్ని కూడా కొట్టి వేస్తారు, మనకు సేవలందించాల్సిన పోలీసు స్టేషన్‌లలో వేధింపులు లేకుండా పనులు చేసి పెడతారని గూండాలకి, వాజమ్మలకి కూడా ఓట్లు వేసేస్తుంటాం, రోడ్ల మీద వీరంగం చేసి ఎవరైనా జనజీవనాన్ని స్తంభింపచేసేయొచ్చు, అక్రమ మద్యం వ్యాపారాల్ని, రౌడీయిజాన్ని అడ్డుకునేవారుండరు, ప్రజల రోజువారీ భద్రతకు కనీస గ్యారంటీ ఉండదు - ఇదీ మన చట్టబద్ధపాలన! కుటుంబ వ్యవస్థో, మరో సాంస్కృతిక విలువో సమాజంలో బలంగా ఉన్న కారణంగా మన దేశంలో పరిస్థితి అదుపులో ఉన్నట్టు కనిపిస్తుందిగానీ, ఇక్కడేదో పటిష్టమైన చట్టబద్ధ పాలన ఉండబట్టి కాదు. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ఆ అంతర్గత బలాలు కూడా చాలటం లేదు. సాంకేతిక వినియోగంలో పోలీసుల కంటే నేరస్తులు ముందుంటున్నారు. దీనికితోడు, చిన్న నేరాలను కట్టడి చేసి పెద్ద నేరాలను నివారించే వ్యవస్థీకృత ఏర్పాట్లు మనకు లేకపోవటం వల్ల నేరసంస్కృతి ఏదోకరోజు ఉపద్రవంలా సమాజం మీద విరుచుకుపడే ప్రమాదం పెరుగుతోంది. అందుకే ఈవేళ భారతదేశం ఎదుర్కొంటున్న పెనుసవాళ్లలో చట్టబద్ధ పాలన ముందు వరుసలో ఉంది. ఓట్లు, సీట్లు, వసూళ్లు, వంశపారంపర్య పదవులు తప్ప ప్రజల భద్రతను పట్టించుకోని రాజకీయానిదే ఈ నేరం.

ఆటవిక రాచరికపు రోజుల్లో కూడా చట్టబద్ధపాలన తొలి ప్రాధాన్యతాంశంగా ఉండేది. క్రూరులైన చక్రవర్తులు సైతం ప్రజలను కాపాడటానికి తన, పర భేదం లేకుండా న్యాయాన్ని అమలుచేసిన దాఖలాలు అనేకం ఉన్నాయి. కానీ ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థ అని చెప్పుకుంటున్న నేటి భారతదేశంలో మాత్రం పదవిలో ఉన్నవారిని, డబ్బున్నవారిని కాపాడటానికి.. సామాన్యుల్ని శిక్షించటానికే చట్టవ్యవస్థలు పనిచేస్తున్నాయనటానికి రుజువులు కోకొల్లలు. ప్రభుత్వాలు తాము మొట్టమొదట చేయాల్సిన చట్టబద్ధపాలనతో పాటు ప్రజలకు భద్రత, రవాణా, మౌలికసదుపాయాల కల్పన, విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు అందించటం వంటి మౌలిక బాధ్యతల్ని వదిలేసి, తాత్కాలిక తాయిలాలివ్వటం, ప్రజల వ్యక్తిగత జీవితాల్ని శాసించటం వంటి కార్యక్రమాల్లో మునిగితేలుతున్నాయి. హక్కులు, విధులతో చట్టబద్ధ పాలనను మనం ఒక సంస్కృతిగా మార్చుకోకపోతే ప్రజలకు భద్రత ఎండమావే అవుతుంది. ప్రభుత్వాలు మారుతుంటాయిగానీ, వేధింపులు, ర్యాగింగ్‌లు, అత్యాచారాలు, కబ్జాలు, ఎన్‌కౌంటర్లు, లింగ, కుల వివక్షలు కొనసాగుతూనే ఉంటాయి. ఎంత అభివృద్ధిని సాధించామని చెప్పుకున్నా ఏదోకరోజు అలవిమాలిన సంక్షోభం తప్పదు.

చట్టబద్ధపాలన ఆచరణలోకి రావటానికి న్యాయ, పోలీసు సంస్కరణలు ఎంతో కీలకం. వీటిల్లో పోలీసు సంస్కరణల్ని సాధించటానికి భారతదేశ నేపథ్యంలో కొంత ఎక్కువ ఓపిక కావాలి. మన రాజ్యవ్యవస్థ ఇంకా కేంద్రీకృత పాలనతో అర్ధ ఫ్యూడల్ స్వభావంతో నడుస్తుండటమే ఇందుకు పెద్ద కారణం. అలాంటి రాజకీయ పెత్తనం సాగాలంటే పోలీసు బలగం ఉండాలి. పోలీసులతో అణచివేత చేయించాలి.

పోలీసు వ్యవస్థని సంస్కరించటానికి అనేక ఇతర రంగాల్లో కూడా సంస్కరణల్ని తీసుకురావాల్సుండటం, ఇంత వ్యవస్థీకృతంగా సంస్కరణల్ని తెచ్చే సంకల్పం, ఓపిక, సామర్థ్యం మన రాజకీయ, అధికార వ్యవస్థలకు లేకపోవటం కూడా సమస్యగా ఉంది.

దాంతోపాటు, నేతల్లో ఓ భయం కూడా ఉంది. ఒక విభాగం చేసిన తప్పుల్ని సరిచేయటానికి ఇంకో విభాగం తప్పులు చేయటం, ఒక విభాగాన్ని సంస్కరించటమంటే సరైన ప్రత్యామ్నాయమేమిటో తెలియకుండా ఉన్నవాటన్నిటినీ కూల్చిపారేయాలనే ధోరణి ఆనవాయితీగా కొనసాగుతుండటంతో.. మన వ్యవస్థలో పోలీసు విభాగాన్ని ముట్టుకుంటే ఏం గందరగోళమొస్తుందోనన్న భయం పాలకుల్ని వెన్నాడుతోంది.

ఈ అవరోధాలన్నిటితోపాటు, శాంతిభద్రతల సమస్య, అత్యాచారాలు, ఎన్‌కౌంటర్లు వంటివి జరిగితే రాస్తారోకోలు, ధర్నాలు చేయటం తప్ప పోలీసు సంస్కరణల కోసం ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజం, ప్రజాసంఘాల నుంచి చొరవ కనిపించటం లేదు. కొంత ప్రయత్నం చేస్తున్నవారు కూడా పోలీసు సంస్కరణలు అంటే డీజీపీల నియామక పద్ధతులు, పదవీ కాలం పెంపు అనుకుంటున్నారు. సంస్కరణల్ని కేవలం పోలీసుల దృష్టితో చూస్తే చాలదు. సమాజం అవసరాల్ని, పోలీసు యంత్రాంగం సరిగా పనిచేయటానికి కావలసిన అవసరాల్ని రెండింటినీ మేళవించటం ఎట్లాగ? అన్న సమగ్ర దృష్టి కావాలి. పూర్తి అధికారాన్ని ఎవరికిచ్చినా చాలా ప్రమాదకరం. ఎలాంటి అధికారం

ఇచ్చినా కూడా.

'మాకు చట్టబద్ధపాలన కావాలి, అందుకోసం పోలీసు సంస్కరణల్ని అమలు చేయాలి.. తక్కువ ఖర్చుతో వేగంగా న్యాయం అందించేందుకు, దోషుల్ని శిక్షించేందుకు ప్రతి 50,000 జనాభాకు ఒక స్థానిక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలి (లోక్‌సత్తా కృషితో 2009లో స్థానిక న్యాయస్థానాల (గ్రామన్యాయాలయాల) చట్టం వచ్చింది. కానీ వీటిని ఏర్పాటు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి)'.. ప్రాసిక్యూషన్ విధానాన్ని ప్రక్షాళన చేయాలి.. ఉన్నత న్యాయమూర్తుల నియామకాల సంస్థ, అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు, మిగిలిన న్యాయసంస్కరణలన్నీ అమలు చేయాలి' అని మనందరం అవగాహనతో గళం విప్పి ఏకతాటిపై పోరాడితేనే ప్రభుత్వాలు కదులుతాయి.




చట్టబద్ధపాలన అనేది నినాదం కాదు. మనందరికీ రోజువారీ అత్యావశ్యకం. మనలో ఎక్కువమందికి తెలుసో, తెలియదో, ఈనాటికి కూడా బ్రిటన్‌లో రాణి గాని, రాజు గాని హౌస్ ఆఫ్ కామన్స్‌కి వెళ్లటం చట్టవిరుద్ధం. దేశానికే రాజు.. కానీ అక్కడున్నటువంటి, మన పార్లమెంటు, మన లోక్‌సభకి సమానమైనటువంటి హౌస్ ఆఫ్ కామన్స్‌కి వెళ్లటం చట్టవిరుద్ధం. అక్కడికి వెళితే, ఆ రాజుకో, రాణికో శిక్షపడుతుంది. ఆ కారణంగా ప్రతి ఏడాది ఉభయ సభలను ఉద్దేశించి మన రాష్ట్రపతిలాగా అక్కడ రాణి ప్రసంగం చేస్తున్నప్పుడు హౌస్ ఆఫ్ లార్డ్స్‌కి వెళ్లిమాట్లాడతారు. హౌస్ ఆఫ్ లార్డ్స్‌లోనేమో సీట్లు చాలవు. వీళ్లందరూ అక్కడి హౌస్ ఆఫ్ లార్డ్స్‌కి పోతారు. దీంతో మెంబర్లు బెంచీల మీద, కుర్చీల మీద ఎగబడి నిల్చోవలసి వస్తుంది. అంటే చట్టం.. అది సాంప్రదాయమే కావచ్చు, కానీ ఒక చట్టం ఉంది కాబట్టి, దాన్ని ఈనాటికి కూడా తూచ తప్పకుండా పాటించటం జరుగుతుంది. ఎందుకని మ్యాగ్నాకార్టా వచ్చింది, ఎందుకని ఇలాంటి నిబంధనలు ఏర్పడ్డాయి, ఎందుకని అమెరికన్ రాజ్యాంగం వచ్చింది, ఎందుకని మన రాజ్యాంగం వచ్చింది, ఎందుకని ఈ కట్టుబాట్లు చేసుకున్నాం అంటే.. రాజైనా, బంటైనా, ఉన్నతాధికారి అయినా, సామాన్యుడైనా, చట్టం ముందు సమానంగా ఉండాలి, చట్టం రక్షణ సమానంగా అందరికీ లభించాలి.

చట్టబద్ధపాలన నెలకొనాలంటే పోలీసు యంత్రాంగానికిగానీ, న్యాయవ్యవస్థకుగానీ ఓ పక్కన సామర్థ్యం కావాలి, సైబర్ యుగ సాంకేతిక అవగాహన ఉండాలి, మరోపక్క నిజాయతీ, నిష్పాక్షికత, స్వతంత్రంగా పనిచేసేటువంటి స్థయిర్యం కావాలి, జవాబుదారీతనముండాలి, అన్నిటినీ మించి ప్రజల్లో విశ్వసనీయత కావాలి. ఈ మొత్తాన్నీ సంస్థాగతంగా కలగలిపితేగానీ నిజమైన చట్టబద్ధపాలన రాదు.

అలాగే ఆర్థిక వృద్ధికి, సామాజిక భరోసాకీ చట్టబద్ధపాలన ఎంతో కీలకం.

చట్టబద్ధపాలన, ఆర్థిక వృద్ధి రెండూ పరస్పరం ఆధారపడి, పరస్పరం పటిష్టపరచుకునేవి. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న సమాజంలో నేరాల్ని నియంత్రించటం, శాంతి భద్రతల్ని పరిరక్షించటం ఎంతో కీలకం. బలమున్నవాడిదే బర్రె అనే ధోరణే కొనసాగితే.. నేరాలు విజృంభిస్తాయి, అంబేద్కర్ హెచ్చరించిన అరాచక వ్యాకరణం ('గ్రామర్ ఆఫ్ యానార్కీ') పెచ్చరిల్లి అవ్యవస్థ వ్యవస్థీకృతమవుతుంది. ఆర్థిక కలాపాలు, సంపద సృష్టి క్షీణిస్తాయి. వివాదాలను నిష్పాక్షికంగా, వేగంగా, సమర్థవంతంగా, అందుబాటు ఖర్చులో పరిష్కరించటం పరస్పర విశ్వాసానికి, ఆర్థిక ప్రగతికి ఎంతో అవసరం! వ్యక్తిగత ఆస్తి హక్కులను కాపాడటం, పక్షపాతరహితంగా, సమన్యాయంతో ఒప్పందాల అమలు, న్యాయమైన కార్మిక చట్టాల అమలు, సమాజంలో అన్ని వర్గాలకీ అవకాశాలు అందుబాటు వల్ల.. వ్యాపార, వాణిజ్యాలు విలసిల్లుతూ విస్తరించే సంస్కృతి ఏర్పడుతుంది. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ఒప్పందాలు, వాణిజ్య వ్యవహారాలు పెరుగుతుంటాయి కాబట్టి వివాదాలు తప్పవు. కోర్టుల ద్వారా వివాదాల్ని విశ్వసనీయమైనరీతిలో, వేగంగా, తక్కువ ఖర్చు పద్ధతుల్లో పరిష్కరించే ఏర్పాటు లేకపోతే, ప్రజలు చట్టానికి ఆవల పరిష్కారాల్ని వెతుక్కునే ప్రయత్నం చేస్తారు. దీంతో సంఘటిత నేరాలు, అవినీతి, హింస పేట్రేగుతాయి. చివరికి, పరస్పర విశ్వాసమన్నదే లేకుండా పోతుంది. ప్రజలు చొరవ తీసుకోవటానికి జంకుతారు, పెట్టుబడులు పడిపోతాయి, ఆర్థిక వృద్ధి కుంగి, పేదరికం కొనసాగుతుంది. ఇది సమాజాన్ని అరాచకంలోకి నెడుతుంది.

ఈ నేపథ్యంలో చట్టబద్ధపాలనపై నిష్ణాతుల భాగస్వామ్యంతో సమగ్ర చర్చను నిర్వహించి ఆచరణీయ పరిష్కారాలను ప్రజలు, పౌర సమాజం, మాధ్యమాలు, రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వాల్లోకి తీసుకెళ్లేందుకే ఐడీఏడబ్ల్యూ (ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్) రెండవ సదస్సును ఈ అంశంపై ఏర్పాటు చేశాం.

'చట్టబద్ధ పాలన'పై ఎఫ్‌డీఆర్, ఐఎస్‌బీ, హెచ్‌సీయూల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20 నుంచి వర్చువల్‌గా జరగనున్న ఐడీఏడబ్ల్యూ సదస్సులో పాల్గొనేందుకు www.idaw.in లో నమోదవ్వగలరు.

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

# 'చట్టబద్ధపాలన' కోసం కలసి రండి..

# 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్'




## రెండో వార్షిక సదస్సు ఫిబ్రవరి 20 నుండి

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం చేయాల్సిన అతి ముఖ్యమైన పని చట్టబద్ధపాలన!

చట్టబద్ధ పాలన లేకుండా మిగిలినవన్నీ నామమాత్రమే.

భారతదేశానికి చట్టబద్ధపాలనలో పాస్ మార్కులు కూడా రావు.

మన ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల పరిమిత విశ్వాసమే ఉంది.

పెద్ద ప్రజాస్వామిక దేశాలన్నిటిలో అతి ఎక్కువ కేసులు పేరుకుపోయి ఉన్నదీ, అతి తక్కువ నేరనిరూపణ అవుతున్నదీ పవిత్ర భారతదేశంలోనే.

ప్రజలకు భద్రతనిస్తూ వారికి సేవలు అందించాల్సిన పోలీసు వ్యవస్థ జనం మీద జులుం చెలాయించేందుకు ప్రభుత్వం చేతిలో ఆయుధంగా మారింది.

నేర దర్యాప్తును సమర్థంగా చేయటంలో, పోలీసులకు తోడ్పాటునందించటంలో ప్రాసిక్యూషన్ విఫలమవుతోంది.

న్యాయవ్యవస్థ మితిమీరిన భారంతో, మందకొడిగా, కాలం చెల్లిన పద్ధతులతో సాగుతోంది.

న్యాయవ్యవస్థ ఇంత వెనుకబాటుతో ఉంటే భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్యం మనుగడ ఎలా సాధ్యమవుతుంది?

.. భారతదేశం ఎదుర్కొంటున్న ఈ పెద్ద సంక్షోభం మీదే




'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) రెండవ వార్షిక సదస్సును ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/జయప్రకాష్ నారాయణ్, భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ/ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) నిర్వహించబోతున్నాయి.


'చట్టబద్ధ పాలన' అంశంపై దృశ్యమాధ్యమంలో జరిగే ఈ వార్షిక సదస్సు చర్చల్లో.. ఉన్నత స్థాయి న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, ఇతర రంగాల సుప్రసిద్ధ నిష్ణాతులు 40 మందికిపైగా పాల్గొంటారు. మన న్యాయవ్యవస్థను పీడిస్తున్న నిర్దిష్ట సమస్యలపై ప్రసంగిస్తారు, చర్చిస్తారు.

**చట్టబద్ధపాలనలో దుస్థితిని తొలగించి దేశాభివృద్ధికి దోహదం చేసేందుకు,**
**ప్రజాస్వామ్య ప్రక్రియను పటిష్ఠం చేసేందుకు చేతులు కలపవలసిందిగా, ఈ సదస్సులో పాల్గొనవలసిందిగా అందరికీ విజ్ఞప్తి.**
**సదస్సు (వర్చువల్) అంశం: చట్టబద్ధపాలన**
**ఉప అంశాలు: పోలీసింగ్‌లో సవాళ్లు, ప్రాసిక్యూషన్‌లో సవాళ్లు, ప్రొసీజరల్ చట్టాల్లో సవాళ్లు, న్యాయవ్యవస్థలో సవాళ్లు**
**తేదీలు: 2021, ఫిబ్రవరి 20 నుంచి 28 వరకు/ రిజిస్ట్రేషన్ కొరకు:** www.idaw.in

**సంఘటిత కృషితో పరిష్కారంలో భాగమవుదాం .. భారత్‌లో ప్రగతిశీల పరివర్తనను సాధిద్దాం!**

FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS | ISB Bharti Institute of Public Policy | हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

# 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' 2021 మిడ్-వీక్ సంభాషణలు





'ఐడీఏడబ్ల్యూ సదస్సులో ప్రధానంగా వ్యవస్థీకృత సంస్కరణల మీదే దృష్టి పెట్టి ఫిబ్రవరి 20, 21, 27, 28 తేదీల్లో చర్చిస్తున్నప్పటికీ.. చట్టబద్ధపాలనకు ఇటీవలికాలంలో సవాళ్లు విసురుతున్న కొన్ని సంక్లిష్ట సమస్యల మీద కూడా ఇదే వారంలో చర్చించాలని నిర్ణయించటమైంది. వారం మధ్యలో ఉండే మిగిలిన రోజుల్ని ఇందుకు ఉపయోగించుకుంటారు. మిడ్-వీక్ సంభాషణల విభాగంలో ఈ చర్చ ఉంటుంది. ఇందులో భాగంగా.. సోషల్ మీడియా యుగంలో నకిలీ వార్తలు (ఫేక్ న్యూస్), మహిళల భద్రత, సైబర్ క్రైమ్ అంశాలపై ఫిబ్రవరి 23, 24, 25 తేదీల్లో చర్చిస్తారు.

అలాగే ఆర్థిక వృద్ధికి కూడా చట్టబద్ధపాలన ఎంతో కీలకం కాబట్టి.. 'చట్టబద్ధపాలన-ఆర్థిక వ్యవస్థ'పై ఫిబ్రవరి 26న సంభాషణలు ఉంటాయి.



























# పోలీసు వ్యవస్థను బాగుచేయకపోతే శాంతి, ప్రగతి మిథ్య!

**– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

నగర జీవనానికి, నేరాలకు అవినాభావ సంబంధముంది. అందుకే నేరగాళ్లను అదుపుచేయటానికి బలమైన పోలీసు యంత్రాంగం అవసరమవుతోంది. చట్టబద్ధపాలనకు నిజాయతీగల పటిష్టమైన పోలీసు వ్యవస్థ ప్రాణం. కర్తవ్య పాలన చేసే పోలీసు అధికారులే లేకపోతే ఇక మిగిలేది అరాచకత్వమే. మన రాజకీయంలో పెరుగుతున్న హింస, అవినీతి, అక్రమాల పుణ్యమా అని పౌరులకు దుష్పరిపాలన రోజువారీ అనుభవమయిపోయింది. న్యాయవ్యవస్థ నత్తనడక వల్ల శాంతియుతంగా తగాదాల పరిష్కారానికి, నేరగాళ్ల శిక్షలకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. దీనికితోడు ప్రజాస్వామ్య సంస్కరణలు చేపట్టకుండా ఆర్థిక సరళీకరణతో కేవలం ప్రభుత్వానికి ఆర్థిక విషయాలలో ఉన్న విచక్షణను మాత్రమే అదుపుచేసే ప్రయత్నం జరగటంతో సమాజంలో నేరప్రవృత్తి మరింతగా పేరుకుపోతోంది. అధికార దుర్వినియోగం ఆర్థిక విషయాల నుంచి నేరపరిశోధనలోకి.. న్యాయవ్యవస్థ వైఫల్యాన్ని అడ్డం పెట్టుకుని డబ్బుతో, కండబలంతో బండన్యాయాన్నందించటం వైపునకు మళ్లింది. పోలీసు యంత్రాంగాన్ని ఏ దేశంలోనూ ప్రైవేటీకరించలేం. అందుకే పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగపరిచే సాంప్రదాయం ఇటీవల మరింత బలపడింది. ఆర్థిక స్వేచ్ఛ వల్ల నిజమైన సంపద పెరగాలన్నా, ఉపాధి కల్పన జరగాలన్నా, వినియోగదారుడికి న్యాయం కలగాలన్నా, సాంఘిక న్యాయం అందాలన్నా- చట్టబద్ధపాలనకు కావలసిన ఏర్పాట్లు చేయకుండా, అందుకవసరమయిన ప్రజాస్వామ్య సంస్కరణలు చేపట్టకుండా, ఏవో కొన్ని ఆర్థిక సంస్కరణల్ని ప్రవేశపెట్టినంత మాత్రాన సమాజానికి దీర్ఘకాలం మంచి ఫలితాలు వస్తాయని ఆశించటం భ్రమ.

మన రాష్ట్రంలో ఇటీవల పోలీసు శాఖ గురించి బయటపడ్డ కొన్ని ఉదంతాలు ఎంతో ఆందోళన కలగజేస్తున్నాయి. ఓ మాజీ నక్సలైటు చేస్తున్న అరాచకాలకు, పాల్పడుతున్న నేరాలకు వెనక కొందరు పోలీసు అధికారుల అండదండలున్నాయన్న వార్త కలవరపెడుతోంది. నక్సలైట్లను అదుపుచేయాలనే వంకతో పోలీసులే నేరగాళ్లకు అండగా నిలుస్తూ అక్రమార్జనకు పాల్పడటం అవినీతికి పరాకాష్ట. మరో పేరుమోసిన నేరగాడితో, మోసగాడితో కొందరు పోలీసు అధికార్లకు అక్రమ లావాదేవీలు, వ్యాపార సంబంధాలు ఉన్నాయని బయటపడింది. నేరాలను అదుపు చేయవలసిన పోలీసులు నేరగాళ్లతో చేతులు కలపటం అత్యంత భయానకమయిన విషయం. ఇటీవల సంచలనాన్ని రేకెత్తించిన కత్తుల సమ్మయ్య, శ్రీనివాస్‌ల ఉదంతాలు ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

**నగరీకరణతో నేర ప్రవృత్తి**

ఆధునిక సమాజంలో సహజీవనం చేస్తూ పక్కపక్క ఇళ్లలో ఉండేవాళ్లు కూడా అపరిచితులుగా ఏ సంబంధాలు లేకుండా ఏళ్ల తరబడి నివసిస్తున్నారు. దాంతో నేరాల సంఖ్య పెరిగిపోతోంది. నగర జీవనానికి, నేరాలకు అవినాభావ సంబంధముంది. అందుకే నేరగాళ్లను అదుపుచేయటానికి బలమైన పోలీసు యంత్రాంగం అవసరమవుతోంది. చట్టబద్ధపాలనకు నిజాయతీగల పటిష్టమైన పోలీసు వ్యవస్థ ప్రాణం. కర్తవ్య పాలన చేసే పోలీసు అధికారులే లేకపోతే ఇక

మిగిలేది అరాచకత్వమే. మన రాజకీయంలో పెరుగుతున్న హింస, అవినీతి, అక్రమాల పుణ్యమా అని పౌరులకు దుష్పరిపాలన రోజువారీ అనుభవమయిపోయింది. న్యాయవ్యవస్థ నత్తనడక వల్ల శాంతియుతంగా తగాదాల పరిష్కారానికి, నేరగాళ్ల శిక్షలకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. ఈ పరిస్థితులలో పోలీసు శాఖపై ఒత్తిడి విపరీతంగా పెరిగిపోయింది. ఎన్ని లోపాలున్నా సమర్థులయిన పోలీసు అధికారులు, శ్రమించే సిబ్బంది సమాజంలో శాంతిని కొంతమేర కన్నా కాపాడగలుగుతున్నారు. కొద్దివారాల క్రితం జూబ్లీహిల్స్‌లో ఓ బాలికను కొందరు దుండగులు ఎత్తుకుపోయినప్పుడు కేవలం కొందరు సమర్థ పోలీసుల చొరవ, విధి నిర్వహణలో వారు చూపిన చాకచక్యం ఆమెను కాపాడాయి. పోలీసులు ఆ కేసులో సమర్థంగా పనిచేయకపోతే జంటనగరాలలో లక్షల కుటుంబాలు క్షణం క్షణం భయాందోళనలకు గురయ్యేవి. కాబట్టి మన అక్కసును పోలీసు యంత్రాంగం మొత్తం మీద చూపి దాన్ని నిర్వీర్యం చేయకూడదు. అది కొండనాలిక్కి మందు వేస్తే ఉన్న నాలిక ఊడిపోవటం లాంటిది. పోలీసు యంత్రాంగంలో నేరప్రవృత్తి, అక్రమార్జన పరులతో లాలూచీ, నేరగాళ్లతో సన్నిహిత సంబంధాలు పెరిగితే అది సమాజాన్ని నాశనం చేసి తీరుతుంది. అందువల్లనే చట్టాన్ని కాపాడవలసిన పోలీసులలోనే నేరాలను ప్రోత్సహించే తత్వం ఎందుకు పెరుగుతోందో కూలంకషంగా చర్చించుకోవటం, ఆ అక్రమాలకు చరమగీతం పాడటం అవసరం.

చాలా సంవత్సరాలుగా రాజకీయులు పోలీసు యంత్రాంగాన్ని వాడుకుని అక్రమార్జన చేయటానికి అలవాటుపడ్డారు. నగరాలలో భూమి విలువ విపరీతంగా పెరిగిపోవటంతో ఆ భూముల్ని ఆక్రమించుకోవటం, భూమి తగాదాలున్నప్పుడు కండబలంతో బెదిరించి మొరటుగా ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవటం మనకు తెలిసిన విషయమే. ఇలా అక్రమార్జన చేసే వారికి చట్టాన్ని కాపాడటం కోసం ఆయుధాలను ధరించే పోలీసులు సుశిక్షితులయిన సైనికులుగా ఉపయోగపడటం రివాజయింది. న్యాయం విఫలమయిన వ్యవస్థలో కండబలం ఉన్నవాడిదే న్యాయం. కాబట్టి పోలీసు అండ ఎవరికుంటే వాళ్ల చేతుల్లోనే ఆస్తి, డబ్బు, అధికారం ఉంటున్నాయి. అలాగే హింసా రాజకీయాలకు పాల్పడే ముఠా నాయకులకు, నేరచరిత్ర గల నాయకులకు, నేర సామ్రాజ్య చక్రవర్తులకు పోలీసుల అండ అవసరమయింది. తమను నిరోధించవలసిన పోలీసులు తమ అడుగులకు మడుగులొత్తే బంట్లుగా మారితే ఇక నేరగాళ్లకు, ముఠా నాయకులకు కావలసిందేముంది? ఇలా పోలీసుల మీద తమ ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తూ ఎందరో మంత్రులు, శాసన సభ్యులు, నాయకులు కోట్లకు పడగలెత్తుతున్నారు. అవినీతిపరులైన అధికారులకు కాలక్రమేణా కొన్ని విషయాలు తెలిసివచ్చాయి. తమ అండతోనే నాయకులు కోట్లు గడిస్తున్నారని, ముఠా పెద్దలు ఘరానా మనుషులుగా చెలామణీ అవుతున్నారని, నేరచరితులు రాజకీయంలో వర్ధిల్లుతున్నారని బోధపడ్డాక ఇతరుల కోసం తమ శక్తిని ధారపోసే బదులు తామే అక్రమాలకు పాల్పడి అంతులేని డబ్బు సంపాదించవచ్చు కదా! కోర్టులు విఫలమయినప్పుడు, పౌరసమాజం బలహీనమయినప్పుడు, నాయకులకు నైతికాధికారం లోపించినప్పుడు, ఎన్నికలలో గెలవాలంటేనే పోలీసుల అండతో అక్రమాలకు పాల్పడటం అవసరమయినప్పుడు, తమ చేతిలో ఉన్న ఆయుధాలను, తాము వేసుకున్న ఖాకీ బట్టలను, చట్టం తమకిచ్చిన అధికారాన్ని తామే ఉపయోగించుకుని అందలాలెక్కవచ్చు కదా! తాము నాయకులకు పావులుగా ఉపయోగపడి వాళ్లు చెప్పినట్టల్లా తలాడించటమెందుకు? అందుకే కాలక్రమేణా కొందరు పోలీసు అధికారులు సమాజానికి చీడపురుగుల్లా తయారయ్యారు.

రాజకీయంలో నేరస్తుల ప్రవేశం కూడా సరిగ్గా అలాగే జరిగింది. ఒకప్పుడు నేరగాళ్ల అండతో ప్రజలను భయభ్రాంతులను చేయటం, పోలింగ్‌బూత్‌లను ఆక్రమించుకోవటం, యధేచ్ఛగా రిగ్గింగుకు పాల్పడటం, అక్రమాల ద్వారా పదవుల్లోకి రావటం జరిగేవి. అలా వచ్చిన అధికారంతో ఆ నేరగాళ్లకు నాయకులు అండగా ఉండేవారు. కాలం గడిచినకొద్దీ ఆ నేరగాళ్లే ప్రత్యక్ష రాజకీయంలోకి ప్రవేశించి స్వయంగా అధికారం చేపట్టడానికి అలవాటుపడ్డారు. అలాగే నేరగాళ్లయిన నాయకులకు, అక్రమార్జనపరులకు పావులుగా ఉపయోగపడుతున్న అధికారులు తామే స్వయంగా అక్రమాలకు, అవినీతికి, నేరాలకు పాల్పడటం నేర్చుకుంటున్నారు. పోలీసు వ్యవస్థను అక్రమ పద్ధతుల ద్వారా స్వప్రయోజనాల కోసం వాడుకోందే క్షణం కూడా నిలవలేని రాజకీయ వ్యవస్థ ఆ పోలీసులను అదుపు చేసే శక్తిని కోల్పోయింది. అక్రమాలకు పాల్పడే పోలీసు అధికారులు, అధికారం కోసం, లంచాల కోసం అడ్డదారులు తొక్కే నాయకులు సహజంగానే కుమ్మక్కయ్యారు. దీనికితోడు ప్రజాస్వామ్య సంస్కరణలు చేపట్టకుండా కేవలం ప్రభుత్వానికి ఆర్థిక విషయాలలో ఉన్న విచక్షణను మాత్రమే అదుపుచేసే ప్రయత్నం జరగటంతో సమాజంలో నేరప్రవృత్తి మరింతగా పేరుకుపోతోంది. అదివరకు ప్రభుత్వాలలో అవినీతి ప్రధానంగా లైసెన్సులు, కాంట్రాక్టులు, టెండర్లు, పర్మిట్లు, కోటాల రూపంలో ఉండేది. పాలకులకు ఆర్థిక విషయాలలో అలవిమాలిన విచక్షణ ఉండటంతో ప్రజలను, వ్యాపారస్తులను, పారిశ్రామికవేత్తలను వేధించి సొమ్ము చేసుకునేవారు.

క్రమక్రమంగా ఆర్థిక సరళీకరణతో ఈ విచక్షణాధికారం అంతరిస్తున్నది. అయితే ప్రభుత్వాధికారాన్ని నిరాటంకంగా స్వప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసే అవకాశాలు ఏమాత్రం తగ్గలేదు. దాంతో ఈ అధికార దుర్వినియోగం ఆర్థిక విషయాల నుంచి నేరపరిశోధనలోకి, న్యాయవ్యవస్థ వైఫల్యాన్ని అడ్డం పెట్టుకుని డబ్బుతో, కండబలంతో బండన్యాయాన్నందించటం వైపునకు మళ్లింది. పోలీసు యంత్రాంగాన్ని ఏ దేశంలోనూ ప్రైవేటీకరించలేం. అందుకే పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగపరిచే సాంప్రదాయం ఇటీవల మరింత బలపడింది. ఇప్పుడు ఆర్థిక విధానాలు మంచివవునా కాదా అనే చర్చ అప్రస్తుతం. ప్రజల స్వేచ్ఛను హరించి ప్రతి పనికీ ఆంక్షలు విధించి అడుగడుగునా లంచాలు మింగే కంట్రోళ్ల సంస్కృతి మంచిదని ఎవరూ వాదించలేరు. కానీ ఆర్థిక స్వేచ్ఛ వల్ల నిజమైన సంపద పెరగాలన్నా, ఉపాధి కల్పన జరగాలన్నా, వినియోగదారుడికి న్యాయం కలగాలన్నా, సాంఘిక న్యాయం అందాలన్నా– చట్టబద్ధపాలనకు కావలసిన ఏర్పాట్లు చేయకుండా, అందుకవసరమయిన ప్రజాస్వామ్య సంస్కరణలు చేపట్టకుండా, ఏవో కొన్ని ఆర్థిక సంస్కరణల్ని ప్రవేశపెట్టినంత మాత్రాన సమాజానికి దీర్ఘకాలం మంచి ఫలితాలు వస్తాయని ఆశించటం భ్రమ. మన దేశంలో చాలాకాలంగా చట్టబద్ధపాలన, పౌరుడికి న్యాయం మృగ్యమయిపోయాయి. రాజ్యాంగం, చట్టాలు ఏమి చెబుతున్నా, వాస్తవానికి విచక్షణలేని విశృంఖలాధికారం కింద సామాన్యులు నలిగిపోతున్నారు. న్యాయవ్యవస్థ వైఫల్యానికి పోలీసులు పెట్టే చిత్రహింసలే పరిష్కారమని, నక్సలైటు సమస్యకు వాళ్లను పెడరెక్కలు విరిచి కట్టి బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపటమే విరుగుడని, నేరస్తుల అదుపునకు లాకప్ హత్యలే సరైన పద్ధతని అంగీకరిస్తే సమాజం పూర్తిగా పతనమయిపోవటం ఖాయం. అలా పోలీసు వ్యవస్థకు చట్టం ఇవ్వని అధికారాల్ని మనం కట్టబెడితే, ఆ పోలీసుల చేతుల్లో లాఠీలు ప్రజల తలల మీద కరాళ నృత్యం చేయటం ఖాయం. అలాంటి పోలీసులు కాలక్రమేణా దమననీతికి, కర్కశత్వానికి అలవాటుపడి కరడుకట్టిన నేరస్తుల కంటే క్రూరంగా, పరమ దుర్మార్గులకన్నా అక్రమంగా ప్రవర్తించటం అతి సహజమయిన పరిణామం. అందుకే కొందరు అక్రమార్జనపరులయిన పోలీసు అధికారులు నేరగాళ్లతో, మాఫియా నేతలతో, మోసగాళ్లతో కుమ్మక్కై కోట్లకు పడగలెత్తుతున్నారు.

**ఒకే గాటన కట్టడం ప్రమాదకరం**

బలమైన, సమర్థమైన, నిజాయతీగా వ్యవహరించే పోలీసు యంత్రాంగం లేకుండా నాగరిక సమాజం క్షణం కూడా బతకలేదు. కాబట్టి పోలీసు యంత్రాంగం మొత్తాన్ని ఒకే గాటన కట్టటం, అందరూ అవినీతిపరులేనని నిందించటం మరింత ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. అందువల్ల మంచి అధికారుల్ని గౌరవించటం, దుర్మార్గులను, అవినీతిపరులను పసిగట్టి వాళ్లను శిక్షించటం నాగరిక సమాజానికి అవసరం. నేడున్న పరిస్థితులలో ప్రభుత్వాలు ఆ పనిని చేయలేవు. పోలీసు యంత్రాంగంలో సమర్థత, నిజాయతీ పెరగాలంటే, ప్రజలకు రక్షణ కావాలంటే, రెండు మౌలిక సంస్కరణల్ని వెంటనే చేపట్టాలి. నేరపరిశోధన ప్రస్తుతం రాజకీయ నాయకుల చేతుల్లో బందీ అయింది. అదలా ఉన్నంత కాలం నేరాలను నిరోధించటం, అవినీతిని అంతమొందించటం అసాధ్యం. నేర పరిశోధనను ఇతర పోలీసు విధుల నుంచి విడదీసి, ఆ శాఖను పాలకుల గుప్పిట నుంచి తప్పించి ఓ స్వతంత్ర సంస్థకు అప్పగించాలి. ఓ న్యాయమూర్తి అధిపతిగాను, ఆ సంస్థ న్యాయస్థానాలకు జవాబుదారీగాను ఉండాలి. అప్పుడుగాని పోలీసులు సర్కారీ గూండాలుగా మారటం ఆగదు. దాంతోపాటు సకాలంలో సమర్థ న్యాయాన్ని ప్రజలకు అందించే ఏర్పాట్లు చేయాలి.

ఎక్కడికక్కడ స్వల్పకాలంలో, సులభ పద్ధతుల్లో న్యాయాన్నందించేలా గ్రామ, పట్టణ న్యాయాలయాలను ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పాటు చేయాలి. సకాలంలో న్యాయం అందుతుందన్న విశ్వాసం ఉంటే పోలీసులు అక్రమాలకు పాల్పడటాన్ని ఆపటం సులువు. ప్రజల నిస్సహాయతను ఆధారంగా చేసుకుని బండన్యాయం అందించటం కోసం ఏర్పడుతున్న నేర సామ్రాజ్యాలను అప్పుడే అరికట్టగలం. అయితే ఎన్నికలలో అక్రమాలు కొనసాగుతున్నంతకాలం కోట్ల ఖర్చుతో, హింసతో, కండబలంతో పాలకులు అధికారాన్ని అందుకుంటున్నంతకాలం పోలీసు వ్యవ స్థను స్వప్రయోజనాల కోసం, అక్రమార్జన కోసం వాడుకోవటం ఆగదు. అలాగే అధికార కేంద్రీకరణ ఉన్నంతకాలం నిరంకుశ ప్రవర్తన, జవాబుదారీలేని పాలన, భద్రత లేక అనుక్షణం పాలకులు ఉలిక్కిపడే పరిస్థితి కొనసాగుతాయి. పాలనలో దాపరికం ఉన్నంత కాలం అధికార దుర్వినియోగం నిరాటంకంగా జరుగుతూనే ఉంటుంది.

అందుకే ఎన్నికల సంస్కరణలు, నిజమయిన అధికార వికేంద్రీకరణ, ప్రజలకు పాలనా సమాచారాన్నందించే చట్టం అత్యవసరం. అప్పటిదాకా పోలీసు వ్యవస్థలో ప్రక్షాళన జరగదు. పోలీసులే నేరగాళ్లతో మిలాకతయితే ఇక ప్రజలకు రక్షణ లేదు. ఇప్పటికయినా కళ్లు తెరిచి పోలీసు వ్యవస్థ ప్రక్షాళన కోసం, ప్రజాస్వామ్య సంస్కరణల కోసం నడుం కట్టడం అవసరం.

**(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఏప్రిల్ 21, 2001న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం)**



# విభజన హామీల కోసం అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధులు, ప్రత్యేక హోదా పారిశ్రామిక రాయితీలు మొదలైన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నందున ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి విభజన హామీల సాధన కార్యాచరణను రూపొందించాలని భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, విభజన హామీల అమలుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఒత్తిడి తేవాలని, లేకుంటే రాష్ట్రం ఇంకా తీవ్రంగా నష్టపోతుందన్నారు. విభజన హామీల పరంగా రాష్ట్రానికి భర్తీ కావాల్సిన రెవెన్యూ లోటు ఎంత, మిగతా నిధులు ఎన్ని, కేంద్రంపై ఆర్థికభారం పడకుండా, ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరం రాకుండా వాటిని ఎలా సాధించాలి తదితర అంశాలతో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్వతంత్ర నిపుణుల కమిటీ (ఐజీఈ) ద్వారా నివేదికను రూపొందించారని, తెలుగువారు కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన నిపుణులు కూడా దీన్ని ధృవీకరించారని అన్నారు. నివేదికను కేంద్రానికి, రాష్ట్రానికి అందించినా ఇప్పటివరకూ స్పందన లేదన్నారు. నేతల అవగాహనలేని రాజకీయాల వల్ల ఏపీ ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం పన్నుల రాయితీతో కూడిన ప్రత్యేక హోదా మంజూరు చేయాలని, విశాఖ రైల్వే జోన్ పనులు ప్రారంభించాలని, గోదావరితో మహానదిని అనుసంధానం చేసి న్యాయమైన నీటి వాటాను అన్ని ప్రాంతాలకూ అందించాలని, రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఏడు జిల్లాలకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలని, ఒడిషా రాష్ట్రంతో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకి ఉన్న జల వివాదాలను వెంటనే పరిష్కరించాలని, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ని విశాఖపట్నంలో నిర్మిస్తూనే విశాఖ పోర్టుకి అనుబంధంగా శాటిలైట్ పోర్టుని నిర్మించాలని భీశెట్టి డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా కేంద్రంపై విభజన హామీల అమలు కోసం ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రతినిధి ఎం.ఎస్.ఎన్ మూర్తి, సీనియర్ నాయకుడు నాయుడు వేణుగోపాల్, సిటీ ప్రతినిధి వద్దే హరిగణేష్, సుభాషిణి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.




# వృద్ధాప్యం కాలక్షేపం అనే ధోరణి మారాలి

కర్నూలు జిల్లా పత్తికొండ హోసూర్ రోడ్డు వృద్ధాశ్రమంలో సంక్రాంతి సందర్భంగా కేంద్ర సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా లోక్‌సత్తా పార్టీ బీసీ విభాగం నేత ఎస్.రామ్మోహన్ దుస్తులు పంపిణీ చేశారు. వృద్ధుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధాప్యం అంటే కాలక్షేపం అనే ధోరణి మారాలని, చదువులేకున్నా తమ అనుభవంతో చుట్టుపక్కల యువతకు మార్గదర్శకత్వం వహిస్తూ క్రియాశీలంగా మారాలని కోరారు.





# అమ్ముడుపోకండి!




**(1953 బ్యాచ్ ఐపీఎస్ అధికారి జులియో రెబిరో ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారులకు 2020లో రాసిన బహిరంగ లేఖ)**

ఐపీఎస్ సోదరులారా!

ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) సోదర సంఘం మాజీ సభ్యునిగా నేను మీకు ఈ విజ్ఞప్తి చేస్తున్నాను. తొమ్మిది పదుల వయస్సులో ఇంకా సజీవంగా ఉన్న ఐపీఎస్ అధికారులలో నేను ఒకణ్ణి. ఇప్పుడు నా వయస్సు 91 పైనే. నా సర్వీసు జీవితంలో మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్ ప్రజలకు సేవలందించాను. న్యాయం పొందడం ప్రజల హక్కు. నా విద్యుక్త ధర్మంగా వారికి న్యాయం జరిగేలా చూశాను. మీకు ఉపదేశాలు చేయడం నా ఉద్దేశం కాదు. మీకు సలహా ఇవ్వడం కూడా నా ఉద్దేశం కాదు. ఎందుకంటే రోజులు మారాయి. రాజకీయ సందర్భాలూ మారాయి. నేటి రాజకీయవేత్తలు భిన్నమైనవారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో విధానాలను రూపొందించిన స్వాతంత్ర్యోద్యమ నాయకులకు పూర్తిగా భిన్నమైనవారు. అయితే నిజాయితీ, దయ, కరుణ, సత్యసంధత, న్యాయం, చట్టానికి నిబద్ధత, రాజ్యాంగ నిష్ఠ మొదలైన విలువలు సార్వకాలికమైనవి. మీరు ఆలోచిస్తున్నప్పుడు, నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు, అంతిమంగా కార్యాచరణకు పూనుకుంటున్నప్పుడు ఆ విలువలు సదా మీ మనస్సులో ఉండి తీరాలి. ఒక ఉత్తమ నాయకుడిగా మీ భావాలు, ఆలోచనలు, చర్యలు మీకింద పనిచేస్తున్నవారికి మార్గదర్శకత్వం వహించాలి. నేరాలు, నేరస్థులను నియంత్రించడంలో అసాధారణ పద్ధతులు, కాదూ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు ఉపయోగించే ప్రామాణిక పద్ధతులను మామూలు సమయాలలో ఉపయోగించకూడదు. గ్యాంగ్‌స్టర్లు, కరడుగట్టిన నేరస్థుల ముఠాలు సంఘ జీవితంలో భాగమైపోయారంటే అందుకు కారణం వారు ధనబలాన్ని విచ్చలవిడిగా ఉపయోగించి, పోలీసు అధికారులు, వారి రాజకీయ దొరలకు భారీ ముడుపులు ఇవ్వడం వల్లేనని చెప్పితీరాలి. నేరస్థులు, పోలీసులు, రాజకీయవేత్తల మధ్య గట్టిగా ఉన్న చట్టవిరుద్ధ సంబంధాలే ఆ అమానుష, అనాగరిక నేరగాళ్లను సృష్టించాయి. ఈ సత్యం మీకే కాదు, ఏ సాధారణ పోలీసుకైనా బాగా తెలుసు. నేను ఇంతకుముందే చెప్పినట్లు మీకు సలహా ఇచ్చేందుకు సాహసించను. నేరాలకు తోడ్పడకుండా ఉండేలా రాజకీయవేత్తలను ప్రభావితం చేసేందుకు మీరు చేయగలిగిందేమీ లేదు. అయితే మీ సహచరులు, మీ కింద పనిచేస్తున్నవారు నేరస్థులకు మద్దతు ఇవ్వకుండా మీరు తప్పకుండా నిరోధించవచ్చు. అలా వ్యవహరించడమనేది మీ చేతుల్లో ఉన్నది. తద్వారా రాజకీయవేత్తల, పోలీస్ అధికారుల, నేరస్థుల మధ్య బలీయమైన సంబంధాలను బలహీనపరచడం సుసాధ్యమవుతుంది. నేరస్థులు తమ కార్యకలాపాలను యథేచ్ఛగా చేసుకునేలా వారికి స్వేచ్ఛనివ్వాలని రాజకీయవేత్తలు మిమ్మలను ఆదేశించరు. మిమ్మలను మీ ఉన్నత బాధ్యతల నుంచి తొలగిస్తారు. ఒక వికాస్ దూబేను సృష్టించడంలో భాగస్వామి కావడం కంటే ఇదే మంచిదేమో! వికాస్ దూబే విషయానికి వస్తే ఆ నేరగాడిని నిర్మూలించడంలో పోలీసులు న్యాయవ్యవస్థ అధికారాలను తమ చేతుల్లోకి తీసుకున్నారు. నేరదర్యాప్తు అధికారులకు ప్రాసిక్యూట్ చేసే అధికారాలను గాని, న్యాయమూర్తి బాధ్యతలను గానీ ఇవ్వకూడదు. కానీ ఇప్పుడు దేశంలో జరుగుతున్నది సరిగ్గా ఇదే! దూబే వ్యవహారంలో పోలీస్ అధికారులు వ్యవహరించిన తీరు వివేకవంతమూ, న్యాయబద్ధమూ, నాగరీకమూ అని మీరు భావిస్తున్నారా? భారత్‌లో పోలీసు రాజ్యం ఏర్పడవలసిన అవసరం ఉందని మీరు భావిస్తున్నారా? చట్టాన్ని అమలుపరిచేవారిపైనే దాడులు చేసి వారినే హతమార్చే నేరస్థులు పెరిగిపోతున్నారు. పోలీసు కస్టడీ నుంచి తేలిగ్గా తప్పించుకోవడం, పోలీసుల నుంచి తుపాకులను లాక్కొని రాంబోలా వ్యవహరించడం సాధారణమైపోయింది. అయితే అటువంటి నేరస్థులను పోలీసులు అక్కడికక్కడే హతమారుస్తున్నారు. అలా హతమార్చడం పట్ల మధ్యతరగతి ప్రజలు హర్షామోదాలు వ్యక్తం చేస్తున్నారు! రాజకీయవేత్తలు ఇటువంటి ఉపద్రవాలు, అఘాయిత్యాలను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారు. తమిళనాడులోని ట్యూటికోరిన్ జిల్లాలో అమాయక పౌరులైన తండ్రీ తనయులను పోలీసులు హతమార్చిన వైనం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎంత క్రూరత్వం ప్రదర్శించారు! మధ్యతరగతి ప్రజలు సైతం హర్షించలేకపోయారంటే ఆ పోలీసుల దౌష్ట్యం ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవచ్చు. సిగ్గుచేటు! ట్యూటికోరిన్ ఘటన పట్ల భారతదేశంలోని ప్రతి పోలీసూ సిగ్గుతో తలవంచుకోవాలి. పోలీసు వ్యవస్థలో ఇటువంటి దుర్మార్గాల నిర్మూలనకు నేనేమీ పరిష్కార మార్గాలను సూచించబోవడం లేదు. ఇటువంటి నేరాల దర్యాప్తు విషయంలో ప్రత్యక్ష అనుభవం, వాటి పూర్వాపరాలపై సరైన అవగాహన లేనివారి సలహాలు తరచు మంచి కంటే హాని చేస్తుంటాయి. బూటకపు ఎన్‌కౌంటర్లను, దర్యాప్తులో క్రూరాతి క్రూర పద్ధతులను త్యజించేందుకు దోహదం చేసే ఒక వ్యూహాన్ని మీరే రూపొందించుకోవాలి. అసలు వికాస్ దూబే లాంటి నేరస్థులు ప్రభవించేందుకు ఆస్కారం లేని విధంగా, అటువంటి నేరస్తులపై శీఘ్ర విచారణ జరిగేందుకు వీలు కల్పించే విధంగా ఆ వ్యూహం ఉండి తీరాలి.

ధర్మోపన్యాసాలు చేయనని మాట ఇచ్చాను. అయితే ఈ హామీని ఉల్లంఘించేందుకు నాకు అనుమతినివ్వండి. పోలీసు వ్యవస్థలో ఉన్నత పదవులను దక్కించుకొనేందుకు రాజకీయవేత్తలను ఆశ్రయించడాన్ని మానుకోవాలని ఐపీఎస్ అధికారులను నేను కోరుతున్నాను. అలా చేయడం వల్ల మీరు మీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను మీ రాజకీయ యజమానులకు అమ్ముకొంటున్నారు. మీకు ఉపకారం చేసినందుకుగాను కొన్ని పనులు చేయాలని వారు మిమ్మలను 'అభ్యర్థిస్తారు'. అయితే ఆ పనులు చేయడం వల్ల, మీ కింద పనిచేస్తున్నవారిపై మీ అధికారం, పరపతి బలహీనపడుతుందని మీకు బాగా తెలుసు!

**- మీ సోదరుడు జులియో రెబిరో**




## ఆర్థిక వృద్ధి, రాజకీయ అవసరం కోసమైనా

# ‘చట్టబద్ధపాలన’ను సంస్కరించండి!

(ఫిబ్రవరి 20 నుండి జరగనున్న ఐడీఏడబ్ల్యూ సదస్సు సన్నాహక వెబినార్‌లో నిపుణుల మేలుకొలుపు)

చట్టబద్ధపాలన’పై ‘ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్’ వార్షిక ద్వితీయ సదస్సుగా ఫిబ్రవరిలో జరగనున్న కార్యక్రమాలకు సన్నద్ధంగా వెబినార్‌ను టీం ఎఫ్‌డీఆర్ నిర్వహించింది. చట్టబద్ధపాలనను బలోపేతం చేయటానికి పోలీస్, ప్రాసిక్యూషన్, న్యాయవ్యవస్థల పనితీరులో అవసరమైన, ఆచరణసాధ్యమైన సంస్కరణలకు వివిధ మార్గాలపై ఇందులో పాల్గొన్న నిపుణులు చర్చించారు. వ్యవస్థలు స్వేచ్ఛగా, నిష్పక్షికంగా వ్యవహరించటానికి జవాబుదారీతనం ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించాలని సూచించారు. చట్టబద్ధపాలనను బలోపేతం చేయటానికి గత కొన్ని దశాబ్దాలలో పలు కమిటీలు ఇచ్చిన నివేదికలు అమలుకు నోచుకోలేదన్నారు. చట్టబద్ధపాలనకు – తమ జీవితాలకు మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలకు తెలియచేసి ప్రజాభిప్రాయాన్ని మలచాలని, అవసరమైన మార్పులు తెచ్చేలా రాజకీయ నాయకత్వం మీద ఒత్తిడి పెంచాల్సుందని అన్నారు. వ్యక్తుల స్వేచ్ఛను పరిరక్షించటం కోసమే కాకుండా, సామాజిక స్థిరత్వం, నగరాల, దేశ ఆర్థికాభివృద్ధి కోసం కూడా ఇప్పుడున్న చట్టబద్ధపాలన వ్యవస్థను సంస్కరించటం అవసరమని ప్యానలిస్టులు స్పష్టం చేశారు. ఐడీఏడబ్ల్యూ సదస్సు సన్నాహక వెబినార్‌లో.. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, ఎస్‌వీపీ జాతీయ పోలీస్ అకాడమీ మాజీ డైరెక్టర్ కమల్ కుమార్, కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె. పద్మనాభయ్య, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పాల్గొన్నారు. ఓ రిపోర్ట్:

**జయప్రకాష్ నారాయణ్**

“ప్రజలు మంచి చేయటం తేలిగ్గా, చెడు చెయ్యాలంటే కష్టంగా ఉండేలా చేయటమే ప్రభుత్వం అసలైన పని” అన్న విలియమ్ గ్లాడ్‌స్టోన్ పలుకులతో జయప్రకాష్ నారాయణ్ చర్చను ప్రారంభించారు. ప్రభుత్వం నెరవేర్చాల్సిన అతి ముఖ్యమైన బాధ్యత.. చట్టబద్ధపాలనలో కీలకమైన సివిల్, క్రిమినల్ న్యాయాల్ని సత్వరం అందేలా చేయటమన్నారు. కానీ దురదృష్టవశాత్తూ ప్రభుత్వాలు తాత్కాలిక ప్రయోజనాల కోసం వెంపర్లాడుతూ జనాకర్షణకు చట్టబద్ధపాలనను పణంగా పెడుతున్నాయన్నారు. చట్ట ప్రక్రియ, చట్టం ముందు అందరూ సమానంగా ఉండటం, చట్టాన్ని సమానంగా అమలు చేయటం తదితర అంశాల్ని స్థూలంగా వివరించారు.

మిగతా ప్రజాస్వామ్య దేశాలతో పోలిస్తే చట్టబద్ధపాలనకు సంబంధించి భారతదేశం ఎదుర్కొంటున్న మూడు తీవ్రమైన సవాళ్లను జేపీ వివరించారు. మొదటిది, గుట్టలు గుట్టలుగా కేసులు పేరుకుపోవటం, ఏళ్ల తరబడి తీర్పులు తెమలకపోవటం! ఇది భారత న్యాయవ్యవస్థ ప్రత్యేకతగా తయారైందన్నారు. మన కిందిస్థాయి కోర్టులలో దాదాపు 3.5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందులో 99 లక్షల సివిల్ కేసులు, 2.66 కోట్ల క్రిమినల్ కేసులు. హైకోర్టుల పరిధిలో 50 లక్షల పెండింగ్ కేసులున్నాయన్నారు. ఈ కేసులు ఎప్పటికి పరిష్కారమవుతాయో తెలియక బాధితులు వేదన చెందుతున్నారన్నారు. రెండోది, క్రిమినల్

కేసుల సంఖ్య సివిల్ కేసుల కంటే చాలా ఎక్కువగా ఉందన్నారు. సివిల్ కేసుల కంటే రెండు రెట్లకుపైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇదో విపరీత పరిస్థితని.. ప్రజలు సివిల్ వివాదాల పరిష్కారానికి కోర్టులకెళ్లటం పట్ల విముఖత చూపుతున్నారనటానికి నిదర్శనమని అన్నారు. భారతదేశంలో నేరాల శాతం ఇతర దేశాలతో పోలిస్తే గణనీయంగా తక్కువైనా కూడా ఈ పరిస్థితి ఉందని గుర్తించాలన్నారు. మూడోది, నేరాలు రుజువై శిక్ష పడటం మన దేశంలో ప్రపంచంలోనే అతి తక్కువన్నారు. సుమారు 50.4% కేసుల్లో మాత్రమే శిక్షలు పడుతున్నాయన్నారు. అయితే, బండ పద్ధతుల్లో బలవంతంగా ఒప్పించే కేసుల్ని మినహాయిస్తే.. నేరస్తులకు పడుతున్న శిక్షలు 10–15% మాత్రమే ఉంటాయన్నారు. మన దేశంలో ఒక ఒప్పందాన్ని అమల్లోకి తేవాలంటే సరాసరిన 1445 రోజులు పడుతుందని, అదే ఇతర దేశాల్లో 400 రోజులు పడుతుందన్నారు.

ముంబయి, ఢిల్లీ వంటి మెట్రోలలో అపహరణలు, రేప్, హత్య తదితర తీవ్ర నేరాల ఉదంతాలు పెరుగుతుండటాన్ని ప్రస్తావిస్తూ.. భారతీయ సంస్కృతిలో భాగంగా తరతరాలుగా వస్తున్న కుటుంబ విలువలు, సామాజిక కట్టుబాట్లు భారత్‌లో నేరాల సంఖ్యను మిగతా దేశాలతో పోలిస్తే తక్కువగానే ఉండేట్లు చేస్తున్నప్పటికీ, పెరుగుతున్న పట్టణీకరణతో ఆ విలువలకు బీటలు వారుతున్నాయని జేపీ అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే, మన వ్యవస్థలోని లోపాల్ని సరిదిద్దేందుకు ఇప్పటికీ పటిష్ట చర్యలు తీసుకోకపోతే.. జోహన్నెస్‌బర్గ్, మెక్సికో సిటీ వంటి నగరాల్లా భారతీయ నగరాలు కూడా అరాచకానికి నిలయాలుగా మారటానికి ఎంతో సమయం పట్టదన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగాల సృష్టి ప్రధానంగా నగరాల్లోనే జరుగుతోందన్నారు. 2030 నాటికి జీడీపీలో 70% నగరాల నుంచే వస్తుందనే అంచనా ఉందన్నారు. పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధి వల్ల నేరాలు, సివిల్ వివాదాలు మరింత ఎక్కువయ్యే అవకాశముందన్నారు. ఈ పరిణామాల్ని సక్రమంగా ఎదుర్కోకపోతే.. ప్రజలు నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ అన్యాయాన్ని భరించాల్సి వస్తుందని, అవినీతి, హింస, వ్యవస్థీకృత నేరాలు ఇంకా విచ్చలవిడి అవుతాయని, ఆర్థిక ప్రగతి కుదేలవుతుందని అన్నారు. నగర ప్రాంతాల భవిష్యత్తుకు చట్టబద్ధపాలన ఇంత అనివార్యమైన అవసరం కాబట్టి.. ఏదో నైతికత కోసమో, నిబంధనల కోసమో అన్నట్లు కాకుండా.. ప్రభుత్వాలు ఈ సవాళ్లకు తగ్గ రీతిలో తప్పనిసరిగా స్పందిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అలాగే ప్రతి 1,00,000 మంది ప్రజానీకానికి కేవలం 152 మంది పోలీసులు మాత్రమే దేశంలో ఉన్నారని జేపీ అన్నారు. ఇది మిగిలిన దేశాలన్నిటికన్నా తక్కువన్నారు. ఫోరెన్సిక్ మౌలిక వసతులు మరీ అరకొరగా ఉన్నాయన్నారు. దేశంలో 37 ఫోరెన్సిక్ ల్యాబ్‌లు మాత్రమే ఉన్నాయన్నారు. వాటిల్లో కూడా చాలా ల్యాబ్‌లలో వసతులు నామమాత్రంగా ఉన్నాయన్నారు. ఏడాదికి 20,000 డీఎన్ఏ శాంపిళ్లను మాత్రమే పరీక్షించే సామర్థ్యం మన దేశానికుందన్నారు. అదే అమెరికా 2014లో 12,00,000 శాంపిళ్లను పరీక్షించిందన్నారు. ఒక్కో కేసులో ఆరు డీఎన్ఏ శాంపిళ్లను పరీక్షించాల్సిన అవసరముంటే, ఏడాదిలో 3,000 కేసులలో మాత్రమే డీఎన్ఏ విశ్లేషణను మన దేశంలో చేయగలమన్నారు. 2019లో ఒక్క ఢిల్లీలోనే 11,000కు పైగా హింసాత్మక నేరాలు జరిగాయన్నారు. ఎంతో సంచలనం సృష్టించిన సునంద పుష్కర్ కేసులో డీఎన్ఏ శాంపిళ్ల విశ్లేషణకు ఏడాది సమయం పట్టిందని గుర్తుచేశారు.

ఆ తర్వాత బలహీనమైన మన ప్రాసిక్యూషన్ వ్యవస్థ గురించి జేపీ వివరించారు. దేశంలో న్యాయమూర్తుల సంఖ్యతో సమానంగా ప్రాసిక్యూటర్లు ఉన్నారని, జనాభా రీత్యా, కేసుల భారం రీత్యా ఈ సంఖ్య అత్యంత తక్కువని అన్నారు. సీబీ సీఐడీల విభాగంలో దర్యాప్తు అధికారుల సంఖ్య అతి తక్కువగా ఉందన్నారు. వీరిలోనూ చాలామంది కానిస్టేబుల్ స్థాయిలోని వారేనన్నారు. గతంలో వివిధ కమిటీలు ఇచ్చిన సంస్కరణ సిఫార్సుల్లో కొన్నిటిని జాప్యం లేకుండా అమలు చేయాలన్నారు. ఉదాహరణకు, మూడేళ్ల గరిష్ట శిక్షార్హమైన ఒక పరిధి దాటిన నేరాలకు ప్రత్యేకమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల దర్యాప్తు సంస్థను నెలకొల్పాలన్నారు. భారతదేశం ఉన్న పరిస్థితుల్లో మొత్తం పోలీసు వ్యవస్థకు రాజకీయ నియంత్రణ నుంచి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించటం సాధ్యమూ కాదు, సరైన పనీ కాదన్నారు. స్వతంత్ర నేర పరిశోధనా సంస్థ లేదా సీబీ సీఐడీలను.. సిబ్బంది, మౌలిక వసతులు, సాంకేతికత, చలనత, వనరుల పరంగా తగినంత మేర బలోపేతం చేయాలని, అదే సమయంలో జవాబుదారీతనం ఉండేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఆ రకమైన సంస్థ.. మొత్తం నేరాల్లో తీవ్రమైన 20 శాతాన్ని దర్యాప్తు చేస్తుందన్నారు. మిగిలిన 80% కేసుల్ని ఇప్పుడున్నట్లే సాధారణ పోలీసులు దర్యాప్తు చేస్తారన్నారు. అంటే, పోలీసు వ్యవస్థ గణనీయంగా రాజకీయ నాయకుల నియంత్రణలోనే కొనసాగుతూ ఉంటుందన్నారు.

ప్రాసిక్యూషన్ విభాగంలో సిఫార్సులను జేపీ ప్రస్తావించారు. దర్యాప్తు, ప్రాసిక్యూషన్ విధులు.. పాక్షిక న్యాయ (క్వాజీ జ్యుడీషియల్) స్వభావం కలిగినవి అయినందున అవి పక్షపాతాలకు అతీతంగా ఉండాలని, స్వతంత్రంగా స్వయంప్రతిపత్తితో ఉండాలని అన్నారు. న్యాయవ్యవస్థకు, ప్రాసిక్యూషన్‌కు మధ్య మరింత సమన్వయానికి జిల్లా జడ్జిని జిల్లా అటార్నీగా డిప్యుటేషన్ ప్రాతిపదికన 5 ఏళ్ల కాలానికి నియమించాలన్నారు. ఆ జిల్లా అటార్నీ జిల్లా స్థాయిలో ప్రాసిక్యూషన్‌కు నేతృత్వం వహిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల్లో న్యాయ కార్యదర్శులుగా పలువురు న్యాయమూర్తులు నియమితులయ్యే సంప్రదాయం ఉన్నందున.. జిల్లా జడ్జిని అటార్నీగా నియమించటం అసాధారణమేమీ కాదన్నారు. ప్రాసిక్యూషన్ విభాగం.. స్వతంత్ర నేర పరిశోధనా సంస్థతోపాటు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ బోర్డుకు కూడా జవాబుదారీగా ఉండాలన్నారు.

తర్వాత, మన న్యాయవ్యవస్థను పీడిస్తున్న అంశాలను చర్చించారు. మొదటిది, భారతదేశ న్యాయవ్యవస్థలో పది లక్షల మంది జనాభాకు సుమారు 21 మంది జడ్జీలు మాత్రమే ఉన్నారని, ఈ సంఖ్య చాలా తక్కువన్నారు. మరోవైపు, వెల్లడికాని కారణాలతో న్యాయమూర్తుల పదవుల్లో భర్తీ కానివి పెద్దసంఖ్యలో

ఉన్నాయన్నారు. రెండోది, మన న్యాయవ్యవస్థలోని దుర్భర మౌలిక వసతులు. దిగువ స్థాయి కోర్టుల్లో కేటాయించిన జడ్జీల సంఖ్యకు తగ్గ కోర్టు గదులు లేవని, చట్టబద్ధపాలన విలువ తెలిసిన సమాజంలో ఇది ఎంతమాత్రం ఉండకూడని పరిస్థితని జేపీ అన్నారు. ఇక, న్యాయవ్యవస్థకయ్యే వార్షిక వ్యయం బడ్జెట్ వ్యయంలో 1% కంటే తక్కువన్నారు. ఎంతో కీలకమైన ఈ పాలనా విభాగానికి.. ఎన్నికైన ప్రభుత్వాలు ఎంత ప్రాధాన్యతనిస్తున్నాయో ఇవన్నీ తేటతెల్లం చేస్తున్నాయన్నారు. ఈ పరిస్థితిని మెరుగుపరిచేలా ప్రజలు, వ్యాపార వర్గాల నుంచి ఒత్తిడి పెరగాలన్నారు.

చట్టబద్ధపాలన రాత్రికి రాత్రే దిగజారిపోదని, అరాచక సంస్కృతితో అది క్రమంగా కొడిగడుతుందన్నారు. కిందిస్థాయిలో చట్టబద్ధ పాలనను పటిష్టం చేసేందుకు స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో క్రిమినల్ కేసులకు మేజిస్ట్రేట్స్ కోర్టులు (జస్టిసెస్ ఆఫ్ పీస్), సివిల్ కేసుల్లో స్మాల్ ట్రాక్ కోర్టుల్ని ఇందుకు ఉదాహరణగా చెప్పారు. జస్టిసెస్ ఆఫ్ పీస్‌లోనే మొత్తం న్యాయవ్యవస్థలో 83% ఉంటుందని, 93% క్రిమినల్ కేసుల్ని పరిష్కరించి సత్వర న్యాయం అందిస్తారన్నారు. సివిల్ విభాగంలో, సివిల్ కోర్టుల్లో 73% విచారణలు స్మాల్ క్లెయిమ్స్ విధానంలోనే జరుగుతాయన్నారు. మన దేశంలో ఈ తరహాలో గ్రామన్యాయాలయాల చట్టం అందుబాటులోకి వచ్చినప్పటికీ, పాలనా ఉదాసీనత, నిర్లక్ష్యం ఈ కోర్టులు పూర్తిస్థాయిలో అమల్లోకి రాకుండా అడ్డుకుంటున్నాయని జేపీ అన్నారు. గ్రామన్యాయాలయాల చట్టం ద్వారా పట్టణ, గ్రామ ప్రాంతాలలో స్థానిక కోర్టుల ఏర్పాటుకు ప్రజలు, ప్రభుత్వం, పౌర సమాజాన్ని సమీకరించాలన్నారు.

చట్టసభ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయటం కూడా చట్టబద్ధపాలనకు ముఖ్యమని జేపీ స్పష్టం చేశారు. వృత్తి నైపుణ్యంతో, సమర్థవంతంగా పనిచేసేలా పోలీసు విభాగాన్ని పునర్నిర్మించాలని ఇచ్చిన సిఫార్సుల్ని ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. పోలీసు సిబ్బందిలో 15%తో ప్రత్యేక దర్యాప్తు విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ విభాగం ఆధ్వర్యంలో 20% నేరాలను స్వతంత్ర నేర పరిశోధన, ప్రాసిక్యూషన్ బోర్డు నియంత్రణలో దర్యాప్తు చేయాలన్నారు. ఆ బోర్డు దేశంలో నేర పరిశోధనను, ప్రాసిక్యూషన్‌ను పర్యవేక్షిస్తుందన్నారు. ఇందులో ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. నేర పరిశోధన చేసే పోలీసులు.. 80% కేసులను దర్యాప్తు చేసే శాంతి భద్రతల విభాగంలోని మిగిలిన 85% పోలీసులతో కలిసి పనిచేస్తారన్నారు. దర్యాప్తు బాధ్యతను తీసుకోవటంతోపాటు నేర పరిశోధనా విభాగానికి ప్రాసిక్యూషన్ విభాగం సూచనలిస్తుంటుంది. జిల్లాల్లో ప్రాసిక్యూషన్లకు జిల్లా జడ్జి నేతృత్వం వహిస్తుండగా, దిగువస్థాయి కోర్టులు, నేర పరిశోధనా పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో పనిచేస్తాయి.

భారత ప్రజాస్వామ్యానికి చట్టబద్ధపాలన ఎంత ఆవశ్యకమో ముగింపు వ్యాఖ్యల్లో జేపీ వివరించారు. ఉన్న వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయటం సంస్కరణల లక్ష్యం కాదని, దాన్ని నిర్మాణాత్మకంగా మెరుగుపరచటానికి ఎన్నికైన ప్రజాప్రతినిధులతో సామరస్యంగా కలిసి పనిచేయటం అవసరమన్నారు. సంస్కరణలు అహేతుకంగా, తీవ్ర ధోరణిలో ఉండటం ఆచరణలో ఫలితాలనివ్వదని, మన రాజకీయ నాయకులను అసంతృప్తికి గురిచేస్తూ వాటిని అమలు చేయటం సాధ్యం కాదని అన్నారు. వ్యవస్థీకృత లోపాల్ని ఆలస్యం చేయకుండా సరిచేయటం ఎంతో అవసరమని ఉద్ఘాటించారు. తన ప్రతిపాదనలకయ్యే స్వల్పకాలిక వ్యయం.. శాంతి భద్రతలు, ఆర్థిక ప్రగతి పరంగా దీర్ఘకాలంలో సమాజానికి అపార లాభం చేకూరుస్తుందని జేపీ అన్నారు.

**కమల్ కుమార్**

చట్టానికి ఎవరూ అతీతులు కారన్నది ప్రజాస్వామ్య మౌలిక సూత్రమని కమల్ కుమార్ అన్నారు. చట్టబద్ధపాలనకు సుప్రసిద్ధ న్యాయకోవిదుడు ఏవీ డైసీ చెప్పిన 5 ప్రధాన లక్షణాలుండాలన్నారు.

**1) చట్ట శిరోధార్యత**

**2) చట్ట సమానత**

**3) చట్టానికి జవాబుదారీ కావటం**

**4) చట్టం అమలు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉండటం**

**5) చట్టం అమలులో ఎటువంటి వ్యక్తిగత ధోరణుల్నీ ప్రదర్శించకపోవటం**

రాజ్య వ్యవస్థ చట్టం ద్వారా, చట్టంతో మాత్రమే పనిచేస్తుందన్నదే చట్టబద్ధపాలన మౌలిక సూత్రమన్నారు. చట్టబద్ధపాలన భారత రాజ్యాంగ మూలసూత్రాల్లో ఒకటన్నారు. రాజ్యవ్యవస్థకుండే అన్ని అధికారాలూ చట్టం నుంచే రావాలి, చట్టప్రకారమే అమలవ్వాలి అన్నారు. సమర్థవంతమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల న్యాయవ్యవస్థతోపాటు చట్టబద్ధపాలనకు సమర్థ, నిర్భయ, జవాబుదారీతనమున్న, నిష్పాక్షిక, అంకితభావం గల పోలీసు యంత్రాంగం కూడా ఉండాలన్నారు. చట్టబద్ధంగా నిష్పాక్షికంగా వ్యవహరించే పోలీసు యంత్రాంగం లేకుండా ఈ దేశ పౌరుల మౌలిక మానవ హక్కుల పరిరక్షణ సాధ్యం కాదన్నారు. మన దేశంలో చట్టబద్ధపాలనను సుస్థిరం చేయటానికి, పెంపొందించటానికి మన రాజ్యాంగం, చట్టాలు చక్కటి నిబంధనలతో ప్రమాణాలను నిర్దేశించాయన్నారు. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. డబ్బు, కండబలం, పలుకుబడి.. ఇవే మొత్తం న్యాయ ప్రక్రియను చాలామేర శాసిస్తున్నాయనే అభిప్రాయం సర్వత్రా నెలకొందన్నారు.

పోలీసుల విధినిర్వహణలో రాజకీయ, అధికార యంత్రాంగం జోక్యం చేసుకోవటం భారతదేశంలో చాలా ఎక్కువని కమల్ కుమార్ అన్నారు. దీనివల్ల న్యాయం చాలా కేసుల్లో అందని ద్రాక్షగా మారిందన్నారు. ఫలితంగా.. న్యాయవ్యవస్థ, పోలీసుల పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. మన దేశంలాంటి ప్రజాస్వామ్యాల్లో పోలీసులు అన్ని సమయాల్లో నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా వ్యవహరించాల్సుందన్నారు. తమ విధులను అమలు చేసేటప్పుడు బయటి నుంచి వచ్చే ఒత్తిడులను నిలువరించగలగాలన్నారు. ఒక వ్యక్తిని నిర్బంధించటం, అరెస్ట్ లేదా ఛార్జిషీట్ చేయటానికి పోలీసులకు చట్టం అధికారాలనిచ్చింది. వాటిని చట్ట నిబంధనల పరిధిలోనే, వృత్తిపరంగానే అమలు చేయాల్సి ఉంది. పోలీసులు

ఎలా తమ విధుల్ని నిర్వహించాలో, విచక్షణను వినియోగించాలో ముఖ్యమంత్రి, లేదా పోలీసు విభాగ మంత్రి శాసించలేరు. చట్టబద్ధపాలనకు విరుద్ధంగా, భిన్నంగా వ్యవహరించే అధికారం ఏ ప్రభుత్వ ప్రతినిధికీ లేదు, వేరెవరికీ లేదన్నారు.

బదిలీల భయంతో ఒత్తిడికి గురై పోలీసులు రాజకీయ బాస్‌లను మెప్పించే ధోరణితో పనిచేయటాన్ని కమల్ కుమార్ ప్రస్తావించారు. రాజకీయ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులు తీసుకునే ప్రతి చర్యా అంతిమంగా చట్టబద్ధపాలనకు విఘాతమవుతోందన్నారు. పోలీసుల విధినిర్వహణను ప్రభావితం చేసే రాజకీయ జోక్యాన్ని నిలువరించటానికి, నిజాయతీతో పనిచేసే పోలీసు అధికారులు రాజకీయ క్రీడలో బలిపశువులు కాకుండా ఉండటానికి.. పటిష్టమైన సంస్థాగత ఏర్పాట్లు అవసరమన్నారు.

భారతదేశంలో పోలీసు సంస్కరణల కోసం జరుగుతున్న సుదీర్ఘ ప్రయత్నాల్ని కమల్ కుమార్ వివరించారు. భారత ప్రభుత్వం, రాష్ట్రాలు కూడా పోలీసు వ్యవస్థలోని బలహీనతలు, లోపాల మీద వేసిన అనేక కమిటీలు, కమిషన్లను ప్రస్తావించారు. 1959లో కేరళతో మొదలుపెట్టి పదకొండు రాష్ట్రాలు పోలీసు సంస్కరణల నిమిత్తం కమిషన్లు వేశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వేసిన వివిధ కమిషన్లు కమిటీలలో జాతీయ పోలీస్ కమిషన్ (1977) ప్రముఖమైనదన్నారు. దాని తర్వాత రెబిరో కమిటీ, పద్మనాభయ్య కమిటీ, మాలిమత్ కమిటీ వేశారన్నారు. సోలి సొరాబ్జి కమిటీ 2006లో మోడల్ పోలీస్ చట్టాన్ని రూపొందించిందన్నారు. ఈ కమిటీలు ఎంతో శ్రమకోర్చి సమస్యల్ని అధ్యయనం చేసి సవివరమైన సిఫార్సులను చేశాయన్నారు. అయితే, వీటి అమలులో చిత్తశుద్ధి మాత్రం లోపించిందన్నారు. ప్రతిసారీ పైపై మాట్లు వేస్తూ సరిపెడుతున్నారన్నారు. జాతీయ పోలీస్ కమిషన్ సిఫార్సులను అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ రిటైర్డ్ పోలీసు అధికారి ప్రకాష్ సింగ్ 1996లో సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై సెప్టెంబర్ 22, 2006న సుప్రీంకోర్టు మైలురాయి లాంటి తీర్పును వెలువరించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాలకు 6, కేంద్రానికి ఒకటి నిర్దేశాల్ని జారీ చేసింది. బయటి శక్తుల ప్రభావాల నుంచి పోలీసుల పనితీరును పరిరక్షించేందుకు కొన్ని సంస్థాగత ఏర్పాట్లు చేయాలని, చట్టానికి జవాబుదారీగా స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని పేర్కొంది. ముఖ్యమంత్రి లేదా హోం మంత్రి, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, రిటైర్డ్ హైకోర్టు జడ్జి, నిజాయతీ, ప్రతిభ గల పౌర సమాజ ప్రతినిధులతో రాష్ట్ర సెక్యూరిటీ కమిషన్ ఏర్పాటు.. యూపీఎస్సీ సూచించిన ప్యానల్ నుంచి డీజీపీ ఎంపిక, రెండేళ్ల కనీస పదవీ కాలం.. నేర దర్యాప్తును, శాంతి భద్రతలను పోలీసు విధుల్లో వేరు చేయటం.. అన్ని రకాల బదిలీలు, పోస్టింగులు, ఇతర డిపార్టమెంటల్ అంశాలను నిర్ణయించేందుకు రాష్టాల్లో డీజీపీ, మరో 4 సీనియర్ పోలీసు అధికారులతో పోలీస్ ఎస్టాబ్లిష్ మెంట్ బోర్డుల ఏర్పాటు మొదలైన సూచనలు వాటిలో ఉన్నాయి.

వీటి అమలుకు డిసెంబర్ 31, 2006 తుది గడువని సుప్రీం రాష్ట్రాలకు స్పష్టం చేసింది. ఇప్పటికీ అవి పెండింగ్‌లోనే ఉన్నాయి.

ఇవి క్షేత్రస్థాయిలో ఎలా అమలయ్యాయో సమీక్షించేందుకు 2008లో జస్టిస్ కేటీ థామస్ నేతృత్వంలో సుప్రీంకోర్టు ఒక పర్యవేక్షణ కమిటీని నియమించింది. సంస్కరణల అమలు పట్ల రాష్ట్రాలు పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించాయని కమిటీ తుది నివేదికలో ఆవేదనను వ్యక్తం చేసింది. ప్రకాష్ సింగ్, తోటి పిటిషన్ దారులు ఇప్పటికీ ఈ అంశంపై సుప్రీంకోర్టులో వ్యాజ్యాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో, ఆచరణసాధ్యమైన వ్యూహాలను రూపొందించుకోవాల్సిన అవసరముందని కమల్ కుమార్ అన్నారు. ఎటువంటి సంస్కరణ ప్రక్రియయినా విజయవంతం కావాలంటే, సంబంధిత వర్గాలందరి భాగస్వామ్యం అందులో ఉండాలన్నారు. పోలీసు సంస్కరణలకు సంబంధించి ప్రజల్లో చైతన్యం, రాజకీయ నాయకత్వంలో సంకల్పం అవసరమన్నారు.

మంచి పోలీసింగ్ చట్టబద్ధపాలనకు, సమాజంలో ఆరోగ్యకరమైన సామాజిక-ఆర్థిక వృద్ధికి కీలక అవసరమని కమల్ కుమార్ అన్నారు. పోలీసులకు వృత్తిపరమైన స్వేచ్ఛనిస్తూనే, జవాబుదారీతనానికి కూడా పటిష్టమైన వ్యవస్థల ఏర్పాటు అవసరమన్నారు. పోలీసులకు, రాజకీయ నాయకత్వానికి ఏమాత్రం సంబంధం లేకుండా చేయటం సరికాదన్నారు. పోలీసు సంస్కరణలపై ప్రజల్లో చైతన్యం పెంచి సమీకరించేందుకు, రాజకీయ నాయకత్వంలో అవగాహన పెంచి కార్యాచరణ దిశగా మళ్లించేందుకు ప్రణాళికాబద్ధ ప్రచారం, ప్రయత్నం అవసరమని సూచించారు.

**కె. పద్మనాభయ్య**

శాంతి భద్రతల్ని పరిరక్షించలేని రాజ్యం విఫల రాజ్యమైతే.. అణచివేతను నియంత్రణకు సాధనంగా ఉపయోగించే రాజ్యం పోలీసు రాజ్యమని పద్మనాభయ్య అన్నారు. గత కొన్నేళ్లుగా ఇండియా ఈ రెంటి మధ్యా ఊగిసలాడుతోందన్నారు. ప్రజల జీవితాల్ని, దృక్పథాల్ని శాసించే చట్టబద్ధపాలనతో ముడివడిన నాలుగు విభాగాలు.. పోలీస్, ప్రాసిక్యూషన్, జ్యుడీషియరీ, జైళ్లను సంస్కరించేందుకు వివిధ కమిటీలు ఇచ్చిన సిఫార్సుల అమలు ఎంత పేలవంగా ఉందో వివరించారు. అధికారాల విభజన పేరుతో న్యాయ వ్యవస్థ ప్రక్షాళనకు దూరంగా ఉన్న ప్రభుత్వం.. ఓట్లు వచ్చే వ్యవహారాలు కాదు కాబట్టి ప్రాసిక్యూషన్, జైళ్ల సంస్కరణలను పక్కనపెట్టిందన్నారు. ప్రపంచ న్యాయనివేదిక ప్రకారం చట్టబద్ధపాలనలో భారత్ 128 దేశాల్లో 69వ స్థానంలో ఉందని పద్మనాభయ్య అన్నారు. బ్రెజిల్, దక్షిణాఫ్రికా, నేపాల్ కంటే కూడా ఇండియా దిగువన ఉందన్నారు. క్రిమినల్ న్యాయం కంటే సివిల్ న్యాయ విభాగంలో మన దేశం పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో నివేదిక వివరించిందన్నారు. పోలీస్ యాక్ట్‌లాంటి ఒకే రకం చట్టాలతో పనిచేస్తున్నా, పోలీసుల పనితీరు రాష్ట్రాలవారీగా మారిపోతోందన్నారు. ఛార్జిషీట్ అయిన అనేక కేసుల వివరాల్ని ఎన్‌సీఆర్‌బీ రిపోర్టు నుంచి ఈ సందర్భంగా వివరించారు. కొచ్చిన్‌లో ఛార్జిషీట్ అయిన కేసులు 98% కాగా, ఢిల్లీలో కేవలం 16.2%. అధికారంలో ఉన్నవారికి పోలీసు వ్యవస్థకున్న సాన్నిహిత్యం ఆ రాష్ట్రంలో ఛార్జిషీట్ శాతానికి విలోమ నిష్పత్తిలో ఉన్నట్లు కన్పిస్తోందని వ్యాఖ్యానించారు. పోలీసుల పనితీరు, గణాంకాలను

సమగ్రంగా ప్రజల ముందుంచే వార్షిక నివేదికలు విడుదల కావటం లేదన్నారు. పోలీసు యంత్రాంగం పనితీరును బేరీజు వేయటానికి, వ్యవస్థను మెరుగుపరచటానికి ఎటువంటి చర్యలు కావాలో తెలుసుకోవటానికి అటువంటి నివేదిక అవసరమన్నారు.

7వ పే కమిషన్ తర్వాత పోలీసుల జీతాలు సాపేక్షంగా పెరిగినప్పటికీ అనేక సమస్యలు ఆ విభాగాన్ని పీడిస్తున్నాయని పద్మనాభయ్య తెలిపారు. నియామకాలకు, శిక్షణా ప్రక్రియకు మధ్య పొంతన లేకపోవటం, బాధ్యతల పేరుతో పోలీసుల మీద మితిమీరిన భారాన్ని మోపటం ఒక సమస్యన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ సహా పెద్దసంఖ్యలోని కేంద్ర, రాష్ట్ర చట్టాలపై, 66 కేంద్ర ప్రత్యేక చట్టాలపై, రాష్ట్రాల్లోని ఆతర స్థానిక చట్టాలపై పోలీసులకు క్షుణ్ణంగా తెలిసుండాలని నిర్దేశించారన్నారు. దీనికితోడు రకరకాల ప్రత్యేక చట్టాల కింద పోలీసులను దర్యాప్తు అధికారులుగా నియమిస్తున్నారన్నారు. ప్రస్తుత శిక్షణా వ్యవస్థ ఈ కేసులన్నిటినీ ఎదుర్కోగలిగేలా పోలీసులను సన్నద్ధం చేయలేకపోతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు శిక్షణను ఆయన ఉదాహరణగా చెప్పారు. ఏపీలో పోలీసులు 9 నెలలు కాలేజీలో, 2 నెలలు గ్రేహౌండ్స్‌లో, 1 నెల ఆర్మ్‌డ్ పోలీస్‌తో శిక్షణ పొందుతారని, అందులో మొదటి 9 నెలలు మాత్రమే పోలీసు విధులకు పక్కాగా సంబంధించినవన్నారు. పోలీసు సిబ్బందిని సంఖ్యలో, సామర్థ్యంలో పెంచాలన్నారు. పద్మనాభయ్య కమిటీ నివేదిక సిఫార్సును ప్రస్తావిస్తూ, అభ్యర్థులను పాఠశాల విద్య పూర్తయిన వెంటనే రిక్రూట్ చేసుకుని, 3 ఏళ్ల పోలీస్ శిక్షణనివ్వాలన్నారు. కోర్సు పూర్తయ్యాక డిగ్రీని ప్రదానం చేయాలన్నారు. ఆ తర్వాత అవసరమైతే మరో 6 నెలల ప్రత్యేక నైపుణ్యాల శిక్షణనిచ్చి వివిధ స్థాయిల్లో పోస్టింగ్ ఇవ్వాలన్నారు.

పోలీసు సిబ్బంది దృక్పథం, పనితీరు ప్రధానంగా ఐదు అంశాలతో ప్రభావితమవుతుందని పద్మనాభయ్య అన్నారు.

**1. పోలీసు నాయకత్వం**

**2. రాష్ట్రాల్లో రాజకీయం తీరు**

**3. పద్ధతి ప్రకారం నియామకాలు (నిర్ణీత క్యాలెండర్‌తో)**

**4. అవసరానికి తగ్గ శిక్షణ (శాంతి భద్రతల నిర్వహణ, దర్యాప్తు, అంతర్గత భద్రత, ఇంటెలిజెన్స్ సమాచార సేకరణ, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాలు వగైరాలు. సిబ్బంది నూతన సాంకేతికతను, పద్ధతులను అనుసరించగలిగేలా ఎప్పటికప్పుడు తాజా శిక్షణనిస్తుండాలి).**

**5. ప్రజలతో కలివిడిగా పనిచేయటం. కమ్యూనిటీ పోలీసింగ్‌ను ఒక కార్యక్రమంలా కాకుండా ఒక ప్రజాస్వామిక తాత్వికతగా, స్ఫూర్తిగా అమలు చేయాలి.**

పోలీసు శిక్షణకు సంబంధించి పలు అంశాలను పద్మనాభయ్య విశదీకరించారు. సైన్యంలోలా పోలీసు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఉండాలన్నారు. విధి నిర్వహణకు సంబంధించిన పరిజ్ఞానంతో పాటు, పోలీసు అధికారులు ప్రజాహితం కోసం స్ఫూర్తిదాయకంగా పనిచేసేందుకు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ నిర్మాణం వంటి అంశాలను కూడా బోధించాలన్నారు. పోలీసులు, ప్రాసిక్యూటర్లు, న్యాయమూర్తులకు ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తే మూడు విభాగాల మధ్యా సమన్వయం పెరుగుతుందన్నారు.

నేరాలను గుర్తించటం కన్నా నేరాల నియంత్రణ కీలకమని, పోలీసు విధానాల్లో ఈ సూత్రానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పోలీసుల మీద మితిమీరిన భారాన్ని తగ్గించటానికి పద్మనాభయ్య పలు సిఫార్సుల్ని చేశారు. ఎస్కార్ట్ విధుల పోలీసుల నుంచి తప్పించి అందుకోసం ప్రత్యేకంగా రాష్ట్ర సెక్యూరిటీ దళాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం సీఆర్‌పీసీ కింద 372 నేరాలను గుర్తించారని, ఇందులో 250 తీవ్రస్థాయివి (కాగ్నిజిబుల్) అని పద్మనాభయ్య అన్నారు. నాన్‌కాగ్నిజిబుల్ కేసులలో చాలా వరకు డాక్యుమెంట్ల ఫోర్జరీ వంటి వైట్‌కాలర్ నేరాలన్నారు. ఇవి పెరిగిపోతున్నందున నాన్‌కాగ్నిజిబుల్ విభాగం నేరాలపై పునస్సమీక్ష అవసరమన్నారు. నాన్‌కాగ్నిజిబుల్ నేరాలను స్థానిక కోర్టుల ద్వారా లేదా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ల ద్వారా విచారించే ఏర్పాటు చేస్తే పోలీసుల మీద భారం తగ్గుతుందన్నారు.

క్లాస్ 1, ఆపై స్థాయి అధికారులతో ఇండియన్ ఫోరెన్సిక్ సైన్స్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

డైరెక్టొరేట్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్‌ను న్యాయ శాఖ నుంచి హోం మంత్రిత్వ శాఖకు బదిలీ చేయాలని పద్మనాభయ్య సూచించారు. ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌గా పోలీసు అధికారి ఉంటే ఆ పదవిలో ఉన్నంత వరకూ తన పోలీసు అధికారాలను వినియోగించ కూడదన్నారు. జేపీ ప్రతిపాదించిన జిల్లా అటార్నీ పద్ధతి అవసరమని, ప్రాసిక్యూషన్ కేసు విచారణతో పాటు పోలీసు దర్యాప్తుకి కూడా సహకరించాలన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై పలు సూచనల్ని చేస్తూ, న్యాయ సంస్కరణల ఆవశ్యకతను వివరించారు. పోలీసుల ఛార్జిషీట్ శాతం 67గా ఉందని, ముగించిన కేసులు కాకుండా మొత్తం నమోదు చేసిన కేసుల సంఖ్యకు అనుగుణంగా తీసుకుంటే ఈ శాతం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. ఛార్జిషీట్ ఫైల్ చేయకుండానే మూసివేస్తున్న 33% కేసులు చాలా పెద్ద సంఖ్య అన్నారు. బాధితులు లేదా సాక్ష్యులు అడ్డం తిరిగి విచారణ ప్రక్రియకు ఆటంకం కలిగించే సందర్భాల్లో మేజిస్ట్రేట్లు అపరాధ నిబంధన (పెర్జ్యురీ క్లాజ్) ఎక్కువగా ఉపయోగించటం మేలని పద్మనాభయ్య అన్నారు.

**జస్టిస్ జాస్తి చలమేశ్వర్**

మనకు నిబంధనలున్న చట్టబద్ధపాలన ఉన్నప్పటికీ, వాస్తవంలో భారతీయ సమాజం దాన్ని గౌరవించదని జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటు విషయంలో చట్టసభ తీరును ఉదాహరణగా చెప్పారు. చట్టబద్ధపాలన అంటే రాజ్యవ్యవస్థ తీసుకునే ప్రతి చర్యా నిర్దేశిత చట్టసభ చేసిన చట్ట పరిధిలోనే ఉండాలన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం, హైకోర్టు ఏర్పాటు పార్లమెంటు చేసిన చట్టం ద్వారా మాత్రమే జరగాలని.. ఏర్పాటు తేదీ, నియమించాల్సిన న్యాయమూర్తుల సంఖ్య, ఎక్కడ ఏర్పాటు చేయాలి మొదలైనవన్నీ అందులో ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ విషయంలో, తేదీ గురించిన ఎటువంటి ప్రస్తావన లేకుండా రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా హైకోర్టు ఏర్పాటు జరిగిందన్నారు. చట్టబద్ధపాలన పట్ల లెక్కలేనితనానికి ఈ పెద్ద నిర్లక్ష్యం ఓ

సంకేతమన్నారు. చట్టబద్ధపాలనను జీవనశైలిలో భాగంగా మార్చుకోవాలన్న సహ ప్యానలిస్టుల అభిప్రాయంతో ఆయన పూర్తిగా ఏకీభవించారు.

నేర న్యాయ వ్యవస్థ గురించి మాట్లాడుతూ, దర్యాప్తు సంస్థ, ప్రాసిక్యూషన్, న్యాయ విభాగం.. ఇలా వ్యవస్థలోని వారందరిలో నిబద్ధత లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రిసైడింగ్ జడ్జిగా ఉన్నప్పుడు సుప్రీంకోర్టులో వచ్చిన ఒక అప్పిలేట్ అంశాన్ని ఆయన ఉదాహరణగా చూపారు. మృతి చెందిన ముగ్గురిలో ఒకరి పోస్టుమార్టం నివేదికను కింది కోర్టులో సమర్పించకపోయినప్పటికీ, నిందితుడు ముగ్గురు బాధితులనూ హత్యచేసినట్లు నిర్ధారించి శిక్ష విధించారన్నారు. మరణానికి కారణాన్ని వివరించే ధృవీకరణ పత్రం లేకుండానే నిందితునికి శిక్ష విధించటం దర్యాప్తు అధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, సెషన్స్ న్యాయమూర్తుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. పోలీసుల పనిలో రాజకీయ జోక్యం ఈ కేసులో తప్పిదానికి కారణం కాదన్నారు. ఇది పూర్తిగా వ్యవస్థలోని అసమర్థత వల్ల జరిగిందన్నారు. ఎప్పటికప్పుడు వ్యవస్థ పనితీరును బేరీజు వేసి చర్యలు తీసుకోకపోవటం వల్లే ఇలాంటి వైఫల్యాలు, అసమర్థత యధేచ్ఛగా కొనసాగుతున్నాయన్నారు.

తీవ్రస్థాయి నేరాలను దర్యాప్తు చేయటానికి ప్రత్యేక నేర పరిశోధన విభాగం ఉండాలని మిగిలిన ప్యానలిస్టులు చేసిన సూచన ఎంతో అవసరమైనదని జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంస్కరణ అమలుకు ఒప్పుకుంటాయా అని సందేహం వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధికి న్యాయవ్యవస్థను సంస్కరించటం అట్టడుగు ప్రాధాన్యాంశంగా ఉందన్నారు. తిరిగి ఎన్నికైతే నియోజకవర్గంలో కొత్త కోర్టును ఏర్పాటు చేస్తానని ఏ నాయకుడూ ఇంతవరకు హామీ ఇవ్వలేదన్నారు. కోర్టులు, పోలీసు అధికారుల సంఖ్యను పెంచటానికి, శిక్షణా కార్యక్రమాలకు తగిన కేటాయింపులు లేవని, ప్రజలకు న్యాయం అందించటం పట్ల ఎన్నికైన ప్రభుత్వాలలో పాతుకుపోయిన నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోందన్నారు.

ఈ సమస్యలను ఎదుర్కోవటానికి రెండు పరిష్కారాలు అవసరమన్నారు. మొదటిది, న్యాయ, వైద్య రంగాలలోలా పోలీసులకు కూడా తమ విధులకు సంబంధించిన అంశాలతో ప్రత్యేక బోధన ఉండాలి. ఐపీఎస్, ఐఏఎస్ క్యాడర్ వివరాల్ని ఎలా మదింపు చేస్తారో అలా ప్రతి స్థాయిలో, ప్రతి రాష్ట్రంలో అవసరమైన పోలీసు సిబ్బందిపై స్పష్టమైన అంచనా ఉండాలి. వచ్చే 10 ఏళ్లపాటు ఎంతమంది అధికారులు అవసరమవుతారో, అంచనాల్ని రూపొందించాలి. నియామకాలు, శిక్షణను సూక్ష్మస్థాయిలో కూడా అవసరాలనుకనుగుణంగా చేయాలి. ప్రస్తుతం చేస్తున్నట్లు తాత్కాలిక ధోరణి పనికిరాదు. ఈ సందర్భంగా గువహటి హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా తన అనుభవాన్ని వివరించారు. శిక్షణలో లోపాల కారణంగా, ఆ కేసులో దర్యాప్తు అధికారికి చట్టంపై తగిన పరిజ్ఞానం లేదన్నారు. పోలీసు వ్యవస్థలోకి ప్రవేశించి సేవలందించాలనుకునేవారికి హైస్కూలు తర్వాత ప్రత్యేక కోర్సు ఉండే ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

రెండోది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర మారాలని జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. బ్రిటిష్ కాలంలో, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు దర్యాప్తును చురుగ్గా పర్యవేక్షించేవారని, దర్యాప్తు అధికారులకు సూచనలిస్తుండేవారని చెప్పారు. చట్టంలో ప్రత్యేకించి ఏర్పాటు లేకుండా ఇదో సంప్రదాయంగానే కొనసాగిందని.. ప్రాసిక్యూటర్ నుంచి పోలీసులు సలహా తీసుకోవటం, సలహాసూచనలిచ్చేందుకు ప్రాసిక్యూటర్ స్వచ్ఛందంగా ముందుకు రావటం తగ్గటంతో అది మరుగున పడిపోయిందన్నారు. ఇప్పటికైనా దర్యాప్తును పర్యవేక్షించే అధికారాన్ని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఇచ్చేందుకు న్యాయపరమైన తగిన ఏర్పాటు చేయాలన్నారు. ఈ రకంగా చేయటం వల్ల నేర పరిశోధనలో లోటుపాట్లు, వైఫల్యాలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌నే బాధ్యుడ్ని చేయవచ్చన్నారు. దర్యాప్తులో సమర్థత కూడా పెరుగుతుందన్నారు. ప్రస్తుతం పబ్లిక్ ప్రాసిక్యూటర్లను రాజకీయ విధేయతతో తప్ప, సామర్థ్యం లేదా చట్టపరమైన పరిజ్ఞానం ప్రాతిపదికన నియమించటం లేదన్నారు. పనితీరు ఆధారంగానే ప్రమోషన్ ఉండాలన్న పద్మనాభయ్య వాదనతో ఆయన ఏకీభవించారు.

జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, సమస్య లక్ష్యశుద్ధి లేకపోవటంలో ఉంది తప్ప.. రూపకల్పనలో, ఉద్దేశాల్లో లేదన్నారు. ఇప్పటిదాకా భారతదేశంలో రాజ్యాంగం పేరుతో అర్ధ భూస్వామ్య వ్యవస్థ నడుస్తోందని, బడితె ఉన్నవాడిదే బర్రె అనే ధోరణి తప్ప చట్టబద్ధపాలన పట్టటం లేదన్నారు. ఇదే పరిస్థితిని కొనసాగిస్తే తీవ్ర ఆర్థిక, సామాజిక ప్రమాదాలొస్తాయని, రాజకీయంగా కూడా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆర్థికాభివృద్ధి, సామాజిక స్థిరత్వం, రాజకీయ ఎదుగుదల పరంగా మనకేమీ పెద్ద ఆశలు లేకపోతే వేరే సంగతన్నారు. 'ప్రజాభిప్రాయమే అంతిమం. అది లేకుండా, ఏదీ సాధ్యం కాదు. అది ఉంటే ఏదీ విఫలమవదు' అన్న అబ్రహాం లింకన్ మాటల్ని ఈ సందర్భంగా జేపీ ఉటంకించారు. ఇప్పటిదాకా ప్రజలు చట్టబద్ధపాలనకు, తమ జీవితాల్లో ఎదగటానికి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోలేదని, అందువల్ల చట్టబద్ధపాలన కొందరు ఆలోచనాపరుల అంశంగా, రాజ్యాంగ భావనగానే తప్ప జనజీవితంలో భాగం కాలేదన్నారు. చట్టబద్ధపాలన విఫలమైతే తమ వ్యక్తిగత జీవితాల్లో ఎంత తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటాయో ప్రజల్లో అవగాహన కలిగించటం తక్షణావసరమని జేపీ అన్నారు.

అనంతరం.. పోలీసు, న్యాయవ్యవస్థల్లో ఖాళీలు, నియామకాలు తక్కువగా ఉండటం, పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవటం, మాలిమత్ కమిటీ సిఫార్సుల అమలుకు అవరోధాలను అధిగమించటం, జైళ్లలో విచారణ లేకుండా మగ్గుతున్న వారికి సింగపూర్ తరహాలో ప్లీ బార్గెయినింగ్ పద్ధతి అమలు చేయటం, న్యాయసేవా సంస్థ సేవల విస్తరణ, భారతదేశం సురక్షితం కాదని అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రచారం తదితర అంశాలపై ప్రశ్నలకు ప్యానలిస్టులు జవాబులిచ్చారు.

**చట్టబద్ధపాలనపై మరిన్ని అంశాలు, కోణాలతో, పలువురు నిపుణులు, నిష్ణాతులతో సమగ్ర చర్చ.. ఫిబ్రవరి 20 నుంచి జరగనున్న ఐడీఏడబ్ల్యూ ద్వితీయ వార్షిక సదస్సులో!**

# కొత్త పాలక మండలి సరే.. ఎన్నికల వైఫల్యాల మాటేమిటి?

## ప్రజలు 'సామాజిక డైరీ' అలవాటును ప్రారంభించటం అవసరం

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కొత్త పాలక మండలి జమానా ఈ నెల నుంచి మొదలవుతోంది. అయితే ఆ ఎన్నికల సమయంలోని వైఫల్యాలు విస్మరించరానివి.




జీహెచ్ఎంసీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో హోరాహోరీ ప్రచారం జరిగినా, జాతీయస్థాయి వరకూ హోరెత్తినా హైదరాబాదీలు మాత్రం ఓటు వేయటానికి పెద్దగా ఉత్సాహం చూపలేదని పోలింగ్ రోజున కొంత చర్చ జరిగింది. ఇంచుమించు గతసారిలాగే పోలింగ్ జరగటం, ఫలితాల్లో బీజేపీ భారీ స్ట్రయిక్ రేట్‌కి అధికార టీఆర్ఎస్ పార్టీ ఖంగుతినటం వంటి పరిణామాలతో ఓటింగ్ శాతం గురించిన చర్చ మళ్లీ మరుగున పడిపోయింది. ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మునిసి పల్ కార్పొరేషన్ కొత్త పాలక మండలి కొలువు తీరుతుండటంతో ఎన్నికల చర్చ (కోర్టు కేసుల్లో మినహాయించి) గతంలో కలిసిపోతోంది. కానీ ఓటింగ్ శాతంతోపాటు.. జీహెచ్ఎంసీ ఎన్నికల చుట్టూ కనిపించిన మరికొన్ని ప్రజాస్వామిక వైఫల్యాలపై పరిష్కారాలు, కార్యాచరణ దిశగా చర్చను కొనసాగించటం మన ఎన్నికల వ్యవస్థను, మన పాలనను కూడా గణనీయంగా మెరుగుపరచుకోవటానికి ఎంతో అవసరం.

ఓటింగ్‌లో కొన్ని వర్గాలు, కొన్ని శక్తులు పాల్గొనటం వల్ల తమకు నష్టమనే భయంతో వారిని నియంత్రించేందుకు ఓటింగ్ మరీ పెరగకూడదని ఒక ప్రధాన రాజకీయ పార్టీ భావించినా.. వారి ఓట్లు తమకు కావాలని ప్రత్యర్థి పక్షం భావిస్తుంది కాబట్టి, రాజకీయ పార్టీల మధ్య గెలుపోటములు తరచూ కాకపోయినా మారుతూనే ఉంటాయి కాబట్టి.. ఏదోక రకంగా రాజకీయ పార్టీలు పోలింగ్ శాతాన్ని పెంచటంలో భాగస్వాములనే భావించాలి. అందుకే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన సాయంత్రం అధికార టీఆర్ఎస్‌తోపాటు ప్రతిపక్ష బీజేపీలో కూడా పలువురు అభ్యర్థులు డీలా పడ్డారు. 'అంత కష్టపడ్డా, ఇంత తక్కువ ఓటర్లేంటన్నా' అని వారి అనుయాయులు వాపోయారు. ఇంకా పెద్ద విషయమేమంటే, డబ్బులు, ఉచితాలను పోటాపోటీగా పంచటం, హామీ ఇవ్వటం చేయకుంటే ఈ మాత్రం ఓట్లు కూడా పోల్ కావు. పౌరసత్వ భావన ఉన్నవారు, ప్రభుత్వంలో పనులు జరగటం కోసం స్థానిక నేతల మీద ఆధారపడినవారు తప్ప మరెవరూ ఓటు వేసేవారు కాదు. ఈసారి ఎన్నికల్లో కాలనీలు, అపార్ట్‌మెంట్ల సంఘాలు కూడా ఓటుకు నోట్లు అడిగాయని వార్తలొచ్చాయి. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేయించమని (ఈ పనుల్ని సేవాభావంతో చేసి పెట్టటం కోసమే మన పన్నుల డబ్బుతో మిగతా సమాజ స్థాయి కంటే భారీగా జీతభత్యాలిచ్చి ఉద్యోగుల్ని, అధికారుల్ని ఏర్పాటు చేసుకున్నాం) ప్రజాప్రతినిధులను అడగటమే ఒక ప్రజాస్వామిక వ్యవస్థాగత వైఫల్యమైతే, ఆ పనికయ్యే రుసుము వంటి ప్రైవేటు వ్యయం డబ్బుల్ని కూడా ఇస్తేనే ఓటు వేస్తామని అభ్యర్థులకు చెప్పటం అంతకంటే పెద్ద ప్రజాస్వామిక వైఫల్యం. తాము టీఆర్ఎస్‌కు భిన్నంగా ఉండే, మెజారిటీ ప్రజలకు స్ఫూర్తినిచ్చే ప్రత్యామ్నాయ ఎజెండాను, రాజకీయాన్ని అందించలేకపోయామని, తమది ఇంకా దీర్ఘకాలిక ప్రభావం చూపగల శక్తి కాదని బీజేపీకి కూడా గుర్తుచేసే పరిణామాలివి.

కోట్ల రూపాయలను వెదజల్లకపోతే ఏ పార్టీ, ఏ అభ్యర్థీ కూడా అరుదుగా తప్ప అసలు పోటీలోనే ఉండటం సాధ్యంకాదన్నది ఇంకో కోణం.

ఉదాహరణకు, కోదండ రాం పార్టీ తెలంగాణ జన సమితి

అభ్యర్థికి ఓటు వేద్దామని ఎవరైనా అనుకున్నా, తమ డివిజన్‌లో ఆయన పార్టీ అభ్యర్థి ఉన్నారో లేదో తెలియని పరిస్థితి. ఒకవేళ ఉంటే ఏ గుర్తు వచ్చిందో తెలియని పరిస్థితి. పత్రికల్లో ప్రచారం, ప్రకటనలు, సోషల్ మీడియాలో వార్‌రూమ్ ప్రచారం, క్షేత్రస్థాయిలో రోజువారీ ప్రచారం వీటన్నిటికీ బోలెడంత డబ్బు కావాలి. ఇన్ని రకాలుగా డబ్బులు ఖర్చు చేస్తేనే అసలు ఎన్నికల్లో ఏ పార్టీ అయినా, అభ్యర్థి అయినా పోటీలో ఉన్నట్లు లెక్క.

డబ్బు తీసుకోకుండా, ఉచితాల పట్ల ప్రలోభాలకు లోనుకాకుండా, కులం, మతం వంటి ఉద్వేగాలకు లోనుకాకుండా ఎవరైనా మంచి అభ్యర్థులను వెతికి గుర్తించి ఓటు వేయాలనుకున్నా.. ఓడిపోతాడేమో, ఓటు వేస్టవుతుందేమోనని శంక!.. వీటన్నిటి మధ్యా గెలిచినవారినే మనం గొప్ప రాజకీయ విజేతలనుకుంటున్నాం. ఆ పరిమిత పరిధిలోని అంశాలపైనే పోటాపోటీ విశ్లేషణలు చేస్తున్నాం. కానీ అందులో పనికొచ్చే రాజకీయమెంత, ఎన్నికల మేనేజ్‌మెంట్ ఎంత అని ఆలోచించటానికి కొంతైనా తీరిక చేసుకోకపోతే మనకి మనమే నష్టం చేసుకున్నవారమవుతాం. డైరీల్లో వ్యక్తిగత విషయాలనే కాకుండా.. మన పరిధిలో సమాజానికి సంబంధించిన వివరాల్ని కూడా నమోదు చేసుకుంటూ.. పౌర బాధ్యతలుగా మనం ఎప్పుడేం చేయాలో ప్రణాళిక రాసుకోవటాన్ని ఇకనైనా ప్రారంభించాలి. ప్రత్యేక 'సామాజిక డైరీ/ప్లానర్' ఉంటే మరీ మంచిది. ఈ సామాజిక అలవాటును ప్రారంభించకుంటే, రోజుకో ఈవెంట్‌ల కాలంలో మన జీవితాలకి సంబంధించిన అత్యంత కీలకమైన విషయాలు మరుగున పడిపోతుంటాయి.

## సీటు కోసం వారు.. పూట కోసం వీరు



అంతా ఎన్నికల మాయ.. అభ్యర్థులకు కార్యకర్తలు కావాలి.. కార్యకర్తలకు ఉపాధి కావాలి.. అందుకే ఎవరిస్తే వారికి జై అంటున్నారు. పై చిత్రాలే అందుకు నిదర్శనం. ఆదివారం గౌలిపురా భాజపా అభ్యర్థి పటేల్‌నగర్‌లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొని సెల్ఫీ దిగుతున్న ఈ యువతులే.. మరుసటి రోజు అదే డివిజన్ అయోధ్యనగర్‌లో తెరాస అభ్యర్థి బొడ్డు సరిత నిర్వహించిన ప్రచారంలో తెరాస జెండాలతో కనిపించారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒక్కో డివిజన్‌లో 1 కోటి నుంచి 5 కోట్ల వరకూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖర్చు పెట్టారని కొన్ని అనధికారిక అంచనాలు. కొంతమంది టీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థుల ఖాతాల్లోకి ఒక కాంట్రాక్టర్ నుంచి కోటి రూపాయల వంతున నేరుగా జమచేయించారని కేంద్ర ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే, వీళ్ల లెక్క గురించి బయటపెట్టారు, అవతలివాళ్లది దాచిపెట్టారు.. అంతే తేడా! ఎన్నికల్లో డబ్బు పంచని వాళ్లెవరని ప్రజలు కూడా భావిస్తున్నారని.. అందువల్ల దుబ్బాక అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి డబ్బంటూ పోలీసులు హడావుడి చేయటం వల్ల అధికార టీఆర్ఎస్ పార్టీకే నష్టం జరిగిందని కొందరు వాదించారు. ఇలా చట్టవిరుద్ధ డబ్బు రాజకీయం బహిరంగ రహస్యం కాదు బహిరంగమే అని ఓటర్లు కూడా భావించటం దిగ్భ్రాంతికరమే కావచ్చు. ఏ పార్టీ నుంచి గెలిచినవాళ్లయినా ఎంతోకొంత దోచుకుంటూనే ఉంటారు, దోచుకున్నా మనకు పనిచేసి పెట్టే మొనగాడైతే చాలు అని ప్రజలు అనుకుంటూ ఉండచ్చు. కానీ ఈ నిరాశ, ఆత్మవంచనతో ఎల్లకాలం సహజీవనం చేయలేం కాబట్టి.. మనలోని ఆశావాదంతో పరిష్కారాన్ని వెతుక్కోక తప్పదు.

కేవలం గెలిచి దోచుకోవటం కోసమేనా పార్టీలు, అభ్యర్థులు ఇంత ఖర్చు పెడుతున్నారు? అన్నది పరిష్కారక్రమంలో మనం మొదట ఆలోచించాల్సిన ప్రశ్న.

'లేదు' అన్నదే సమాధానం! నూరుశాతం కాకున్నా ఎక్కువశాతం.

మన సమాజంలో సేవ కోసం అధికారం అనే ప్రజాస్వామిక భావన కన్నా, పెత్తనం కోసం పవర్ అత్యున్నతావకాశం అనే బూర్జువా తత్వం ఇంకా ఎక్కువగానే కొనసాగుతోందన్నది వాస్తవం. ఆ రకంగా డబ్బున్నవాళ్లో, తెగించి తాకట్టు పెట్టి మరీ ఖర్చు పెట్టేవాళ్లో చేసే వ్యయం ఉన్నప్పటికీ.. ప్రధానంగా ఖర్చు మన రాజకీయాల్లోని భ్రష్టత్వంలో ఉంది. ఐదు వేల సంవత్సరాలపైబడిన భారతీయ అనుభవాలను, ప్రపంచ దేశాల అత్యుత్తమ పద్ధతులను అధ్యయనం చేసి వర్తమాన భారతానికి కావలసిన వ్యవస్థలను రూపొందించుకోవటంలో మన వైఫల్యం, లోటు ఇందుకు ప్రధాన కారణం. దీనివల్ల ఓ విషవలయంలో పార్టీలు, నేతలు కూరుకుపోయారు. ప్రజలకు ఏదైనా సేవ చేద్దామని వచ్చినవారు కూడా రాజీపడటమో, రాజకీయాల నుంచి వైదొలగటమో చేస్తున్నారు. దీన్ని మార్చనంత వరకూ మన దేశంలో ఎవరు ఎంత అద్భుత మెజారిటీతో అధికారంలోకి

వచ్చినా ప్రజలు తమ డబ్బునే యాచించే కొత్తరీతులు పెరగటం, గోరంత అభివృద్ధే తప్ప జన జీవితాల్లో మౌలిక మార్పేమీ రాదు.

2016 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ భారీ మెజారిటీతోనే గెలిచింది. కానీ చెప్పుకోదగిన స్థాయిలో ఏం చేయగలిగింది? మార్పుకి దోహదం చేసే రీతిలో లేని, మార్పుకి దోహదం చేయని అధికారం వల్ల లాభమేంటి? దీన్ని మార్చాలంటే ఏ ఒక్కళ్లో స్పందిస్తే సరిపోదు. గెలిచినవారు, ఓడినవారు, ప్రజలూ అందరి వైపు నుంచీ మార్పు మొదలవ్వాలి. ఓట్ ఇండియా సహా పలు ప్రజాస్వామ్య సంస్కరణల పోరాటాన్ని సుదీర్ఘకాలంగా చేస్తున్న లోక్‌సత్తా జేపీ చెప్పినట్లు.. నగర ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు బదిలీ చేసి మేయర్‌కు సాధికారత కల్పించకుండా, స్థానికంగా ప్రతి డివిజన్‌లో ప్రజలెనుకున్న కమిటీల్ని ఏర్పాటు చేయకుండా రాష్ట్ర ముఖ్యమంత్రే మేయర్‌లా వ్యవహరిస్తుండటం వల్ల హైదరాబాద్ ప్రజలకు స్థానికంగా రోజువారీ సేవలు అధ్వాన్నంగా తయారయ్యాయి, అందువల్లే మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటింగ్ పట్ల ఎవరికీ పెద్ద ఆసక్తి లేకుండా పోయింది. కాబట్టి రాష్ట్ర పాలకులు ముందుగా నగర ప్రభుత్వాలకు సాధికారతనివ్వాలి. జాతీయ స్థాయి ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల్లో వెంటనే మూడో వంతు వాటా ఇవ్వకపోయినా గణనీయంగా కేటాయించాలి. మేయర్‌కు ప్రత్యక్ష ఎన్నికను నిర్వహించి అధికారాలను ఇవ్వాలి. ప్రజలను పాలనలో భాగస్వాముల్ని చేసేందుకు ఎన్నికైన కమిటీలను ఏర్పాట్లు చేయాలి. దీనివల్ల ప్రజలు పాలనలో తప్పొప్పుల్ని అర్థం చేసుకుని నాణ్యమైన పాలనకు దోహదం చేస్తారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలకు ఎమ్మెల్యేలపై ఆధారపడటం తగ్గుతుంది. ముఖ్యమంత్రులను కూడా ప్రత్యక్షంగా ఎన్నుకునే విధంగా ఎన్నికల సంస్కరణను అమలు చేస్తే, ఆయన కూడా ఎమ్మెల్యేలపై ఆధారపడకుండా స్వేచ్ఛగా వ్యవహరించగలుగుతారు. సమాజంలోని నిపుణుల సామర్థ్యాన్ని కూడా ఉపయోగించుకుంటూ తాను అనుకున్న మార్పులను తీసుకురాగలుగుతారు.

ఎప్పుడైతే ఇలా అధికారాల విభజన జరిగి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల జోక్యం ఉండదో, నగర ప్రభుత్వాలు మరింత స్వయంప్రతిపత్తితో బలోపేతం అవుతాయి. అప్పుడు పార్టీల నిర్వహణలో కూడా గణనీయ మార్పులు చోటు చేసుకుని అంతర్గత ప్రజాస్వామ్యం నెలకొంటుంది. విరాళాల సేకరణలో పారదర్శకత పెరిగి నూరుశాతం చట్టబద్ధమవుతుంది. గెలిస్తే ఒకలా, ఓడిపోతే ఇంకోలా పార్టీల్ని ఫిరాయించే ధోరణులు తగ్గుతాయి. ఒక రాజకీయ పార్టీ నిర్వహణకి ఎంత ఖర్చవుతోందో, ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకున్న వ్యక్తులు తమ ఇమేజ్ కోసం, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటం కోసం ఎన్నికల మధ్యకాలంలో కార్యకర్తలను పోషించటం కోసం ఎలా కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటోందో మనం స్పష్టంగా తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి ఈ ధనరాజకీయం దేశమంతా వ్యాపించింది. డబ్బు వ్యయం స్థాయిల్లో తేడా తప్ప రాజకీయ భ్రష్టత్వంలో మాత్రం ఇప్పుడు ఈ రాష్ట్రం, ఆ రాష్ట్రం అని తేడా లేదు. (ఎన్నికల మధ్యకాలంలో ప్రధాన పార్టీలు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో వందలాది కార్యకర్తలను పోషిస్తుండటం వల్ల పార్టీల నిర్వహణ మీద ఎలా విపరీత ఆర్థిక భారం పడుతోందో తెలియజేస్తూ క్షేత్రస్థాయి శాంపిల్ సర్వేతో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) రూపొందించిన నోట్‌ను ఇదే సంచికలో చదవగలరు).

2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కొందరు కార్యకర్తలు జీవనోపాధి కోసం ఏకంగా రెండు పార్టీలకు ఎలా పనిచేశారో ఒక ప్రముఖ పత్రిక ప్రచురించింది (ఫోటో చూడవచ్చు). అరుదుగా తప్ప.. గెలిచినవారికి పరిజ్ఞానం, సామర్థ్యం ఉండవు.. పరిజ్ఞానం, సామర్థ్యం ఉన్నవారు గెలవలేరు అనే విధంగా మన ఎన్నికల వ్యవస్థ తయారైంది. నగర ప్రభుత్వాలకు సాధికారత, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక ఉంటే చట్టవిరుద్ధ డబ్బు, ప్రభావాలు తగ్గి ఈ పరిస్థితి మారుతుంది. ఎమ్మెల్యేలుగా కూడా సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికై అసెంబ్లీలో తమ కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చి మెరుగైన చట్టాలను తీసుకొస్తారు. స్థానిక స్వయంపాలనకు తోడు శాసనసభ నుంచి కూడా సరైన శాసనాలు వస్తే పౌర సేవలు, ప్రజల సాధికారత మరింత మెరుగవుతాయి. నగర ప్రభుత్వాల నుంచి ఎదిగిన యువ నాయకులు పరిజ్ఞానం, సామర్థ్యం, తగినంత అనుభవంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా కొత్త ఆలోచనలు, మార్పులకు నాంది పలుకుతారు.

పాలనలో స్థానిక ప్రభుత్వాలకు స్వయంప్రతిపత్తి కల్పించకపోతే ఆ కోపం మున్ముందు రాష్ట్ర ప్రభుత్వాల వైపునకు కూడా మళ్లే అవకాశముంది. ఎందుకంటే, ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రిని చూసే ప్రధానంగా ఓట్లేస్తున్నారు. చట్టవిరుద్ధంగా విపరీతంగా డబ్బు ఖర్చు పెట్టినా సరిపోకపోవటం వల్ల ఉచితాలను పంచుతున్నారు. అదీ చాలకపోతే కులం, మతం వంటి విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. వాటి ప్రభావం కూడా పనిచేయటం లేదని జీహెచ్ఎంసీ తాజా ఎన్నికలు సంకేతమిచ్చాయి. కాబట్టి జేపీ సూచించినట్లు.. తమ సమీప భవిష్యత్తు మనుగడ కోసమైనా పాలక పక్షాలు నగర ప్రభుత్వాలకు స్వయంప్రతిపత్తినిచ్చే దిశగా చర్యలు ప్రారంభించాలి. దీనివల్ల లాభాల్ని కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో గణనీయ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఢిల్లీ ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. క్రమంగా ఈ స్థానిక సాధికారతను పంచాయతీల స్థాయికి కూడా విస్తరించాలి. స్థానిక ప్రభుత్వాల్లో తప్పు జరిగితే చర్యలు తీసుకునే పర్యవేక్షణాధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. రాజకీయ వ్యవస్థను నిందిస్తూనో, మౌనప్రేక్షకులుగానో కూర్చోకుండా ప్రజలు కూడా నిర్దిష్టంగా తమ ముందున్న ఈ మార్పుల కోసం సంకల్పం తీసుకోవాలి, రాజకీయ పార్టీల ఎజెండాను మలచాలి.

# ‘పార్టీల నిర్వహణ ఖర్చు’..

## కార్యకర్తలు, వారి బృంద నాయకులను ఎఫ్‌డీఆర్ అడిగిన కొన్ని ప్రశ్నలు




‘ఆచరణలో భారత ప్రజాస్వామ్యం’ (ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్–ఐడీఏడబ్ల్యూ) కార్యక్రమం తొలి సదస్సుగా ‘రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యం’ అంశంపై 2020 జనవరిలో హైదరాబాద్ ఐఎస్‌బీ వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/ లోక్‌సత్తా రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించి ‘హైదరాబాద్ డిక్లరేషన్’ వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ సదస్సులో ఎఫ్‌డీఆర్ యువ అధ్యయన బృందం సమర్పించిన ఒక నోట్ బాగా చర్చనీయాంశమైంది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా.. ఎన్నికల మధ్యకాలంలో ప్రధాన పార్టీలు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో వందలాది కార్యకర్తలను పోషిస్తుండటం వల్ల పార్టీల నిర్వహణ మీద ఎలా విపరీత ఆర్థిక భారం పడుతోందో తెలియజేస్తూ క్షేత్రస్థాయి శాంపిల్ సర్వేతో రూపొందించిన నోట్ అది. ఇది తెలంగాణ రాష్ట్రంలోని నియోజకవర్గాలలో చేసిన సర్వే. ‘తెలంగాణలో ఒక్కో ప్రధాన పార్టీకి చెందిన ఎమ్మెల్యే/ అభ్యర్థి ఎన్నికలు లేని సమయంలో ఏడాదికి దాదాపు రూ.4.5 కోట్లు ఏదోకరూపంలో కార్యకర్తల మీద ఖర్చు చేస్తున్నారు. ఈ కార్యకర్తల సంఖ్య ఒక్కో నియోజకవర్గానికి సరాసరిన 200 వరకూ ఉంటుంది. వీరు చేసే పనేంటంటే.. ఎన్నికల మధ్యకాలంలో నిరంతరం ప్రజల మధ్య అందుబాటులో ఉండటం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటం! కార్యకర్తల్లో ఎక్కువమంది సామాన్యులు, అల్పాదాయ కుటుంబాలవారే. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులవ్వాలంటే సామాన్య ప్రజలకు ఈ కార్యకర్తలే శరణ్యం. ఈ రకంగా ఒక్కో ప్రధాన పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎన్నికల మధ్య ఐదేళ్లకాలంలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను రూ.2,675 కోట్లు ఖర్చు చేస్తుండగా, తెలంగాణలో అన్ని ప్రధాన పార్టీలూ కలిపి రూ.6,600 కోట్లు ఖర్చు చేస్తున్నాయని తేలుతుంది. ఇదికాక ఎన్నికలు వచ్చాయంటే, ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికీ కనీసం రూ.10 కోట్లు ఖర్చు చేస్తారు. ఈ రకంగా తక్కువలో తక్కువ మరో రూ.3,000 కోట్లు తెలంగాణలో పార్టీల ద్వారా ఖర్చవుతాయి. ఇలా అసంబద్ధమైనరీతిలో కార్యకర్తలను పోషించే వ్యవస్థ వల్ల ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్యాల్లోకీ సంస్థాగత నిర్వహణ వ్యయభారాన్ని అత్యధికంగా మోస్తున్నది భారతదేశంలోని రాజకీయ పార్టీలే” అని ఎఫ్‌డీఆర్ సర్వే నోట్ పేర్కొంది.. ఈ శాంపిల్ సర్వే కోసం ఎఫ్‌డీఆర్ టీం కొందరు ఎమ్మెల్యేలు, ప్రధాన పార్టీల నేతల కార్యాలయాల్లో ఉండే కార్యకర్తలను, బృంద నాయకులను అడిగిన ప్రశ్నలివి:

**నేపథ్యం (పార్టీ కార్యకర్తలను)**

1. పార్టీతో మీకు ఎంతకాలం నుంచి అనుబంధం ఉంది?
2. పార్టీలో ప్రస్తుతం చేస్తున్న పని ఎంత కాలం నుంచి చేస్తున్నారు?
3. మీరు ఏం చదువుకున్నారు?
4. మీ కుటుంబ సభ్యులు కూడా పార్టీలో ఉన్నారా?
5. ఈ ఏరియాలో మీరు ఎంతకాలం నుంచి ఉంటున్నారు?

**పని స్వభావం, సంస్థాగత నిర్మాణం (పార్టీ బృంద నాయకుడు/నాయకురాల్ని)**

1. పార్టీ బృంద నాయకుడిగా/నాయకురాలిగా మీ పాత్ర ఏమిటి? మీ ప్రధాన విధులు/బాధ్యతలు ఏమిటి?
2. పార్టీ పనిలో మీ కింద ఎంతమంది పనిచేస్తారు?
3. ఎన్నికల సమయంలో అదనంగా పార్టీ కార్యకర్తల్ని నియమించుకుంటారా? ఒకవేళ నియమించుకుంటే.. ఎంతమందిని నియమించుకున్నారు? ఏ పద్ధతిలో నియమించుకున్నారు?
4. పార్టీ కార్యకర్తలకు వాళ్లు చేసే పనులకు సంబంధించి శిక్షణ ఏదైనా ఇచ్చారా?
5. ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ మీకు ఏదైనా కాంట్రాక్ట్ పనులతో సంబంధాలున్నాయా?



**పని స్వభావం (పార్టీ కార్యకర్త)**

1. పార్టీ పనులకు రోజుకు ఎన్ని గంటలు.. వారానికి ఎన్ని రోజులు మీరు వెచ్చిస్తారు?
2. సాయం కోసం ఎంతమంది ప్రజలు మీ వద్దకు వస్తారు? మీ నుంచి ఏ రకమైన సహాయాన్ని ఆశిస్తారు?
3. ఎన్నికలు లేని సమయంలో మీకు ఎలాంటి పనులుంటాయి?
4. ప్రస్తుతం మీరు చేస్తున్న పనులు మీ బాధ్యతే (ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు పనులు చేసి పెట్టటం.. వంటివి) అని మీరు అనుకుంటున్నారా?
5. మీరు చేస్తున్న పనిలో గతానికి, ఇప్పటికీ ఏదైనా మార్పు వచ్చిందా?
6. ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ మీకు ఏదైనా కాంట్రాక్ట్ పనులతో సంబంధాలున్నాయా?

**ఆర్థిక వనరులు (పార్టీ బృంద నాయకుడు/నాయకురాలు)**

1. ప్రజాజీవితంలో సమయం వెచ్చిస్తున్న మీరు మీ సొంత అవసరాలకకోసం డబ్బుల్ని ఎలా సంపాదించగలుగుతున్నారు? మీకు ఇతర ఆదాయ వనరులేమైనా ఉన్నాయా?
2. పార్టీ కార్యకర్తలకు చెల్లింపులు ఎలా చేస్తారు? నెలవారీగానో, మరో రకంగానో నిర్దిష్ట కాలవ్యవధితో చెల్లింపులు ఉంటాయా?
3. ఎన్నికలు లేనప్పుడు ఉండే ప్రధాన ఖర్చులు ఏమిటి?
4. మీ సొంత జేబులో నుంచి పెట్టుకునే ఖర్చులేమైనా ఉన్నాయా?

**ఆర్థిక వనరులు (పార్టీ కార్యకర్త)**

1. ప్రజాజీవితంలో సమయం వెచ్చిస్తున్న మీరు మీ సొంత అవసరాలకకోసం డబ్బుల్ని ఎలా సంపాదించగలుగుతున్నారు? మీకు ఇతర ఆదాయ వనరులేమైనా ఉన్నాయా?
2. ఇన్ని రోజులకు ఇంతని మీకు నిర్దిష్ట కాలవ్యవధికి డబ్బు చెల్లిస్తుంటారా? ఒకవేళ ఇస్తే, ఎవరు మీకు ఆ చెల్లింపుల్ని చేస్తారు?
3. ఆ ఆదాయం మీ సొంత అవసరాలకు సరిపోతుందా? ఆర్థిక భద్రతనిస్తుందా? మీరు ఇతర ఆదాయ మార్గాలేవైనా ఉన్నాయా?
4. మీ మీద ఆర్థికంగా ఆధారపడిన వారు ఎంతమంది? కుటుంబపరంగాగానీ, ఇతరత్రా గానీ.
5. మీకున్న వేరే ఉపాధి అవకాశాలేమిటి?

**భవిష్యత్తు అవకాశాలు (పార్టీ బృంద నాయకుడు మరియు పార్టీ కార్యకర్తను)**

1. మీ భవిష్యత్తు లక్ష్యాలు, ఆకాంక్షలు ఏమిటి?
2. పార్టీ విధేయత మీకేమన్నా ఉపయోగపడుతోందా?
3. పార్టీలోని అగ్రనేతలతో మీకు సంబంధాలు ఎలా ఉన్నాయి?
4. మీకంటూ సొంత బలగాన్ని ఎలా తయారుచేసుకోగలుగుతున్నారు?
5. రాజకీయ పార్టీలో లేదా రాజకీయాల్లో మీరు సొంతంగా పెట్టిన పెట్టుబడులేమైనా ఉన్నాయా? పార్టీ అభివృద్ధికి ఏ మేరకు పెట్టుబడి వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నారు?
6. పార్టీలో, ఇతరత్రా జరిగే రాజకీయ పరిణామాలన్నీ మీకు తెలుసని భావిస్తున్నారా?
7. పార్టీ కార్యకర్తల్లో పదవులు, అవకాశాలు, పదోన్నతులకు మీరు ఎవరి మీద ఆధారపడతారు?

(గత సంచిక తరువాయి)

# ఇతర రాష్ట్రాల్లోనూ లోక్‌సత్తా ఉద్యమ కార్యక్రమాలు

## (లోక్‌సత్తా రాజకీయ ఉద్యమ సంస్థ 23 సంవత్సరాల ప్రస్థానం)

- బండారు రామ్మోహనరావు, 98660 74027

ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఢిల్లీ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకల్లో కూడా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వేళ్లూనుకోవటమే కాకుండా పలు ఉద్యమాలను చేసింది. ఢిల్లీ నగరంలో ఇప్పటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 'పరివర్తన' సంస్థ ద్వారా నిర్వహించిన 'హమారా పైసా, హమారా హిసాబ్' ఉద్యమంలో కూడా లోక్‌సత్తా పాల్గొంది. అలాగే సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారేతో కలిసి పలు కార్యక్రమాల్లో పనిచేసింది. అవినీతి నిరోధక కమిషన్ పేరుతోనో, లోక్‌పాల్ పేరుతోనో జాతీయ స్థాయిలో అవినీతి నిరోధక వ్యవస్థ ఏర్పాటుకు 1997 నుంచి ప్రయత్నిస్తున్న లోక్‌సత్తా కర్ణాటకలో చేసిన 'సాకు' ఉద్యమం, విదేశాల్లోని పీపుల్ ఫర్ లోక్‌సత్తా 'దండి పాదయాత్ర' కార్యక్రమాల నుంచి రూపుదిద్దుకున్న ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ ఉద్యమం నుంచే అన్నా బృందం నేతృత్వంలో లోక్‌పాల్ ఆందోళన రూపుదిద్దుకుంది.

లోక్‌సత్తా ప్రధాన నినాదం 'సమస్యలపై పరిజ్ఞానంతో కూడిన పోరాటం'! 'పరిజ్ఞానం - సంఘటితం - ఉద్యమం". విషయ పరిజ్ఞానంతో సంఘటితంగా ఉద్యమించాలని లోక్‌సత్తా మొదటి నుంచీ ప్రజలను కోరుతోంది. అందుకు అనుగుణంగా వివిధాంశాలపై అవగాహనను పెంచేందుకు శిక్షణా కార్యక్రమాల్ని ఏర్పాటు చేసింది. లోక్‌సత్తా ఉద్యమ సంస్థకు మొదటి నుంచి వెన్నుదన్నుగా నిలిచిన మాతృసంస్థ ఎఫ్.డి.ఆర్ (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ - ప్రజాస్వామ్య పీఠం) ద్వారా లోక్‌సత్తా కార్యకర్తలకే కాకుండా సమాజ సేవలకు కూడా శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. హైదరాబాద్ కొత్తపేటలో ఏర్పాటు చేసిన "ప్రజాస్వామ్య శిక్షణా కేంద్రం" ద్వారా వరుసగా ఐదు సంవత్సరాల పాటు శిక్షణను నిర్వహించింది. సామాజిక రాజకీయ ఆర్థిక అంశాలపై నిష్ణాతులైన వారు బోధించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఎలా అప్‌డేట్ చేసుకోవాలి, కొత్తగా సమాచారాన్ని తెలుసుకోవటానికి విశ్లేషణలో గీటురాళ్లు ఏమిటి వంటివి వివరించారు. వసతి, భోజన సదుపాయాలు కల్పించి మూడు రోజులకు తగ్గకుండా ప్రతి బ్యాచ్‌కీ శిక్షణ నిర్వహించారు. విషయ పరిజ్ఞానం కోసం లోక్‌సత్తా ఎన్నో పుస్తకాలను ప్రచురించింది. 'జనబలం' మాసపత్రికతోపాటు 'లోక్‌సత్తా టైమ్స్' అనే పక్షపత్రికను తీసుకొచ్చింది. లోక్‌సత్తా సాహిత్యం తెలుగు, ఇంగ్లీషులో కొన్ని వేల పేజీలుంటుంది. ఇవి కాక జేపీ ప్రసంగాలు, వివిధ కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు, ట్వీట్లు వంటివి కలిపితే డేటా అనంతంలా తయారవుతుంది.







రాజకీయ పార్టీగా లోక్‌సత్తా

రాజకీయ నాయకుల గురించి మాట్లాడటం ఒడ్డున కూర్చుని రాళ్లేసి నట్లు తేలికే, రాజకీయాల్లోకి దిగితే తెలుస్తుంది అని కొందరు విమర్శించారు. ఆ విమర్శలకు సమాధానమిస్తూ లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. 'రాజకీయం అత్యంత పవిత్రమైన వ్యాసంగం, రాజకీయ పార్టీ అతి పెద్ద స్వచ్ఛంద సంస్థ' అని లోక్‌సత్తా బహిరంగంగా ప్రకటించింది. అందుకు అనుగుణంగానే ఓ పక్క ఉద్యమంగా లోక్‌సత్తా కొనసాగుతుండగానే, మరోపక్క అందులోని కొందరు పెద్దలతో కలసి లోక్‌సత్తా పార్టీని స్థాపించాము. దాదాపు పదేళ్ల లోక్‌సత్తా ఉద్యమం తర్వాత 2006లో అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. రాష్ట్ర, జాతీయ పార్టీగా ఎన్నికల కమిషన్ ద్వారా నమోదు చేయబడినది. 2006 నుంచి స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు, 2009, 2014లో రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసింది. డబ్బు, మద్యం పంచకుండా, ప్రలోభాలు, భావోద్రేకాలు లేకుండా, బహిరంగ చర్చ ప్రమాణాలను పాటిస్తూ కేవలం రూ.5 లక్షల ఖర్చుతో 2009లో జయప్రకాష్ నారాయణ్ కూకట్‌పల్లి నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. చట్టసభల చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే ముద్ర వేశారు. పార్టీకి అన్ని చోట్లా 10% ఓట్లు నిలకడగా పడకపోవటం, డబ్బు రాజకీయాలను తట్టుకుని నిలబడలేక నిజాయతీ సంపాదనాపరులు చితికిపోతుం డటంతో 2014 తర్వాత లోక్‌సత్తా పార్టీ ఎన్నికల రాజకీయాలకు తాత్కాలిక విరామం ప్రకటించింది. కానీ ప్రజా ఉద్యమాలలో ఇప్పటికీ ముందే ఉంది. విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చట్టబద్ధపాలన, అవినీతి అంతానికి చట్టాలు, ఎన్నికల సంస్కరణలపై లోక్‌సత్తా చేస్తున్నంత లోతైన రాజకీయ కృషి జాతీయ స్థాయిలో ప్రధాన పార్టీలు కూడా చేయటం లేదు. ఉద్యమ సంస్థగా, పార్టీగా ఏ రూపంలోనైనా ప్రజాస్వామ్య సంస్కరణలను సాధించటం లోక్‌సత్తా లక్ష్యం.

**జన రాజకీయ యాత్ర, సురాజ్య ఉద్యమం, సురాజ్య జన చైతన్య యాత్ర**

గత ఇరవై మూడు సంవత్సరాలుగా ఇలా రకరకాల పేర్లతో






లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లో తిరిగారు. ప్రజలను చైతన్యవంతం చేయటానికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించాము. మనకి 1947లో స్వరాజ్యం వచ్చిందిగానీ సురాజ్యం రాలేదంటూ సురాజ్యానికి కావలసిన ఎజెండాపై పార్టీల మధ్య ఏకాభిప్రాయ సాధనకు హైదరాబాద్‌లో మూడు రోజుల సురాజ్య దీక్ష కూడా జేపీ నిర్వహించారు. బ్లాక్‌మెయిల్ కోసం కాకుండా కొన్ని లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కలిగించటంలో భాగంగా నిరాహార దీక్షను సాధనంగా ఉపయోగించి చూపిన సందర్భమిది. పార్లమెంటులో ఒక్క సభ్యుడు కూడా లేకుండా కొన్ని కీలక రాజ్యాంగ సవరణలను, చట్టాలను, పలు విధానపరమైన మార్పులను లోక్‌సత్తా సాధించి చూపింది.



**ప్రకృతి శాపం కాదు.. పాలకుల పాపమే..**
**స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య**

మార్కెట్ దోపిడీని అరికట్టి రైతుకి లాభసాటి ధర లభించేలా సంస్కరణల కోసం "స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య" పేరిట లోక్‌సత్తా నిర్మాణాత్మక కృషి చేసింది. తనకు ఎక్కువ ధర లభిస్తున్నప్పుడు రైతు దేశంలోని ఏ ప్రాంతంలోనైనా పంటను తీసుకెళ్లి అమ్ముకోవచ్చు, చేతనైతే అరెస్టు చేయండి అంటూ వేలాది రైతులతో కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు బియ్యం మూటల్ని భుజాన పెట్టుకుని వెళ్లి జేపీ అమ్మారు. అప్పటిదాకా రైతులను పక్క జిల్లాలో కూడా పంటలు అమ్మకూడదని దబాయిస్తున్న ప్రభుత్వం కిమ్మనలేదు. దీంతో పంటల మార్కెటింగ్‌పై ఆంక్షలు తొలగి తెలుగునాట ఒక్క సీజన్‌లోనే ఒక్క బీపీటీ వెరైటీ ధాన్యం రైతులకే రూ.3,600 కోట్ల మేర లాభం చేకూరిందని అంచనా. ఈ ఒరవడిలోనే రైతులకు మార్కెట్ సంకెళ్లను తెంచుతూ 2020లో కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ చట్టాల్ని, సవరణల్ని తీసుకొచ్చింది. అలాగే లోక్‌సత్తా కృషి వల్లే ఆహారధాన్యాల ఎగుమతులపై ఆంక్షల్ని 2011లో కేంద్రప్రభుత్వం తొలగించింది. బియ్యం ఎగుమతుల్లో భారతదేశం కొద్దికాలంలోనే నెంబర్‌వన్ అయింది. ఒడిదుడుకులున్నా ఇప్పటికీ ఆహారధాన్యాల ఎగుమతులు ఆగకుండా కొనసాగుతున్నాయి.


**రాజకీయాల్లో ధన ప్రభావంపై**
**జాతీయ సదస్సు - హైదరాబాద్ డిక్లరేషన్**

రాజకీయాల్లో డబ్బు ప్రభావంపై అనేక సదస్సుల్ని, కార్యక్రమాల్ని లోక్‌సత్తా గత కొన్నేళ్లలో నిర్వహించింది. స్వయంగా ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా పోటీ చేసింది. 2020 జనవరిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) పేరుతో జాతీయ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించింది. "మనీ పవర్ ఇన్ పాలిటిక్స్" థీమ్‌తో జరిగిన ఈ సదస్సులో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతోపాటు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలు, మేధావులు, విదేశాల నుంచి వచ్చిన అధ్యయనకారులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు. సొంత డబ్బుతో రిజిస్ట్రేషన్ చేసుకుని మరీ యువత వచ్చారు. భారత ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తోంది, లోపాలకు పరిష్కారాలేమిటి? అనే ప్రయత్నంలో భాగంగా లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ నిర్వహించిన మొదటి జాతీయ సదస్సు ఇది. ధన రాజకీయాల ప్రభావాన్ని తగ్గించటానికి 'హైదరాబాద్ డిక్లరేషన్' పేరుతో సమగ్ర పరిష్కారాల్ని ఇందులో వెలువరించారు. ఐడీఏడబ్ల్యూ ద్వితీయ సదస్సును వర్చువల్‌గా 'చట్టబద్ధపాలన'పై 2021 ఫిబ్రవరిలో నిర్వహిస్తున్నారు.

దేశ రాజకీయానికి కొత్త ఒరవడి దిద్దిన లోక్‌సత్తా తన నూతన రాజకీయ సంస్కృతితో ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు నిరంతరం పనిచేస్తూనే ఉంది. సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ ఖర్చుతో ఎక్కువమందిని చేరుకునే ప్రయత్నం చేస్తోంది. లోక్‌సత్తా సాధించిన విజయాలు ఒక సంస్థ విజయాలు కావు.. అవి ప్రజావిజయాలు. అందుకే వాటిని ప్రజలకే అంకితం చేస్తున్నాం. ఈ విజయాలకు గణింపు లేదు. ఈ ప్రయాణం ఆగదు. దీనికి అంతం లేదు. సమాజం ఉన్నంతకాలం సమస్యలు ఉంటాయి. వాటికి పరిష్కారాలు ఉంటాయి. ఆయా సమాజాల పరిణతిని బట్టి పౌరులు స్వీకరించిన పరిణతిని బట్టి ఫలితాలుంటాయి. ప్రజలకు అర్థం కాకపోతే వారిని విమర్శించి లాభం లేదు. వారికి ఇంకా బాగా అర్థమయ్యేలా, వారిని ఒప్పించేలా మళ్లీ మళ్లీ చెప్పటమే మన పని. అందుకే ప్రజాస్వామ్య సంస్కరణలు నిరంతర ప్రక్రియ. ఈ నిరంతర ప్రక్రియలో పాల్గొన్న ఎంతోమంది మిత్రులకు అభినందనలు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో పనిచేస్తున్న మనమందరం అలుపెరగని బాటసారుల్లా మరింత స్ఫూర్తితో ముందుకు పోవటానికి మార్గాలను సుగమం చేసుకోవాలని ఆశిస్తున్నాను. మనం చరిత్రకు సరైన వైపున ఉన్నాం. అభినందనలు.

# రజినీ సార్! రూటు మార్చి రాజకీయం చేయండి

“ఎంతోకొంత ప్రతి కవీ పొలిటికల్ కవే. కానీ రాజకీయాన్ని కవిత్వం చేయటం- రాజకీయ వెలుగులో వచ్చిన పరిణామాలను మార్పులను ఘటనలను కవిత్వం చేయటం మామూలు విషయం కాదు” అన్నారు ప్రముఖ కవి కె. శివారెడ్డి ఇటీవల ఒక వ్యాసంలో! పూర్వాభిప్రాయాన్ని మార్చుకున్నాక రాజకీయాలపై ఏర్పరుచుకున్న అభిప్రాయమిది అని కూడా చెప్పారు. రాజకీయం పవిత్ర వ్యాసంగమే కానీ.. సమాజహితకర భావాల్లో ఏళ్ల తరబడి మునిగితేలిన వారికి కూడా ఒక పట్టాన అంతుచిక్కనిదనటంలో సందేహం లేదు. మన దేశంలో అయితే మరీ! పేరుకు ప్రజాస్వామ్యమే గానీ, ప్రజలకు ఏదో చేద్దామని రాజకీయాల్లోకి వస్తే మాత్రం చుక్కలు కనపడతాయి. ఇంత సంక్లిష్టం కాబట్టే, ఎంతో జనాకర్షణ ఉన్న సినీ హీరోలు కూడా మన దేశంలో రాజకీయాల్లోకి రావటానికి అంత సుముఖత చూపరు. లోక్‌సత్తా భావజాలం పట్ల ఎంతో అభిమానం కనబరుస్తూ మద్దతిస్తుండే భారతీయ సినిమా లెజెండ్ అక్కినేని నాగేశ్వరరావు కూడా లోక్‌సత్తా జేపీ రాజకీయ పార్టీని పెట్టి తప్పు చేశారని అభిప్రాయపడుతుండేవారు. 1980లలో ఎన్‌టీ రామారావు ప్రతిపాదించినప్పుడు కూడా ఏఎన్నార్ సున్నితంగా తోసిపుచ్చారు. ఎన్‌టీఆర్ రాజకీయాల్లో సంచలన విజయాలు సాధించిన తర్వాత సైతం అక్కినేని అభిప్రాయం మారలేదు. ఎన్టీఆర్ మరణించిన చాలా ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లోని ఓ కాలనీలో జరిగిన కార్యక్రమంలో కూడా లోక్‌సత్తా నేత ఒకరు జేపీ ప్రస్తావన తేగా, 'జయప్రకాష్ నారాయణ్ మేధావి, ప్రజల కోసం చాలా కష్టపడుతున్నారు.. కానీ పార్టీ పెట్టకుండా ఉండాల్సింది' అన్నారట అక్కినేని. ఇటీవలి కాలంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ రాజకీయ పార్టీ పెడతానని ఊరించి, ఆ తర్వాత బీపీ సమస్య రావటంతో దాన్ని దేవుడి తొలి హెచ్చరికగా అభివర్ణించి విరమించుకున్న పరిణామాన్ని కూడా మనం కొంత సానుకూలతతోనే అర్థం చేసుకోవాలి. పాతికేళ్లుగా ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తూ, చివరికి వయసు పైబడ్డాక, వ్యాధులు పెరిగాక పార్టీ పెట్టాలనుకోవటం విమర్శనీయమేగానీ.. ఆయన ప్రయత్నాన్ని మాత్రం స్వాగతించాల్సిందే. ఫలానా తేదీన పార్టీ ప్రకటన చేస్తానని చెప్పినప్పుడు ప్రాణాలకైనా తెగించి పోరాడతానన్న రజినీకాంత్.. రక్తపోటు సమస్య తలెత్తగానే అస్త్రసన్యాసం చేశారు. మన రాజకీయాల్లోని తీవ్రమైన సవాళ్లకు ఒత్తిడి ఎక్కువవటంతోపాటు ఒళ్లు కూడా హూనమవుతుందనటంలో సందేహం లేదు. కానీ ప్రజలకు సేవ చేయాలనుకుంటే రాజకీయాల్ని మించిన మార్గం లేదు. మిగిలిన రంగాల్లోని వారి కంటే రాజకీయాల్లో ఉన్నవారు ప్రజల జీవితాల్ని అనేకరెట్లు మెరుగుపరిచే అవకాశాన్ని కలిగివుంటారు. ఎన్నికల్లో పోటీ చేసి వెంటనే అధికారంలోకి వచ్చేయాలన్న ధోరణి లేకుంటే.. జనహితం కోరేవారికి రాజకీయాలు అత్యున్నత అవకాశం! తమిళనాటే కాకుండా, భారతదేశవ్యాప్తంగా, విదేశాల్లోనూ విశేష జనాదరణ ఉన్న హీరో రజినీకాంత్. బహుశా ఇండియాలో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న నటుడు ఆయనే కావచ్చు. బాలీవుడ్‌లో అత్యధిక సంపాదనాపరుల జాబితాలో ఉన్న అక్షయ్ కుమార్ కూడా రజినీకాంత్‌తో కలిసి పనిచేస్తే చాలనుకున్నారు. అంత జనాకర్షణ ఉండి కూడా ఎన్నికల్లో పోటీని తట్టుకోలేక రజినీకాంత్ వెనక్కు తగ్గారు. గెలవటానికి తగ్గ శ్రమను తాను చేయలేనని ఆందోళన చెందారు. అధికారంలోకొచ్చేంత స్థాయి గెలుపు లేకపోతే అభిమానుల్లోనూ నిరాశ వచ్చి స్తబ్దత ఆవరిస్తుందనుకున్నారు. అయితే ఎన్నికలు-అధికారం కోణంలో మాత్రమే కాకుండా.. రాజకీయాల్ని ఆయన సమగ్రంగా చూసి ఉండాల్సింది అనుకోవటం మితిమీరిన స్పందన కాదేమో! ఎలాగైనా ప్రజల జీవితాల్ని మెరుగుపరచాలని రజినీకాంత్ అనుకుంటే, అందుకు తగ్గ విధానాలు ఆయన వద్ద ఉండి ఉంటే ఎన్నికల్లో గెలుపు మరీ పెద్ద సమస్య కాకుండా ఉండేది. ఎన్నికల్లో ఎన్ని సీట్లు వస్తాయి అన్న ఆలోచన లేకుండా.. జనం జీవితాల్లో మార్పు కోసం తనకున్న జనాకర్షణను ఎలా ఉపయోగించాలి అని మాత్రమే ఆలోచించేవారు. ఎన్నికల్లో తన పార్టీ గెలిచినా తాను ముఖ్యమంత్రిని పదవిని తీసుకోను అని కూడా ఒకసారి ఆయనే ప్రకటించారు. ఆధ్యాత్మిక రాజకీయం వంటి అంశాలను తన ఎజెండాగా చెప్పినా, వాటి అర్థమేంటో ఇప్పటికీ ఆయన వివరించలేదు. మార్పు తేవటానికి ఎన్నికలు దగ్గర దారి అనటంలో సందేహం లేదు. కానీ ఎన్నికలు మాత్రమే రాజకీయం కాదు. ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశం కల్పించే మౌలిక మార్పును సాధించే ఎజెండాయే మన వద్ద ఉంటే, ఎన్నికలకు ఆవల కూడా బోలెడంత జనరాజకీయ క్షేత్రం ఉంది. అక్కడ కృషిని ప్రారంభించి ఫలితాల్ని సాధించవచ్చు. ఎన్నికల్ని ప్రభావితం చేయవచ్చు.. సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికయ్యేలా ఎన్నికల వ్యవస్థనూ మార్చవచ్చు. రాజకీయం గురించి ప్రారంభంలో కవి శివారెడ్డి చెప్పిన వాక్యాలు కూడా పార్టీ రాజకీయాల గురించి కాదు. పార్టీలు, ఎన్నికల్లో పోటీ, ఓటమి, గెలుపు అనే సాంకేతిక అంశాల గురించిన సందర్భంలో ఆయన ఆ మాటలు రాయలేదు. వాటన్నింటితో పాటు సమాజంలో జరిగే బహుముఖ ప్రయత్నాల సమాహారాన్ని, వాటి పర్యవసానంగా చోటుచేసుకునే పరిణామాలనే రాజకీయంగా కవి అంచనా వేశారు. అక్కినేని లాగానే వ్యక్తిగతంగా ఎంతోమందికి ఉదారంగా ఆర్థికంగా, ఇతరత్రా సాయం అందించిన, గుప్తదానాలు సైతం చేసిన సహృదయుడు రజినీకాంత్. ఇప్పటికైనా ఆయన సమగ్రంగా ఆలోచించి సరైన ఎజెండాతో పార్టీపరంగా లేదా పార్టీరహితంగా ప్రజాజీవితంలోకి ప్రవేశిస్తే అనేక రెట్లు ఎక్కువ మందికి, ఎక్కువ మేర సాయం అందించగలుగుతారు. ఈవేళ తమిళనాడు, తెలుగు రాష్ట్రాలు, భారతదేశానికి కావలసింది ప్రధానంగా చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య, మంచి ప్రమాణాల ఆరోగ్యం, బలమైన స్థానిక ప్రభుత్వాలు, అవినీతిరహిత ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయాన్ని లాభసాటి చేస్తూ గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించటం, సమర్థులు, నిజాయతీపరులు ఎన్నిక కాగలిగే ఎన్నికల వ్యవస్థ. వీటి కోసం విశాల ప్రజాస్వామిక దృక్పథంతో ముందుకొస్తే, రజినీకాంత్‌తో కలిసి పనిచేయటానికి పలువురు ఇతర సినీ ప్రముఖులు, వివిధ రంగాల్లోని సుప్రసిద్ధులు కూడా ముందుకొస్తారు. సమాజం, రాజకీయాల పట్ల విముఖత పెంచుకుంటున్న యువతరం కూడా పెద్ద సంఖ్యలో సామాజిక రాజకీయానికి ఉత్సాహం చూపుతారు. బహిరంగ చర్చ ప్రమాణాలు పెరుగుతాయి. తమ జీవితాల్ని బాగు చేసుకోవటానికి కావలసిన విధానాలు, విధులపై ప్రజల్లో చైతన్యం పెరుగుతుంది. పౌరసత్వం వికసిస్తుంది. క్రమంగానైనా ఎన్నికల రాజకీయాలు కూడా సామాన్యులకు అందుబాటులోకి వస్తాయి. విషవలయంలో కూరుకుపోయిన ఇతర పార్టీలు సైతం మార్పుకి ధైర్యాన్ని ప్రదర్శిస్తాయి. భారతదేశం తన సామర్థ్యాల్ని పూర్తిస్థాయిలో వికసింప చేసుకోవటానికి ఎంతో అవసరమైన మౌలిక మార్పులు వేగవంతమవుతాయి. ✦



# రాముడి పాఠం, సామాన్యుడి మనోభీష్టం 'చట్టబద్ధపాలనే'

## - భీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షులు



కాలం మారుతుంటుంది. మంచి గానూ, చెడ్డ గానూ. కానీ మౌలిక విషయాల్లో కూడా పరిస్థితి దిగజారిపోతుంటే, దాన్ని కాలమహిమ అని మౌనప్రేక్షకుల్లా వ్యవహరించటం ఆత్మవంచనే అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు జరుగుతున్న రాజకీయ పరిణామాల్ని చూస్తుంటే.. రాజకీయాలు ఇంత నీచంగా ఉంటాయా, పార్టీలు ఇంతలా దిగజారుతాయా అని పలువురు ప్రజానీకం కూడా సిగ్గుపడుతున్నారు. ఏపీ రాజకీయాల దెబ్బకి కొవిడ్ మహమ్మారి కూడా దంగైపోయింది. రాష్ట్రంలో రాజకీయ గెరిల్లా దాడులు చేస్తున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపిస్తుంటే, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు తన నలభై ఏళ్ల రాజకీయ జీవితాన్ని సైతం పణంగా పెట్టి మతం కార్డు ప్రయోగిస్తున్నారు. ముఖ్యమంత్రి, హోం మంత్రి, డీజీపీ క్రైస్తవ మత విశ్వాసులు అయినందున, హిందూ దేవాలయాలపై దాడుల కేసుల్లో న్యాయం జరుగుతుందన్న నమ్మకం తమకు లేదన్నారు.



విజయనగరం జిల్లాలోని రామతీర్థం గుడి పక్కనే బోడిమెట్టపై ఉన్న శ్రీరాముడి విగ్రహం శిరస్సును కొందరు ధ్వంసం చేశారు. దీనిపై రాజకీయ కిష్కింధకాండను సృష్టించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటీపడ్డాయి. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రామతీర్థంలో శ్రీరామనవమి చేయాలని ఇక్కడి ప్రజలు కోరినా స్పందించలేదు. రామతీర్థాన్ని కనీసం అభివృద్ధి కూడా చేయలేదు. భారతీయతను ప్రభావితం చేసిన ఎంతో విలువైన చారిత్రక సంపద ఉన్నా పరిరక్షించి, పర్యాటకుల్ని ఆకర్షించేలా తీర్చిదిద్దే ప్రయత్నం చేయలేదు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వైకాపా నాయకులు కూడా స్పందించలేదు. ఇప్పుడు మాత్రం రాజకీయం చేస్తున్నారు. తెలంగాణ బీజేపీ నేతయితే.. బైబిల్ పార్టీ కావాలా, భగవద్గీత పార్టీ కావాలా అని ఇంకా తీవ్ర విభజనాస్త్రాన్ని ప్రజల మధ్యకు వదిలారు. విజయనగరం జిల్లాలో అనేక సమస్యలున్నాయి. విద్య, ఆరోగ్య ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయి, ధాన్యం కొనుగోలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు, చెరకు రైతులకు బకాయిలు అందలేదు, జ్యూట్ మిల్లు తెరవక కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి, అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి, గిరిజనులకు అవకాశాలు ఇంకా మాటల్లోనే ఉన్నాయి, ఉపాధి లేక యువతలో నిరాశ పెరుగుతోంది.. వీటిని ఏమాత్రం పట్టించుకోని నేతలు రామతీర్థం ఘటనపై మాత్రం రాద్ధాంతం చేస్తున్నారు.

రామతీర్థం ఘటనపై ఇక్కడి ప్రజలు ఎంతో ఆవేదన చెందారు. అయినా.. ఆ ఘటన జరిగిన మరుసటి రోజున ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, జిల్లా ఇంఛార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ జిల్లాలో ఉండి కూడా స్పందించలేదు. ఉత్తరాంధ్రలో ముగ్గురు మంత్రులు, ఒక ఉప ముఖ్యమంత్రి ఉన్నా రామతీర్థం ఘటన జరిగిన వెంటనే పట్టించు కోలేదు. ఆ తర్వాత చంద్రబాబు, విజయసాయిరెడ్డి హడావుడిగా వచ్చి రాద్ధాంతం చేశారు. ప్రజల వేదనను, నిరసనను రెచ్చగొట్టి లబ్ధి పొందే ప్రయత్నం చేశారు. అయ్యా! ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నది.. దోషులను కఠినంగా శిక్షించి మరోసారి ఇలాంటివి జరగకుండా చేయాలని తప్ప, మీరొచ్చి రాజకీయం చేయమని కాదు! దోషులను శిక్షించటమంటే ఎవరోకర్ని పట్టుకుని నేరం చేసినట్లు బలవంతంగా ఒప్పించటం, వాళ్ల మీద ఏదోక రాజకీయ ముద్రవేయటం వంటివి చేయటం కాకుండా.. పోలీసులు నిష్పాక్షికంగా, వేగంగా నిజాల్ని నిగ్గుతేల్చి సాక్ష్యాల్ని కోర్టులకు సమర్పించటం. కానీ ఈ పని చేయటానికి కావలసిన పరిష్కారాల్ని మాత్రం రాజకీయ పార్టీలు డిమాండ్ చేయటం లేదు.

రాష్ట్రంలో అందరికీ తెలుసు అధికార పార్టీ గుప్పిట్లో పోలీసు యంత్రాంగం ఉక్కిరిబిక్కిరవుతోందని! అధికార పార్టీతో సంబంధం లేకుండా నేర పరిశోధన చేసే అవకాశం పోలీసు యంత్రాంగానికి లేనంత వరకూ పోలీసు వ్యవస్థ సమర్థంగా వ్యవహరించలేదు. కానీ ఈ వైఫల్యాన్ని తెలుగుదేశం పార్టీ కూడా లేవనెత్తటం లేదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పోలీసులను తమ దోపిడీకి, ప్రత్యర్థులను వేధించటానికి ఉపయోగించుకోవటమే రాజకీయంగా మారింది. నేర దర్యాప్తులో పోలీసు వ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించటానికి గతంలోని తెలుగుదేశం ప్రభుత్వం కూడా ప్రయత్నం చేయలేదు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు.. నీకూ పోలీసులున్నారు, నాకూ పోలీసులున్నారు అంటూ ఓటుకు కోట్లు కేసులో తెలంగాణ ముఖ్యమంత్రిని

ఉద్దేశించి బహిరంగంగానే సవాలు చేశారు. పోలీసు వ్యవస్థ సొంత జాగీరన్నట్లు వ్యవహరించారు. ఇప్పుడు ఆ రాజకీయాన్నే వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇంకా నాటుగా అమలు చేస్తున్నారు.

రామతీర్థంలో కావచ్చు, ఇతర దేవాలయాల్లో కావచ్చు.. పోలీసు వ్యవస్థ సక్రమంగా పనిచేస్తే 24 గంటల్లో పరిస్థితిని అదుపులోకి తేవచ్చు. చట్టబద్ధపాలన ఉంటే రాములోరు, ఇతర దేవతా మూర్తుల విగ్రహాలకే కాదు సామాన్య ప్రజలకు కూడా న్యాయం జరుగుతుంది. చట్టబద్ధపాలన ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు. నిజంగా ప్రజల ఆవేదనకు స్పందించాలనుకుంటే.. చట్టబద్ధపాలన కోసం పోలీసు వ్యవస్థలో సంస్కరణలు, కోర్టుల్లో ఆలస్యం జరగకుండా న్యాయ సంస్కరణల కోసం రాజకీయ పార్టీలు డిమాండ్ చేయాలి. ఆ ప్రయత్నం లేకుండా పోలీసులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరిస్తున్నారు అని మాత్రమే గావుకేకలు పెట్టటం ఎవరిని మోసం చేయటానికి? ముఖ్యమంత్రి గారూ! వైకాపా పాలనలో చట్టబద్ధపాలన గతం కంటే కూడా దిగజారింది. దళితులు, ఇతర అణగారిన వర్గాలు, మహిళల మీద దాడులు పెరిగాయి (పంచాయతీ ఎన్నికల ఉదంతాల్ని ప్రస్తావించటం లేదు). దీంతో, అసలే అంతంత మాత్రంగా ఉన్న ప్రజాస్వామ్యం పెడదోవ పడుతోంది. పోలీసు యంత్రాంగంలో కొంతభాగానికి జవాబు దారీతనంతో స్వతంత్ర ప్రతిపత్తి కల్పించి నేర దర్యాప్తులో రాజకీయ జోక్యం లేకుండా చేయండి చాలు.. మీరు నామాలు, పట్టు తలపాగాలు ధరించాల్సిన అవసరం లేకుండానే ప్రజలు మిమ్మల్ని మతాలకతీతంగా దేవుడిగా కళ్లకద్దుకుంటారు. యావత్ భారతదేశానికి కూడా ఆంధ్రప్రదేశ్ ఒక మార్గం చూపించగలుగుతుంది. పటిష్ట చట్టబద్ధపాలనకు కావాల్సిన పోలీసు, న్యాయ సంస్కరణల కోసం సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్న రాజకీయ ఉద్యమంగా.. ప్రభుత్వం కోరితే తోడ్పాటును అందించటానికి పార్టీలకతీతంగా లోక్‌సత్తా సిద్ధంగా ఉంది.

## నరేంద్ర లూథర్ మృతి పెద్ద లోటు



నరేంద్ర లూథర్ మృతి ముఖ్యంగా హైదరాబాద్‌కు పెద్ద లోటని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఒక సివిల్ సర్వెంట్‌గా ఆయన నిజాయతీ, హుందాతనం, నిరాడంబరతలకు నిదర్శనమన్నారు. ఒక పౌరుడిగా సామరస్యత, సాంస్కృతిక పారంపర్యత, హాస్య చతురత, మానవతావాదాలకు సంకేతమన్నారు. లాహోర్ నుంచి హైదరాబాద్ వయా హోషియార్‌పూర్.. ఆయన జీవితం ఓ అద్భుతమన్నారు. నరేంద్ర లూథర్ మృతి మనందరికీ వెలితి అని జేపీ ప్రగాఢ సంతాపం తెలిపారు.

### ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు సహకరించాలి

ఏపీ ప్రభుత్వం అనవసర రాద్ధాంతం చేయకుండా పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలక్షన్ కమిషన్‌కు పూర్తిస్థాయిలో సహకారమందించాలని భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరి విధిని వారు నిర్వహించాలన్నారు. ప్రజాస్వామ్యంపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా ఎన్నికలను నిర్వహించాలన్నారు.



## కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సమస్యల్ని పరిష్కరించండి


లోక్‌సత్తా పార్టీ నాయకులు చిలకలూరిపేట పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ని సందర్శించి రోగులతో మాట్లాడి వైద్యం, వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ మాట్లాడుతూ.. డాక్టర్లు ఆరుగురు ఉండాల్సి ఉంటే ముగ్గురే ఉన్నారని, ఏఎంఎలు ముగ్గురు ఉండవలసి ఉండగా ఒక్కరే ఉన్నారని, స్టాఫ్ నర్సులు ఐదుగురుకి ఇద్దరే ఉన్నారని, ఎన్‌బీఎస్‌యూ స్టాఫ్ నర్సులు ఒక్కరు కూడా లేరని అన్నారు. అంబులెన్స్ సదుపాయం లేదన్నారు. పాత ప్రభుత్వాస్పత్రి స్థలం చాలా ఏళ్లుగా ఖాళీ ఉందని, అందులో అత్యవసర సేవల కోసం ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేసినట్లయితే ఎన్నో ప్రాణాల్ని కాపాడవచ్చన్నారు. పట్టణం జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్నందువల్ల ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే, చికిత్సకు కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలే కాకుండా యుద్దనపూడి, మార్టూరు, నందిపాడు, పర్చూరు మండల ప్రజలు వైద్యసేవల కోసం పేటకు వస్తుంటారన్నారు. అధికారులు సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించి మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందుబాటు లోకి తేవాలన్నారు. ఆ తర్వాత ఈ వివరాలతో జిల్లా కేంద్రమైన గుంటూరులో జిల్లా కలెక్టర్, జేసీ, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ అధికారులకు విజ్ఞాపన పత్రం అందచేశారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ లోక్‌సత్తా కార్యదర్శి మురికిపూడి ప్రసాద్, కృష్ణప్రసాద్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**హెల్మెట్ ర్యాలీలో..:** రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పేటలో జరిగిన హెల్మెట్ ర్యాలీలో ముఖ్య అతిథిగా భానుప్రసాద్ పాల్గొన్నారు. హెల్మెట్ ధరించటం, మితిమీరిన వేగాన్ని నియంత్రించటం, తాగి డ్రైవింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తదితర ప్రమాద నివారణ చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా ర్యాలీలో బైకు రైడర్లు, వివిధ స్టాండ్‌ల ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

# 'ఒకే ఎన్నిక' విఫల ప్రయోగం కాకూడదంటే..



- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



ఎన్నో ఏళ్లుగా చర్చాంశంగా ఉన్న 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' ప్రతిపాదన కార్యరూపం దాల్చనుందనే వార్తలు ఇటీవల ఊపందుకున్నాయి. జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో ఒకేసారి ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధమని ఎన్నికల సంఘం ప్రకటించగా, పలు రాజకీయ పార్టీలు కూడా ఆ దిశగా వ్యూహాలు రచించుకుంటున్నాయి. జమిలి ఎన్నికల ప్రతిపాదన, అందుకు రాజకీయ సానుకూలత కొత్త కాదు గానీ.. ఆ ప్రతిపాదనపై కొంత నింపాదిగా, ఇంకా లోతుగా, దూరదృష్టితో ఆలోచన అవసరం. ప్రజాస్వామ్యానికి పీఠంలాంటి అమెరికాలో జరిగిన పరిణామాల్ని చూశాకయినా.. ఇప్పుడిప్పుడే పరిణతి చెందుతున్న ప్రజాస్వామ్య దేశంగా భారత్ జాగ్రత్తగా అడుగులు వేయాలి.

మన దేశంలో ఎన్నికలు పండుగల్లా, కోలాహలంగా జరుగుతాయి. అదే సమయంలో ఎన్నికలకు ముందూ, ఎన్నికలైన వెంటనే పాలనలో కొంత స్తబ్ధత లేదా మార్పులు చోటుచేసుకోవటం.. ఎన్నికల కోడ్ సమయంలో పాలన పూర్తిగా స్తంభించటం జరుగుతుంటుంది. అందువల్లే తరచూ ఎన్నికలు వస్తుంటే ప్రజలకు కొన్ని ఇబ్బందులుంటాయి. జమిలి ఎన్నికలు జరిగితే ఆ సమస్య తీరుతుంది. ఎన్నికలకు అధికారికంగా అయ్యే ఖర్చు కూడా ఆదా అవుతుంది. కానీ ఆ లాభాలతో పోలిస్తే, జమిలి వల్ల నష్టాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

మన దేశంలో ఎన్నికలు ఆర్భాటంగా జరుగుతాయి. కాని ప్రజలకి ఇప్పటికీ ఏ స్థాయిలో ఎవరేం చెయ్యాలో అర్థంకాని పరిస్థితి ఉంది. ఫెడరల్ వ్యవస్థలో యూనియన్‌కి, రాష్ట్రానికి వేర్వేరు బాధ్యతలుంటాయి. దేశ రక్షణ, కరెన్సీ, బ్యాంకుల నియంత్రణ, రైల్వేలు, ఇతర దేశాలతో సంబంధాలు, జాతీయ రహదారులు, ఓడరేవులు, అంతర్జాతీయ వాణిజ్యం, అంతరరాష్ట్ర జలవివాదాలు- ఇలాంటి అంశాలన్నీ యూనియన్ ప్రభుత్వం బాధ్యతలు. రోజువారి పరిపాలన, శాంతిభద్రతలు, ఆరోగ్యం, పాఠశాల విద్య, న్యాయస్థానాలు, జైళ్ళు, వ్యవసాయం, భూ పరిపాలన, జలవనరులు, విద్యుత్తు, రవాణా, మౌలిక సదుపాయాలు- ఇలా ప్రజలకి చేరువగా ఉండే పరిపాలన అంతా రాష్ట్రాల బాధ్యత. స్థానిక రోడ్లు, మంచినీరు, వరదనీటి పారుదల, మురుగునీటి పారుదల, పార్కులు, పారిశుద్ధ్యం ఇలా రోజువారి పరిపాలన స్థానిక ప్రభుత్వాల బాధ్యత. కాని మన వ్యవస్థలో ఈ బాధ్యతల విభజన ప్రజలకి ఏమాత్రం అర్థం కాలేదు. దాంతో ఎన్నికలలో మునిసిపాలిటీ నుంచి పార్లమెంటు దాకా ఒకేరీతిన అత్యధిక ఓటర్లు ఓటు వేస్తారు. ఏ స్థాయిలో ఎవరి బాధ్యతలేమిటో తెలియకుండా ఓటు వేస్తే, ఎన్నికల వల్ల నిజమయిన ఫలితాలు రావు. ప్రజాస్వామ్యం గందరగోళంలో పడుతుంది. అత్యధిక ఓటర్లు ఓట్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని చూసి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగానో, వ్యతిరేకంగానో అన్ని స్థాయిలలో ఒకే విధంగా ఓట్లు వేస్తున్నారు. అలాంటప్పుడు జమిలి ఎన్నికలు మరింత గందరగోళానికి దారితీసి ప్రజాస్వామ్యాన్ని మరింత బలహీన పరుస్తాయి. ఇటీవల జరిగిన అమెరికా ఎన్నికలలో చాలా రాష్ట్రాలలో రాష్ట్రపతి పదవికి ఒక పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తే, అదే బ్యాలెట్ పత్రంలో ఎన్నో ఇతర పదవులకి వేరే పార్టీకి ఓట్లు పడ్డాయి. ఇలా ఏ స్థాయిలో, ఏ పదవిలో ఎవరి బాధ్యత ఏమిటో ఓటర్లకి తెలవటం, ప్రతిస్థాయిలోను తులనాత్మకంగా పరిశీలించి అర్థవంతంగా ఓట్లు వేయటం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకం.

స్థానికం నుంచి జాతీయ స్థాయి వరకూ ఒకేసారి ఎన్నికలు జరిగితే మన దేశం ఉన్న పరిస్థితుల్లో ప్రజల వాస్తవ సమస్యలు పక్కదోవ పడతాయనటంలో సందేహం లేదు. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల్ని స్వల్ప వ్యవధిలో జరపటంతో అసలు రాజకీయ పార్టీల హామీల మీద చర్చే లేకుండా పోయింది. ఏ పార్టీ వారు ఏ హామీ ఇచ్చారో ఓటు వేసే ప్రజల్లోకి చేరలేదు. కాస్త మేనిఫెస్టోల్ని చదివి విషయాల్ని తెలుసుకోగలిగినవారు.. నిజమయిన అధికారాలు కార్పొరేషన్‌లో లేకపోవటంతో ఓటింగ్‌లోనే పాల్గొనలేదు. ప్రజల ఆకాంక్షలు డిమాండ్లుగా రూపుదిద్దుకోలేదు. జమిలి ఎన్నికలు జరిగితే వివిధ స్థాయిలలో ఎజెండాపై అంతంతమాత్రంగా ఉన్న చర్చ ఇంకా కుదించుకుపోతుంది, పక్కదోవ కూడా పడుతుంది. చదువుకున్నవారు కూడా పెద్దగా ఆలోచించి ఓటు వేయని దుస్థితి మరింత పెరుగుతుంది. నరేంద్ర మోదీని చూసో, కేసీఆర్, కేటీఆర్, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలను చూసో పార్లమెంటుకి, అసెంబ్లీకి, నగర ప్రభుత్వాలకి, పంచాయతీకి ఓటు వేస్తే ప్రజల రోజువారీ సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి? ఏ స్థాయిలో ఎవరికి, ఎందుకు ఓటు వేస్తున్నామో తెలియకుండా ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింత సంక్షోభంలో పడుతుంది.

మన రాజ్యాంగం మొగ్గ స్వతంత్ర వచ్చిన కాలంనాటి

పరిస్థితుల దృష్ట్యా కేంద్రీకృత పాలన వైపే ఉండుండవచ్చు. కానీ 'భారత ప్రజలమైన మేము..' అని మన రాజ్యాంగం మొదలవుతుందని మరువకూడదు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య అంతరం ఏమాత్రం లేకుండా పౌరుల చుట్టూ పాలన ఉండాలన్నది రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన అసలైన లక్ష్యం. తదనుగుణంగానే నాటి హింసాత్మక పరిస్థితులు సద్దుమణగటం మొదలుపెట్టాక, ఫెడరలిజం డిమాండ్ దేశంలో పెరుగుతూ వచ్చింది. మన తెలుగు నేలతోపాటు కాశ్మీర్ నుంచి తమిళనాడు వరకూ పలు రాష్ట్రాల నేతలు ఫెడరల్ ఇండియా బలోపేతానికి కృషి చేశారు. ఈ సమాఖ్యతత్వాన్ని విస్తరించి జాతీయ, రాష్ట్ర స్థాయి నుంచి స్థానిక స్థాయికి చేర్చాలని, స్థానిక సంస్థలను బలమైన స్థానిక ప్రభుత్వాలుగా మార్చాలని గత 30 ఏళ్లుగా జరుగుతున్న ప్రయత్నాలు ఇప్పటికీ ఆశించిన స్థాయిలో నెరవేరలేదు. ఇప్పుడు జమిలి ఎన్నికలు కార్యరూపం దాల్చి ఐదేళ్లకోసారి అన్ని ఎన్నికలూ జరిగితే ప్రజల సాధికారత అనే రాజ్యాంగ ప్రజాస్వామ్య లక్ష్యం ఇంకా నీరుగారుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించని దశాబ్దాల దుష్పరిపాలన వల్ల మన దేశంలో కోట్లాది మంది ప్రజలకి విలువ ఉండేది ఎన్నికల సమయంలో మాత్రమే. కనీసం ఓటు కోసమైనా రాజకీయ నాయకులు తమను పట్టించుకుంటారని, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెడతారని ఆశిస్తారు. ఒకేసారి ఎన్నికల పద్ధతి వస్తే.. ఎన్నికలు ఐదేళ్లకోసారి తప్ప జరగవంటే, ఇక ప్రజలు ప్రభుత్వాన్ని ఎలా ప్రభావితం చేయగలరు? విజ్ఞులు, మేధావులు, జనహితం కోరేవారు హేతుబద్ధంగా, న్యాయంగా, రాజ్యాంగబద్ధంగా చెప్పే మాటల్ని, చేసే డిమాండ్లని పట్టించుకునే రాజకీయ సంస్కృతి మనకు ఉంటే, పాలనలో ప్రజల భాగస్వామ్యానికి అవకాశముంటే.. ఎన్నికలు ఒకేసారి పెట్టినా ఎవరికీ పెద్ద ఆందోళన ఉండదు. కానీ అరిచి గీపెట్టినా, రోడ్లెక్కి ఆందోళనలు చేసినా పట్టించుకునే పరిస్థితులు కరువవుతున్నాయి, అణచివేతకు గురికావటం తప్ప ఉపయోగం లేదు అనే పరిస్థితులు నానాటికీ పెరుగుతుంటే జమిలి ఎన్నికల వల్ల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టవుతుంది.

అయినా కూడా జమిలి ఎన్నికల్ని పెట్టాలన్న సంకల్పాన్ని మనం గుడ్డిగా వ్యతిరేకించనవసరం లేదు. ఎన్నికల, పాలనా వ్యవస్థల్లో కొన్ని కీలక మార్పుల్ని చేస్తే.. స్వామికార్యం, స్వకార్యం కూడా నెరవేరి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. సరైన మార్పులతో జమిలి ఎన్నికల్ని అమలు చేస్తే మధ్యంతర ఎన్నికల ప్రమాదాన్ని కూడా నివారించవచ్చు.

జమిలి ఎన్నికలను అమల్లోకి తెచ్చే ముందు రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేత (ముఖ్యమంత్రి)ని నిర్ణీత పదవీకాలంతో ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేయాలి. అంటే ఎమ్మెల్యేల ద్వారా కాకుండా ముఖ్యమంత్రి నేరుగా ప్రజల ఓటుతోనే ఎన్నికవ్వాలి. ఆ పదవికి నిర్ణీత వ్యవధి ఉంటుంది కాబట్టి ప్రభుత్వం రద్దయి మధ్యంతర ఎన్నికల సమస్య తలెత్తదు. ముఖ్యమంత్రిగా పోటీ చేసేవారు మొత్తం రాష్ట్ర ప్రజలందరి ఓటునూ అడగాలి కాబట్టి.. అంత పెద్ద మొత్తంలో వేల కోట్లు వెచ్చించే అవకాశాలుండవు. ఒక పెద్ద రాష్ట్రంలో గంపగుత్తగా ఓట్లను కొనుగోలు చేయాలంటే.. రూ.3000 – 4000 కోట్ల అక్రమ సొమ్మును ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో విధానాలు, అభ్యర్థి సామర్థ్యం, వ్యక్తిత్వం, నిజాయతీ, గత చరిత్ర, విశ్వసనీవంటివి చర్చనీయాంశాలవుతాయి. డబ్బు ప్రభావంతో రాజకీయాలకు దూరమవుతున్న సమర్థులు అప్పుడు నాయకత్వం కోసం పోటీ పడే అవకాశాలు పెరుగుతాయి. ముఖ్యమంత్రిగా ఎన్నికైనవారు.. సమాజంలో వివిధ రంగాలలో నిష్ణాతులైనవారిని తన కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఉంటుంది.

మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వాధినేత ఎన్నికలో తమ పాత్ర ఉండదు కాబట్టి.. ఎమ్మెల్యేలుగా పోటీ చేసేవారు పోటాపోటీ కోట్లు ఖర్చు పెట్టి గెలవాల్సిన పరిస్థితి ఉండదు. సేవ చేయాలనుకునేవారు, మంచి చట్టాలు తేవాలనుకునేవారు ఎమ్మెల్యేలుగా చట్టసభల్లోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రి పాలనలో మితిమీరకుండా, సర్వాధికారిగా మారకుండా శాసనసభ ద్వారా నియంత్రించటంలో ఎమ్మెల్యేలు కీలకపాత్ర పోషిస్తారు. ఎప్పుడైతే ఎమ్మెల్యేలు తమ నిజమైన బాధ్యతకి, అంటే శాసనసభకి పరిమితమవుతారో.. అప్పుడు వారు స్థానిక ప్రభుత్వాలను తమ ఉనికికి ప్రమాదంగా భావించరు. స్థానిక ప్రభుత్వాలు కూడా ఊపిరి పీల్చుకుంటాయి. ఎక్స్‌అఫిషియో సభ్యుల జాడ్యం వీడి స్థానిక నిర్ణయాలు స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారానే జరుగుతాయి. ఈ రకంగా ఆటనియమాల్ని మార్చటం వల్ల జమిలి ఎన్నికల ప్రయోజనం నెరవేరటంతోపాటు రాజకీయం, పరిపాలన బాగుపడతాయి. ఎన్నికల్లో గెలుపుకి, ధన రాజకీయానికి మధ్య సంబంధం తగ్గుతుంది. స్థానిక ప్రభుత్వాలు బలపడి ఎన్నికల మధ్యకాలంలో కూడా నిర్ణయాలని ప్రజలు ప్రభావితం చేయగలిగే అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. దిగువ నుంచి యువ నాయకత్వం తయారై దేశానికి ఆశాకిరణాలు కాగలుగుతారు.

ప్రజలు స్థానిక, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వాలు చేయాల్సిన పనుల్ని, ఎన్నికలకు–తమ ఓటుకు మధ్య సంబంధాన్ని స్పష్టంగా అర్థం చేసుకుని ఓటు వేయటం, ఎన్నికలకు మధ్యకాలంలో ఆయా ప్రభుత్వాలలో భాగస్వాములవుతూ ఎప్పటికప్పుడు స్పందింపచేయగలిగే శక్తిని, అవకాశాల్ని కలిగిఉండటం ఎంతో ముఖ్యం. ఇందుకు ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక పెద్ద అడుగు అవుతుంది. తద్వారా జరిగే అధికార వికేంద్రీకరణకి ఎంత

ప్రాధాన్యముందో ఇటీవల కాశ్మీర్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి మండళ్ల (డీడీసీ) ఎన్నికలే రుజువు. ప్రజల రోజువారీ సమస్యలను పరిష్కరిస్తే ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం పెరగటానికి ఈ తరహా మార్పు దేశవ్యాప్తంగా తీసుకురావాలి. అలాగే ఈ ఏడాది నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంతి ఉత్సవాల్ని ఘనంగా జరుపుకుంటున్నాం. ఆయన ఎక్కడ్నుంచి ఎదిగారు?.. స్థానిక ప్రభుత్వం నుంచి. ఆయన జీవితమిచ్చే ప్రధాన సందేశమేంటి?.. స్థానిక సాధికారత!

కలకత్తా కార్పొరేషన్‌కి మేయర్‌గా ఉన్న చిత్తరంజన్ దాస్.. బ్రిటిష్ ప్రభుత్వం నియమించే సివిల్ సర్వీసు అధికారి వద్దని, పట్టుబట్టి యువ సుభాష్ చంద్రబోస్‌ని ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా నియమించారు. కొన్ని నెలల్లోనే బోస్ తన సామర్థ్యంతో బలమైన ముద్రను సాధించారు. విప్లవకారులకు మద్దతిచ్చారనే తప్పుడు ఆరోపణలతో 1924 అక్టోబర్‌లో బోస్‌ని అన్యాయంగా జైలులో నిర్బంధించారు. బోస్ కలకత్తాలోని అలీపూర్ జైలులో ఉన్నప్పటికీ, మళ్లీ దాస్ పట్టుపట్టడంతో కార్పొరేషన్ సీఈవోగా జైలు నుంచే పనిచేయటానికి బోస్‌కి బ్రిటీషు ప్రభుత్వం అనుమతించింది. ఫైళ్లు ఆయనకే పంపేవారు, అధికారులు, కార్పొరేటర్లు, మేయరు కలిసేవారు, నగరాన్ని నడిపించే ఉత్తర్వుల్ని బోసే ఇచ్చేవారు.. అన్నీ అలీపూర్ జైలు నుంచే! నేతాజీ సుభాష్ చంద్ర బోస్‌ని బర్మాలోని మాండలే జైలుకి తరలించేంత వరకూ ఈ రకంగానే కలకత్తా నగర పాలన సాగింది. ఆ తర్వాత బోస్ కలకత్తా మేయర్ అయ్యారు. సుభాష్ చంద్రబోస్ జైలు నుంచి విధులు నిర్వహించేంత విస్తృతాధికారాలను, స్వయంప్రతిపత్తిని బ్రిటిష్ వలస పాలనలో కూడా ఎన్నికైన స్థానిక ప్రభుత్వాలు అనుభవించాయి. కానీ స్వతంత్ర భారతదేశంలో అవి నామమాత్రంగా మారిపోయి, ప్రజాస్వామ్యాన్ని, అన్ని వర్గాల రాజకీయ భాగస్వామ్యాన్ని పరిహసిస్తున్నాయి. ఒకప్పుడు పటేల్, నెహ్రూ, బోస్, ప్రకాశం పంతులు వంటి గొప్ప జాతీయ నాయకుల్ని తయారు చేసిన స్థానిక ప్రభుత్వాలు ఈవేళ మేధాదారిద్ర్యంతో అలమటిస్తున్నాయి, వనరుల కొరతతో కునారిల్లుతున్నాయి. ఇంటి ముందు పాలన – కంటి ముందు ప్రభుత్వం లేకుండా ఎన్ని విన్యాసాలు చేసినా భారతదేశం బాగుపడదు, రాజ్యాంగ నిర్మాతల లక్ష్యం నెరవేరదు. అందుకే సుభాష్ చంద్రబోస్ జన్మదినోత్సవాన్ని లోక్‌సత్తా గతంలో 'జిల్లా ప్రభుత్వాల దినోత్సవం'గా నిర్వహించింది. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటానికి జమిలి ఎన్నికలు ఓ గొప్ప అవకాశం.

ఇదే సమయంలో ప్రతి ఓటుకూ విలువనిచ్చే దామాషా ఎన్నికల పద్ధతిని కూడా రాష్ట్రాల్లో తీసుకొస్తే అది జమిలి ఎన్నికలకు మరింత సార్థకతను చేకూరుస్తుంది. ఒక్క ఓటు తక్కువ వచ్చినా ఓటమే అనే ఇప్పుడున్న ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ (ఎఫ్‌పీటీపీ) ఎన్నికల విధానం మన దేశంలో పలు ప్రజాస్వామిక అనర్థాలకు దారితీస్తోంది. మనం తెచ్చే మార్పులు ప్రస్తుతమున్న సమస్యలకి పరిష్కారాలనివ్వాలి, అంతేకాని సంక్షోభాన్ని మరింత జటిలం చేయకూడదు.

రాష్ట్రాల్లో ప్రభుత్వాల సారథుల ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఒక్కసారి స్థిరత్వం, నిర్ణీత పదవీకాలం స్థిరపడితే రాష్ట్రాల ఎన్నికలను లోక్‌సభతో సంధానం చేయటం తేలికవుతుంది. శాశ్వత ప్రాతిపదికన, ఒడిదుడుకులు లేకుండా ఎన్నికలు ఒకేసారి నిర్వహించవచ్చు.

ఇక పార్లమెంట్‌కి నిర్ణీత స్థిర కాలవ్యవధి, లోక్‌సభకు ప్రతి ఐదేళ్లకూ సాధారణ ఎన్నికలు, జాతీయస్థాయిలో స్థిరమైన ప్రభుత్వం – వీటన్నిటినీ రాజకీయ ఏకాభిప్రాయం ఉంటే తేలిగ్గానే ఏర్పాటు చేసుకోవచ్చు. పార్లమెంట్‌కి నిర్ణీత స్థిర కాలవ్యవధి ఉండేలా యునైటెడ్ కింగ్‌డమ్ 2011లో తెచ్చిన చట్టం తరహాలో మనమూ చట్టాన్ని అమలు చేయవచ్చు. కాని ఏ మార్పులు తెచ్చినా మనం అనుసరించే బ్రిటీష్ వ్యవస్థలో చట్టసభని ఎప్పుడయినా రద్దు చెయ్యొచ్చు. కాబట్టి ఈనాడు బోలెడంత కసరత్తు చేసి జమిలి ఎన్నికలని జరిపినా జాతీయ స్థాయిలోనో, రాష్ట్రాలలోనో మధ్యంతర ఎన్నికలు వస్తే, మళ్ళీ ఇప్పటి పరిస్థితే వస్తుంది.

ఒకే దేశం – ఒకే ఎన్నికను అమలు చేయటానికి పెద్దఎత్తునే రాజ్యాంగ మార్పుల కసరత్తు కావాలి. అంత ప్రయాసపడినా, ఆ ఒక్కటే అమలు చేయటం వల్ల ప్రయోజనాలు తక్కువ, సమస్యలు ఎక్కువ. ఇప్పుడు జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగ సవరణలు కావాలి. వివిధ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కావాలి. ఒకవేళ ఇంత తతంగం జరిగినా మన వ్యవస్థలో అడపాదడపా మధ్యంతర ఎన్నికలు వచ్చి మళ్ళీ పరిస్థితి మొదటికి వస్తుంది. జమిలి ఎన్నికలు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలలో జరుగుతున్నాయి, తెలంగాణలో 2019లో ముందస్తు ఎన్నికలు జరిగే దాకా కలిపే ఎన్నికలు జరిగాయి. కర్ణాటకలో కొన్నేళ్ళ క్రితం దాకా జమిలి ఎన్నికలు జరిగాయి. కాని ఆ రాష్ట్రాలలో జమిలి ఎన్నికల వల్ల రాజకీయం గాని, పరిపాలన గాని గణనీయంగా మారిన దాఖలాలు లేవు. అంటే జమిలి ఎన్నికల కోసం పడే ప్రయాస కొండని తవ్వి ఎలుకని పట్టిన చందాన ఉంటుంది! కాబట్టి.. లోక్‌సభకు నిర్ణీత స్థిర కాలవ్యవధి, రాష్ట్ర ప్రభుత్వాల సారథులకి ప్రత్యక్ష ఎన్నిక, రాష్ట్రాల అసెంబ్లీలకు దామాషా పద్ధతిలో ఎన్నికలు, నిధులు, అధికారాలుగల స్థానిక ప్రభుత్వాలు కూడా ఉండే ఏర్పాట్లు చేస్తే, యూనియన్-రాష్ట్ర-స్థానిక ఈ మూడు అంచెల్లోనూ ఒకేసారి ఎన్నికలు విఫల ప్రయోగం కాకుండా భారత ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేస్తాయి. ఎప్పుడైతే జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిలో ప్రభుత్వాలు స్పష్టతతో తమ పరిధిలోని అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తాయో దేశ ఆర్థికరంగం కూడా మరింత వేగం పుంజుకుంటుంది, ప్రజలు, ముఖ్యంగా యువత పూర్తిస్థాయిలో తమ సామర్థ్యాన్ని ఆవిష్కరించుకోగలుగుతారు. ✦



## సంక్షోభ సమయంలో ఆర్థిక వృద్ధిని పెంచే బడ్జెట్..

# ఆరోగ్యం, చట్టబద్ధపాలనపై మరింత దృష్టి పెట్టాలి: జేపీ



పార్లమెంటులో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్-2021 ఒక అసాధారణ సంక్షోభాన్ని అవకాశంగా మలిచేందుకు చేసిన అభినందనీయ ప్రయత్నమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 1991లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తరహాలో దీర్ఘకాలిక దృష్టిని కనబరచటంతోపాటు.. మొట్టమొదటిసారిగా ప్రభుత్వం చేయాల్సిన ఆరోగ్యం, మౌలిక వసతులు వంటి అంశాలకు గణనీయ ప్రాధాన్యతనిచ్చారన్నారు. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ రంగానికి చాలాకాలం తర్వాత భారీ కేటాయింపులు చేశారని, ఇందుకోసం తనలాంటివారు పాతికేళ్లుగా పోరాడుతున్నారని జేపీ అన్నారు. అయితే రూ. 90,000 కోట్ల నుంచి 2,23,000 కోట్లకు కేటాయింపులు పెంచుతున్నట్లుగా చూపారుగానీ.. ఇందులో తాగునీరు, పౌష్టికాహారం, పారిశుద్ధ్యాలను కూడా కలిపేసి అంకెల గారడీ చేశారన్నారు. కేవలం ఆరోగ్య సేవల కోసమే రూ.2,23,000 కోట్లు కేటాయించటం అవసరమన్నారు. నిజంగా వనరుల్ని పెంచి రానున్న కాలంలో ఆరోగ్య రంగాన్ని ప్రక్షాళన చేయటానికి పూనుకోవాలన్నారు. ఇప్పటిదాకా జాతీయ స్థాయి ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలూ కలిసి జాతీయాదాయంలో 1.3% కేటాయిస్తున్నాయని, ఇది ప్రపంచంలోనే అతి తక్కువ వ్యయమన్నారు. ఇందులోనూ రాష్ట్రాల వాటాయే 70% దాకా ఉందన్నారు. ఈసారి జాతీయ స్థాయి ప్రభుత్వమే 1% దాకా కేటాయించిందన్నారు. రాష్ట్రాల కేటాయింపుల్ని కూడా కాస్త పెంచి ఈ మొత్తానికి కలిపి.. వాటిని ప్రాథమిక స్థాయిలో ప్రతి కుటుంబానికీ ఒక డాక్టర్‌ని అందుబాటులో ఉంచటంతోపాటు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్‌ను కొనసాగిస్తూనే తృతీయ స్థాయిలో ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేసే పద్ధతిలో వినియోగిస్తే.. ఈ దేశంలో ప్రతి పౌరునికీ మంచి ఆరోగ్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఆరోగ్యం కారణంగా ఆస్తులమ్ముకుని, పనిచేసే సత్తువ లేక ఆదాయాన్ని కోల్పోయి ఏటా కోట్ల మంది పేదలయ్యే విషాదం నుంచి ఈ దేశం బయటపడుతుందన్నారు.

అలాగే ప్రభుత్వం ఇప్పటిదాకా తాను చేయాల్సిన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు వంటి పనులకు ఖర్చు పెట్టాల్సిన నిధుల్ని ప్రభుత్వ సంస్థల నిర్వహణ వంటి పనుల కోసం వెచ్చిస్తూ వేల, లక్షల కోట్లను వృధా చేస్తూ వస్తోందని, ఆ ధోరణికి స్వస్తి చెబుతున్నట్లు ఈ బడ్జెట్‌లో స్పష్టమైన సంకేతాలిచ్చారని జేపీ అన్నారు. ప్రభుత్వ ప్రమేయం అవసరం లేని సంస్థలలో పెట్టుబడులు ఉపసంహరించుకోవటం వల్ల అప్పుల భారం కూడా తగ్గుతుందన్నారు. అలాగే విద్యుత్ రంగంలో పంపిణీ నష్టాలను నివారించేందుకు రూ.3,06,000 కోట్లు దాకా కేటాయించి దృఢ సంకల్పాన్ని కనబరిచారన్నారు. విద్యుత్ పంపిణీ నష్టాల నివారణకు దాదాపు 22 ఏళ్ల క్రితమే నార్ల తాతారావు, జలగం రామారావు, ఈఏఎస్ శర్మ వంటి దిగ్గజాలతో కలిసి లోక్‌సత్తా ప్రయత్నాల్ని ప్రారంభించిందన్నారు. నచ్చిన చోట నుంచి విద్యుత్ కొనుక్కునే విధానం వల్ల పోటీపెరిగి ప్రజలకు ఎంతో డబ్బు ఆదా అవుతుందన్నారు. దేశానికి ఎంతో అవసరమైన సౌర విద్యుత్, బ్యాటరీ టెక్నాలజీ దిశగా కూడా బడ్జెట్‌లో అడుగులు వేశారన్నారు. బొగ్గు ఆధారితం నుంచి చౌకయిన, పర్యావరణహితమైన ప్రత్యామ్నాయ ఇంధనం వైపు భారత్‌ను మళ్లించటానికి ఎంత ఖర్చవుతుందో ఎఫ్‌డీఆర్ అధ్యయనం చేస్తోందని, ఇందుకు 10-15 ఏళ్ల వ్యవధిలో సుమారు రూ.50 లక్షల కోట్లు అవసరమవ్వొచ్చని అన్నారు. రోడ్లు, రైల్వే రంగాలలో కూడా మౌలిక వసతులకు కూడా బడ్జెట్‌లో గణనీయ కేటాయింపులు చేశారన్నారు.

నూతన వ్యవసాయ చట్టాలపై కొన్ని ప్రాంతాల రైతుల్లో అపోహలకు దారి తీసిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), సేకరణపై అధికారిక గణాంకాలను బడ్జెట్‌లో ప్రకటించారని, ఆరేళ్ల క్రితం గోధుమ, వరికి ప్రభుత్వం రూ.98,000 కోట్లు వెచ్చిస్తే, ఇప్పుడు రూ.2,48,000 కోట్లు వెచ్చిస్తోందని జేపీ అన్నారు. ఈ గణాంకాలనే గనక వ్యవసాయ బిల్లులపై చర్చ సమయంలోనే చెప్పి ఉంటే సమస్య జటిలమయ్యేది కాదన్నారు.

స్వచ్ఛ భారత్ అంటే కేవలం మరుగుదొడ్లు కాదని లోక్‌సత్తా తొలి నుంచీ చెబుతోందని, ఈసారి బడ్జెట్‌లో మురుగుపారుదల, వరదనీటి నియంత్రణ తదితర అంశాల మీద కూడా దృష్టి సారించటం మంచి పరిణామమని జేపీ అన్నారు. అయితే పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల మీద దృష్టి పెట్టినా కేటాయింపులు సరిపోవని, నగరీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో వాటిని ఇంకా గణనీయంగా పెంచాలన్నారు. ఆ డబ్బేమీ వృధా పోదని, తిరిగి ఆదాయం రూపంలో ప్రభుత్వానికి మరింతగా వస్తుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో పారిశ్రామిక రంగం 'వి' షేప్ రికవరీలోకి వస్తున్నందున, ఈ రంగం మీద దృష్టి పెట్టటం సముచితంగా ఉందన్నారు. కొవిడ్ నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం మీద ఎక్కువ నిధుల్ని కేటాయించారని, అదే తరహాలో మళ్లీ కేటాయించాలనటం సరికాదన్నారు.


అలాగే ఆర్థిక ఒడిదుడుకులున్నా కూడా 14వ ఆర్థిక సంఘం హయాంలోలాగానే రాష్ట్రాలకు 42% పన్నుల వాటాను ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సును యధాతథంగా ఆమోదించటం హర్షణీయమని జేపీ అన్నారు. అయితే చట్టబద్ధపాలన గురించి మాట్లాడకపోవటం బడ్జెట్‌లో పెద్ద లోపమని జేపీ అన్నారు. వ్యక్తుల భద్రత, స్వేచ్ఛకే కాకుండా.. ఆర్థిక వృద్ధికి కూడా చట్టబద్ధపాలన ఎంతో కీలకమన్నారు. కింది కోర్టుల్లో దాదాపు 3 కోట్ల 50 కేసులు పెండింగ్‌లో ఉండగా, హైకోర్టుల్లో ఒక్కో జడ్జీకి 6,000 - 7,000 కేసుల భారం ఉందన్నారు. ఒక్కసారే కాకున్నా చట్టబద్ధపాలనకు దీర్ఘకాలిక ప్రణాళికను ప్రకటించి రూ.10,000 కోట్లు కేటాయించి ఉంటే చాలా ప్రయోజనం ఉండేదన్నారు.


గతేడాది మన దేశ ఆదాయాలు గణనీయంగా పడిపోయి ప్రపంచంలోనే అసాధారణంగా మొదటి త్రైమాసికంలో 24% లోటు ఏర్పడిందని, మరోవైపు ఖర్చులు పెరిగిపోయాయని, ఇలా మొత్తంగా 9-10 లక్షల కోట్ల భారం పడటం భారత్ లాంటి వర్ధమాన దేశానికి ఇది పెద్ద బరువని, అయినా ఈ ఏడాది బడ్జెట్ రూ. 34,83,236 కోట్ల అంచనాతో ఉందని జేపీ అన్నారు. ఇంత సవాలులోనూ పెట్టుబడుల వ్యయాన్ని గతేడాది కంటే కూడా పెంచి.. కొన్నిటిపై 'సెస్' విధించినా స్థూలంగా పన్నులు పెంచకుండా.. రూ.5,54,000 కోట్ల కేటాయింపులు చేయటం చిన్న విషయం కాదన్నారు. సంక్షోభ సమయంలో ఈ స్థాయి బడ్జెట్‌ను తేవటం, ప్రభుత్వం చేయాల్సిన కీలక బాధ్యతలకు పెద్దఎత్తున కేటాయింపులు అభినందనీయమని, ఇందులో ప్రజాప్రయోజనాలు, పారదర్శకత, హేతుబద్ధత, దూరదృష్టి, సంకల్పం, స్పష్టత ఉన్నాయన్నారు.

**లోక్‌సత్తా ఇచ్చిన స్వతంత్ర నిపుణుల నివేదిక ఆధారంగా తెలుగు రాష్ట్రాలు అడగాల్సింది**

బడ్జెట్ ప్రధానంగా జాతీయ స్థాయిలోనిదైనా, తెలుగు రాష్ట్రాలకు విభజన చట్టంలో పార్లమెంటు ఇచ్చిన హామీలపై ఏళ్ల తరబడి జాప్యం విచారకరమని జేపీ అన్నారు. మౌలిక వసతులకు సంబంధించి తెలంగాణ.. రెవెన్యూ లోటు, పోలవరం, పన్ను రాయితీలు, రాజధాని తదితర అంశాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నిర్దిష్ట వివరాలతో సంఘటితంగా ప్రయత్నించి ఉండాల్సిందన్నారు. అడగందే అమ్మయినా అన్నం పెట్టదన్నారు. విభజన తర్వాత చట్టపరంగా, పార్లమెంటులో ఇచ్చిన హామీలపరంగా ఏపీకి ఎన్ని నిధులు రావాలో, పోలవరం, రాజధాని వంటి నిర్మాణాల్లో కేటాయింపులు ఎంత ఉండాలో స్వతంత్ర నిపుణులతో లోక్‌సత్తాయే ప్రామాణికమైన నివేదికను రూపొందించి అందించిందని, దీన్ని తెలుగేతర రాష్ట్రాల నిపుణులు కూడా ధృవీకరించారని, నివేదికపై వైకాపా ప్రభుత్వమే స్పందించటం లేదన్నారు. ఇతర పార్టీలు, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ఏపీ ప్రభుత్వం విభజన హామీల అమలుకు చొరవ చూపాలన్నారు. ఇతర ప్రభుత్వాల్లాగే ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు కొన్ని ప్రాజెక్టుల్ని బడ్జెట్‌లో ప్రకటించినా, మన వ్యవస్థలో భారీ నిధుల బదిలీ సాధ్యం కాదన్నారు.

మన దేశంలో పనిచేసే వయసులో ఉన్నవారు అధిక శాతంలో ఉండటంతోపాటు ఏటా కోటీ 30 లక్షల మంది కొత్తగా ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారని, నరేంద్ర మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు, నూతన విద్యావిధానం సక్రమంగా అమలై భారతదేశం ఉత్పత్తితో కూడిన ఉపాధిని సాధించాలంటే ప్రజలందరి భాగస్వామ్యం కూడా తప్పనిసరి అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.



















FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS   ISB | Bharti Institute of Public Policy   हैदराबाद विश्वविद्यालय University of Hyderabad


Our prosecution, abysmal in number, is subordinate to and uncoordinated with the police, whose investigation is impeded by the conditions they work in.
As a result, the conviction rate in India (for IPC crimes) stands at 50.4%, whereas it is 92% in the US and 81.7% in Germany!


CHALLENGES TO PROCEDURAL LAWS AND DELAYS
India has almost 10 Lakh civil cases and more than 26 Lakh criminal cases pending in trial courts. But USA has 4.7 Lakh and 73,000 respectively in the federal district courts.
WHY IS THERE SUCH A HUGE DIFFERENCE?
5-9


1. Outdated laws and archaic procedures
2. The role of the judge in deciding the scope and importance of cases is limited and passive.
3. Inadmissability of confessions made before police officers
HOW DO THESE MATTER?
1. 69% of of our prisoners are still under trial. This has resulted in prisons functioning 18% beyond capacity.
2. It takes 1445 days to enforce contracts in India, 400 days on average in other countries. Coincidentally or otherwise, only 20% of cases instituted in trial courts are civil in nature.
6-9


CHALLENGES IN JUDICIARY
There is a common lack of trust in the efficacy of our judicial processes
1. Civil offences do not reach courts owing to extra-judicial settlements or issues brushed under the carpet
Did you know only one fifth of the total the cases instituted in a year in the District and Subordinate courts are civil in nature?
2. Use of English and the cost of litigation deter the judicial accessibility of ordinary, semi-literate or illiterate, and poor people
HAVE THERE BEEN CONSEQUENCES?
7-9


LACK OF TRUST, THUS, NEGLECTS PROBLEMS AND DETERS THEM FROM BEING HEARD. BUT IS IT THE ONLY CAUSE?
1. Lack of personnel -
Approximately, more than a fifth of the sanctioned posts of district & subordinate judges in India is are vacant
2. Lack of upgradation -
The Union and the States on an average spend <1% of their respective budgetary expenditure on the judiciary.
8-9

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th February, 2021 Posting Date 15 &16th of every month


# INDIAN DEMOCRACY AT WORK

## JOIN US FOR THE CONFERENCE

### Theme - Rule Of Law

20TH – 28TH FEBRUARY 2021

VISIT IDAW.IN TO REGISTER

In colaboration with

FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS

ISB | Bharti Institute of Public Policy

हैदराबाद विश्वविद्यालय
University of Hyderabad


**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020